



ESTD: 1999
www.voodayam.com

# వుదయం






హైదరాబాద్ | 17-02-2026 మంగళవారం | సంపుటి : 26 | సంచిక : 338 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on

## సన్నాలకు బోనస్ విడుదల

### 2.17 లక్షల మంది రైతులకు రూ. 514.36 కోట్లు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి) :** ప్రజా ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కార్... దానికి సంబంధించిన రూ.514.36 కోట్లు సోమవారం విడుదల చేసింది. వానాకాలంలో సన్నవడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు ఈ బోనస్ బకాయిలు విడుదల చేసింది. ఈ బోనస్, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అదనంగా లభిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల సన్నబియ్యం రకాలను పండించిన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ధాన్యం లో తేమశాతం, గింజ నాణ్యతను బట్టి ఈ బోనస్ ఖరారు చేస్తారు. గత కొంతకాలంగా బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన రైతులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. పంట పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు పడు తున్న రైతులకు ఈ అదనపు రూ.500 తోడుగా నిలవనుంది.

## స్వప్నకుమారి హత్యపై నివేదిక ఇవ్వండి

### డిజిపికి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి) :** న్యాయవాది జి. స్వప్న కుమారి (34) హత్య కేసులో పోలీసుల తీరుపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. చేవెళ్ల భూ వివాదంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని మృతురాలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, మొయినాబాద్ పోలీసులు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీని కమిషన్ ఆదేశించింది. ఈ నెల 4న చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాదంలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యకు గురైన విషయం తెలి సిందే. ఈ హత్యను నివారించడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపిస్తూ 163 మంది న్యాయవాదులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తన సోదరుడి నుంచే తనకు ప్రాణహాని ఉందని స్వప్న కుమారి పోలీసులకు ముందే ఫిర్యాదు చేశారన్నారు.

మిగతా 2లో

# చేతిలో చెయ్యి



## కాంగ్రెస్ వీణ తెలంగాణ

## 5 కార్పొరేషన్లు 81 మున్సిపాలిటీలు


కొలగాని శ్రీనివాస్


మూడ్ గణేశ్


ధరణి మధుకర్


జి. మమత

### కొత్త మేయర్లు


బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి


మహంకాళి స్వామి


ఉమారాణి

- ఐదు కార్పొరేషన్లు, 81 పుర పీఠాల్లో కాంగ్రెస్ పాగా
- కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు ఒక మున్సిపాలిటీ బీజేపీ ఖాతాలోకి.. స్వతంత్రులు 5
- 18 మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్
- పలు చోట్ల కాంగ్రెస్‌కి మద్దతుగా ఎక్స్ అఫిషియో ఓట్లేసిన బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు
- నర్సాపూర్, మెట్‌పల్లి,ఆమనగల్, మొయినాబాద్, అలియాబాద్‌లో ఒకటైన బీజేపీ, కాంగ్రెస్
- అభ్యర్థుల ఆందోళనలు, నిరసనలతో 11 చోట్ల చైర్మన్ ఎన్నిక రద్దు
- నేడు ఎన్నిక నిర్వహించే అవకాశం
- ఆసిఫాబాద్ 'హస్తం'లో చైర్మన్ పదవి చిచ్చు
- కొత్తగూడెం మేయర్ పీఠం దక్కించుకున్న సీపీఐ
- భైంసా చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్

| కార్పొరేషన్ | మేయర్ | డిప్యూటీ మేయర్ |
|---|---|---|
| కరీంనగర్ | కొలగాని శ్రీనివాస్ (బీజేపీ) | సునీల్ రావు (బీజేపీ) |
| మంచిర్యాల | ధరణి మధుకర్ (కాంగ్రెస్) | సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) |
| నల్గొండ | బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్) | ఎండి అష్రఫ్ అలీ ఆమేర్ (కాంగ్రెస్) |
| మహబూబ్ నగర్ | జి. మమత (కాంగ్రెస్) | ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) |
| కొత్తగూడెం | మూడ్ గణేశ్ (సీపీఐ) | సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్) |
| రామగుండం | మహంకాళి స్వామి (కాంగ్రెస్) | పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్) |
| నిజామాబాద్ | ఉమారాణి (కాంగ్రెస్) | సల్మా తహసీన్ (ఎంఐఎం) |

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఎఎంస్) :** ఉత్కంఠ రేపిన 'పుర'రాజకీయాలకు ఎట్టకేలకు తెరపడింది. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అంతిమంగా ఏ ఏ కార్పొరేషన్లు.. మున్సిపాలిటీల్లో తమ జెండా ఎగురవేశారో తేలిపోయింది. ఆయా పీఠాలు దక్కించుకునేందుకు పార్టీల మధ్య ఒకరిని మించి మరొకరు రచించిన ప్రణాళికలు రాష్ట్ర రాజకీయాలను మరింత రసవత్తరంగా మార్చాయి. పుర పీఠాలు కైవసం చేసుకునేందుకు ఊహించని సంచలనాలు, సమీకరణాలతో ఆయా పార్టీల మధ్య కుదిరిన పొత్తులు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీశాయి. ఇంత కాలం ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్న పార్టీలే ఇప్పుడు అధికారం కోసం ఒక్కటై అందరి నోళ్లపై వేలు వేసుకునేలా చేశాయి. తమ మధ్య ఉన్న వైరం నమ్మించేందుకు పోటీ పడీ మరి తిట్టుకున్న పార్టీలే సోమవారం జరిగిన ఎన్నికలో చెట్టాపట్టా లేసుకుని మేయర్, చైర్మన్ పీఠాలెక్కేశాయి. దీంతో ఇంతకాలం పార్టీల మధ్య సాగిన తిట్ల దండకాలు చర్చనీయాంశంగా మారగా... ఇప్పుడు కుదిరిన స్నేహాలు ఎంత కాలం నిలుస్తాయోననే చర్చ హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రంలో మేయర్, చైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. సోమవారం పలు చోట్ల ఉద్రిక్తల నడుమ ఈ ఎన్నికలు జరుగగా మరికొన్ని చోట్ల వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపల్ కార్పొరేషన్లకు చైర్మన్, వైస్ చైర్మన్, ఏడు కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 11 మున్సిపాలిటీల్లో వాయిదా పడ్డాయి. ఎన్నిక నిర్వహణకు అనుకూల వాతావరణం లేకపోవడంతో ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా నేడు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. కాగా కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేసి.. మేయర్, డిప్యూటీ మేయర్‌లను ఎన్నుకున్నారు. మొత్తం ఏడు చోట్ల ఎన్నికలు జరగ్గా అందులో 5 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. సీపీఐ, బీజేపీ పార్టీలు చెరో కార్పొరేషన్‌పై తమ జెండా ఎగురవేసుకున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగే ఆఖరి క్షణం వరకూ పార్టీలన్నీ.. పదవులు దక్కించుకునేందుకు అస్త్ర శస్త్రాలు ప్రదర్శించాయి. మరోవైపు.. 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరిగినప్పటికీ హంగ్ ఏర్పడిన కారణంగా.. 11 పురపాలికల్లో చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. మిగిలిన వాటిలో చాలా వరకు అధికార కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాలను దక్కించుకోగా.. బీజేపీ, ఎంఐఎం పార్టీలు కైవసం చేసుకున్నాయి.

#### కరీంనగర్ లో వికసించిన కమలం

బీజేపీ.. గత నాలుగు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ కరీంనగర్ మేయర్ పీఠాన్ని అనూహ్యంగా చేజిక్కించుకుంది. మొత్తం 66 స్థానాలకు 30 కార్పొరేటర్లను గెలుచుకున్న బీజేపీ మొదటి నుంచి మేయర్ రేసులో కొనసాగింది. మధ్యలో మంత్రి పొన్నం ప్రభాకర్ తాము కూడా రేసులో ఉన్నామంటూ ప్రకటించడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్రులతో కలిపి ఆ పార్టీకి బలం లేకపోవడంతో బీఆర్ఎస్ మద్దతు అనివార్యం అయింది. కానీ చివరి నిమిషంలో బీఆర్ఎస్ పార్టీ మేయర్ ఎన్నికకు దూరంగా ఉంటామని ప్రకటించడంతో బీజేపీ లైన్ క్లియర్ అయింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 69 ఓట్లు ఉండగా.. బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్ కు 34 ఓట్ల మద్దతు లభించింది. దీంతో ఆయన కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా ఎన్నుకోబడ్డారు. డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు గెలిచారు. కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపిన మేయర్ అభ్యర్థికి కేవలం 21 మంది కార్పొరేటర్ల మద్దతే లభించింది.

మిగతా 2లో

## నిజామాబాద్‌లో సీన్ రివర్స్ చేస్తా

- ఎంపీ ధర్మపురి అర్వింద్



**వుదయం, నిజామాబాద్ :** నిజామాబాద్ కార్పొరేషన్ పాలక వర్గం పదవి కాలం పూర్తయ్యేలోపు సీన్ రివర్స్ చేసి చూపిస్తామని స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తి కాకుండానే ఇక్కడ బీజేపీని మేయర్ పీఠం ఎక్కిస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తుతో బీజేపీ మేయర్ పీఠం చేజారిందన్నారు. అన్ని పార్టీలు కలిసి బీజేపీని స్వల్ప మెజారిటీతో ఓడించాయన్నారు. సోమవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ కు వచ్చిన అక్బరుద్దీన్ హిందువులను దూషించినా ఆత్మభిమానాన్ని అంతా చంపుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిసిపోయాయని మండిపడ్డారు.

మిగతా 2లో

## పట్టణాల్లోనూ మాదే పట్టు

### ఈ ఫలితాలు వారికి చెంపపెట్టు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**వుదయం, మధిర :** కాంగ్రెస్ ను గ్రామీణ పార్టీతో పోల్చి.. బురద చల్లిన వారికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటర్లు భారీ మెజారిటీని కట్టబెట్టారన్న భట్టి... ఇంతటి విజయాన్ని అందించిన ప్రతి ఓటరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిరలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఉంచిన నమ్మకమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయం అని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగేలా తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని భట్టి తెలిపారు. తమ పోటీ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదన్న ఆయన ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతోనే పోటీ పడుతున్నామన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పారిశ్రామికీకరణ ద్వారా భారీగా

మిగతా 2లో

## తొమ్మిది మంది కాంగ్రెస్ ఎంపిలకు లోక్ సభ నోటీసులు

### ప్రధాని స్పీకర్ పై ఎఐ వీడియో ప్రచారం విషయంలో సీరియస్

### మూడు రోజుల్లో వివరణ కోరిన సచివాలయం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం బ్యూరో) :** తొమ్మిది మంది కాంగ్రెస్ నేతలకు లోక్‌సభ సచివాలయం సోమవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ ఓంబిర్లాపై ఏఐ వీడియో ప్రచారం చేశారని ఆ నోటీసుల్లో పేర్కొంది. దీనిపై మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని గడువు విధించింది. సభా హక్కులు ఉల్లంఘించి తప్పుడు వీడియోను ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడింది. మరోవైపు ఇప్పటికే రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. తాజాగా పార్లమెంటు కాంప్లెక్స్‌లోకి వీధి కుక్కను తీసుకురావడంతో పాటు, ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలకు కమిటీ సిద్ధమైంది.

మిగతా 2లో

## రూ.15కోట్లు డిపాజిట్ చేయండి

### విద్యుత్ బకాయిల కేసులోకి గీతం వర్సిటీకి సుప్రీం కోర్టు ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం బ్యూరో) :** నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు గీతం యూనివర్సిటీని ఆదేశించింది. విద్యుత్ బకాయిల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు సోమవారం స్పందించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్సిటీ సుప్రీం కోర్టులో సవాలు చేయగా.... సోమవారం ఈ కేసుపై సుప్రీం విచారణ చేపట్టింది.

మిగతా 2లో

## కాంగ్రెస్, బీజేపీలది అపవిత్ర బంధం

### మాజీ మంత్రి హరీశ్ రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి) :** ఢిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తోన్న కాంగ్రెస్, బీజేపీలు గల్లీలో మాత్రం చేతులు కలుపుతూ వాటాలు వేసుకొని పదవులు పంచుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. దీనికి అలియాబాద్, మెదక్, నర్సాపూర్, అమన్‌గల్ ఎన్నికల ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. కాంగ్రెస్ మార్పు అంటే బీజేపీతో జతకట్టడమేనా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని అధికార పార్టీని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలను గాలికొదిలేశాయని ధ్వజమెత్తారు. సోమవారం మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలపై స్పందించిన హరీశ్ రావు ప్రకటనలో కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని ఈ మున్సిపల్ ఫలితాలు మరోసారి రుజువు చేశాయని చెప్పారు.

మిగతా 2లో

## 42 శాతం కోటా తరువాతే ఎన్నికలు జరుపాలి

### ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆర్. కృష్ణయ్య డిమాండ్



**వుదయం , దేవరకొండ :** బీసీల కుల గణన చేపట్టి, చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండ నియోజకవర్గంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య దర్శి, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బీసీ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్. కృష్ణయ్య మాట్లాడు తూ.. బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

మిగతా 2లో

## దేశీయ ఎఐ సృష్టి పైనే దేశ హోదా




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం బ్యూరో) :** భారత దేశం ఒక కీలకమైన మలుపులో ఉంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) నేడు ప్రయోగశాల లక్ష్యమో లేక కార్పొరేట్ సామర్థ్య పరికరమో కాదు. అది ఒక ఆధిపత్యం, ఆర్థిక గుణకం, రానున్న దశాబ్దాలలో జాతి పోటీతత్వాన్ని నిర్వచించే ఒక వ్యూహాత్మక పరికరం. ఇప్పుడు మనముందున్న ప్రశ్న, భారతదేశం ఎఐలో ముందుండాలా వద్దా అనేది కాదు, మన్నికైన, స్వదేశీ బలాన్ని నిర్మించుకోవడానికి సరైన సమయంలో సరైన చర్యలు తీసుకుంటామా లేదా అన్నదే. ఇండియా ఎఐ మిషన్ ద్వారా సాంకేతికతను ప్రజాస్వామీకరించాలన్న ప్రభుత్వ పద్ధతి ఒక నిర్మాణాత్మక మార్పును సూచిస్తుంది. అందరికీ ఎఐ అన్న నినాదం ఒక ప్రాథమిక సత్యాన్ని సంగ్రహిస్తుంది. కృత్రిమ మేధ అన్నది ఉన్నత పరిశోధన సమూహాలు లేదా కొద్ది పెద్ద సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. అది వ్యవసాయం, ఆరోగ్యం, లాజిస్టిక్స్, రక్షణ, పాలన, విద్య సహా వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించాలి. అది మానవ కేంద్రితంగా, సురక్షితంగా, సమ్మిళితంగా ఉండాలి. ఇండియా ఎఐ మిషన్ లో సురక్షితమైన, విశ్వసనీయమైన ఎఐ స్తంభం ముఖ్యమైంది. పక్షపాత ధోరణి తగ్గింపు, పాత వాసనలను వదిలించుకోవడం, గోప్యతను కాపాడే నిర్మాణాలు, అల్గోరిథం ఆడిటింగ్ సాధనాలు, డీప్‌ఫేక్ గుర్తింపు, ప్రమాద అంచనా ప్రోటోకాల్‌లు అనేవి నియంత్రణ అనంతర ఆలోచనలు కావు. అవి విశ్వసనీయతకు పునాది, ఆధారభూతమైనవి. ఈ స్తంబం కింద ఇప్పటికే 13 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. భద్రతను ఆవిష్కరణలకు అడ్డంకిగా కాకుండా, భారీగా జరిగే వీలు కల్పించే అంశంగా భారత్ గుర్తిస్తుందని సూచిస్తుంది. భారత దేశ భాషాపరమైన, సామాజిక- ఆర్థిక వైవిధ్యానికి అనుగుణంగా భారీ దేశీయ భాషా, బహుళ నమూనాలను నిర్మించాలనేది ఎఐ ఫౌండేషన్ మోడల్స్ పిల్లర్ లక్ష్యం. ఇది వ్యూహాత్మకంగా కీలకం. విదేశీ పునాది నమూనాలపై ఆధారపడడం వల్ల బహిర్గత సంస్కృతి, ఆర్థిక, భద్రతా పక్షపాతలను దేశీయ వ్యవస్థలల్లో పొందుపరిచేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రాంతీయ భాషలను, స్థానిక పాలనా డేటాను, గ్రామీణ ఆర్థిక నమూనాలను అర్థం చేసుకోవడంలో భారత్‌లో శిక్షణ పొందిన నమూనా కేవలం సాంకేతిక అసెట్ మాత్రమే కాదు, అది నాగరికతకు అత్యవసరం. బలమైన పాలనా రక్షణలతో భారతదేశ ఆధారిత డేటాసెట్‌లకు సురక్షితమైన అందుబాటును కల్పించడం ద్వారా, ఎఐ కోశ్ డేటా సార్వభౌమత్వాన్ని బలపరుస్తుంది. డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం, 2023తో కలిపి, భారతదేశం చట్టబద్ధమైన, సురక్షితమైన డేటా ప్రాసెసింగ్ కోసం ఒక చట్టపరమైన నిర్మాణాన్ని రూపొందిస్తుంది. ఈ స్పష్టత పౌరులకు రక్షణకల్పించేటప్పుడు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులలో అనిశ్చితిని తగ్గిస్తుంది. భారత ఎఐ పాలనా మార్గదర్శకాలు విశ్వాసం, న్యాయబద్ధత, జవాబుదారీతనం, భద్రత వంటి ఏడు ప్రధాన సూత్రాలలో లంకె కలిగిన పరిణతి చెందిన చట్రాన్ని అందిస్తాయి. రిస్క్-ఆధారిత పాలన విధానం ఆచరణాత్మకమైనది.

మిగతా 2లో

## రూ.15కోట్లు డిపాజిట్ చేయండి

మొదటి పేజీ తరువాయి..

ఇందులో వీబీసీ సంస్థ, గీతం వర్సిటీ ఒక టేనని ఎస్పీడీసీ తమ తమ వాదనలు వినిపించాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. అయితే వీబీసీ ఫెర్రో అలాయన్ కంపెనీ విద్యుత్ బకాయిలకు తమకు సంబంధం లేదని గీతం యూనివర్సిటీ సుప్రీంలో వాదించింది. వీబీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ నిర్ణయించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. అంతవరకూ నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గీతం యూనివర్సిటీకి సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. కాగా వీబీసీ సంస్థ నుంచి భూములను కొనుగోలు చేసిన గీతం యూనివర్సిటీ రూ.118 కోట్లు బకాయిలు చెల్లించాలని లేకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ ఎస్పీడీసీ గతంలో నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను గీతం యూర్సిటీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ క్రమంలోనే రూ.54 కోట్లు చెల్లించాలని గీతం యూనివర్సిటీని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్సిటీ సుప్రీంలో సవాలు చేసింది. వీబీసీ, గీతం యూనివర్సిటీ ఒకటేనని ఎస్పీడీసీ వాదించింది. మరొకవైపు వీబీసీ చెల్లించాల్సిన బకాయిలు తమను చెల్లించమనడం చట్ట వ్యతిరేకమని గీతం యూనివర్సిటీ వాదించింది.

## 42 శాతం కోటా తరువాతే ఎన్నికలు జరుపాలి

మొదటి పేజీ తరువాయి..

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఆయన శాలువా కప్పి, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై ప్లాస్టిక్ వినియోగం – పర్యావసనాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆర్.కృష్ణయ్య బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్. అరుణ్ కుమార్, వరికుప్పల శ్రీను, వెంకటయ్య, ఏరుకొండ రాము, చోలేటి భాస్కరాచారి, భీమగోని శివ గౌడ్, చెరుపల్లి జయలక్ష్మి , వనం చంద్రకళ, కొండ్ర శ్రీశైలం యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో సీన్ రివర్స్ చేస్తా

మొదటి పేజీ తరువాయి..

కరీంనగర్‌లో మేయర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ నిజామాబాద్‌లో మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంపై స్పందిస్తూ బీఆర్ఎస్‌కు కరీంనగర్ మీదనే ఎందుకు ప్రేమ ఉంది నిజామాబాద్ పై ఎందుకు లేదో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిని నార్కో పరీక్షలు నిర్వహిస్తే నిజం చెప్తారేమో అన్నారు.

**కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ కాపాడుతున్నడు..**

కాళేశ్వరం, ఈ కార్ రేస్ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ ఎందుకు కాపాడుతున్నారు?, ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు, ఫోరెన్సిక్ ల్యాబ్ బిల్డింగ్ ఎందుకు కాలిపోతుంది అనేది ఈ పొత్తులతో తేలిపోయిందని ఎంపీ అర్వింద్ వెల్లడించారు. నిజామాబాద్ లో బీజేపీని ఓడించేందుకు అనైతిక పొత్తుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుడితే ఇందుకు పోలీసులు కూడా సహకరించారని ఆరోపించారు. కొంతమంది పోలీసులు రంగుపులుముకుని వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్ ను ఎత్తుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా పోలీసులు చేశారని ఆరోపించారు.

## కాంగ్రెస్, బీజేపీలది అపవిత్ర బంధం

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్రంలో జెండాలు అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం ఎంతలా దిగజారుతారో ఆయా పార్టీలు ఈ ఎన్నికల్లో నిరూపించాయని విమర్శించారు. గత 12 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ–టీమ్ అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కు బీ–టీమ్ అని బీజేపీ చెప్పిన వన్నీ పచ్చి అబద్దాలన్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని నిరూపించాయన్నారు. బీజేపీతో కలిసి సింగిల్ టీమ్‌గా మారిపోయిందని. ఈ అపవిత్ర కలయిక, ఈ అనైతిక పొత్తు ప్రజలు గుర్తించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం మున్సిపల్ ఫలితాలతో స్పష్టమైందన్నారు. రేవంత్ రెడ్డి నడిపేది కాంగ్రెస్ సర్కారా? బీజేపీ సర్కారా? లేదా బీజేపీ–టీడీపీతో కూడిన సంకీర్ణ సర్కారా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆలియాబాద్ నుంచి అమన్‌గల్ దాకా.. మెట్‌పల్లి నుంచి మెదక్ దాకా మీరు సాగిస్తున్న ఈ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదని అందుకే సిగ్గు వదిలేసి బీజేపీతో కుమ్మక్కైందన్నారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను నిలువరించి అధికారాన్ని చేపట్టడానికి ఏదో ఒక విధంగా ఫలితాలను తారుమారు చేస్తూ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఏమో దేశమంతా బీజేపీ మీద పోరాటం చేస్తే ఇక్కడ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఏమో బీజేపీతో జత కడుతున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే మీరు ఈ కుట్రలకు తెర లేపారని సింగిల్‌గా మా పార్టీని ఎదుర్కొనే దమ్ములేక.. రెండు జాతీయ పార్టీలు ఒక్కటై, బీఆర్ఎస్ మీద దాడి చేస్తున్నాయన్నారు. ఇది తమ విజయానికి నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ అత్యధిక వార్డులు గెలుచుకున్న చోట్ల కూడా కుట్రలు చేసి పదవులు దక్కించుకున్నారని నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కాంగ్రెస్ తీసుకుని, వైస్ చైర్మన్ పదవి బీజేపీకి ఇచ్చారంటే ఇంతకంటే దిగజారుడు రాజకీయం మరొకటి ఉంటుందా? అని మండిపడ్డారు.

## కడియం కావ్యపై చర్యలు తీసుకోండి

### ఈసీకి బీఆర్ఎస్ కంప్లైంట్



**వుదయం, హైదరాబాద్:** వరంగల్ ఎంపీ కడియం కావ్య డబుల్ ఓట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ నేతలు సోమవారం ఫిర్యాదు చేశారు. కడియం కావ్యకు ఎక్స్అఫిషియోగా రెండు ఓట్లు ఉన్నాయని.. వరంగల్ ఎంపీగా వరంగల్ కార్పొరేషన్‌లో ప్రమాణ స్వీకారం చేసి.. మళ్లీ తొర్రూరులో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు విరుద్ధమని.. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. 30 రోజుల ముందే నోటీస్ ఇవ్వాలని.. కానీ, అలా చేయకుండా ఒకటి రెండు రోజుల్లోనే నమోదు చేయించుకుని ఓటు వేయడానికి సిద్ధం అయ్యారని పేర్కొన్నారు. న్యాయపరంగా చెల్లదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరుగుతున్నారని.. ఇక్కడేమో కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ లలితారెడ్డి, పార్టీ నాయకుడు కిశోర్‌గౌడ్ ఫిర్యాదును అందించారు.

## మనోహర్ కుమార్ రాకతో జాగృతికి మరింత బలం

### కల్వకుంట్ల కవిత

**వుదయం, హైదరాబాద్ :** తెలంగాణ జాగృతిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే కావేటి సమయ్య కుమారుడు కావేటి మనోహర్ కుమార్ దంపతులు తమ అనుచరులతో కలిసి అధికారికంగా సోమవారం చేరారు. హైదరాబాద్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి సంస్థలోకి సాదరంగా ఆహ్వానించారు. మనోహర్ కుమార్‌తో పాటు ఆయన సతీమణి కావేటి సబిత, వారి ప్రధాన అనుచరులు కూడా జాగృతి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కావేటి సమయ్య కుటుంబం తెలంగాణ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన కుటుంబమని అన్నారు. మనోహర్ కుమార్ రాకతో తెలంగాణ జాగృతికి మరింత బలం చేకూరిందని పేర్కొన్నారు. జాగృతి సంస్థ చేపట్టే సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో వారు క్రియాశీలక పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నానని కవిత అన్నారు. కాగా, దివంగత నేత కావేటి సమయ్య బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన వారసుడిగా మనోహర్ కుమార్ ఇప్పుడు కవిత గారి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# చేతిలో చెయ్యి



మొదటి పేజీ తరువాయి..

ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించడంతో కరీంనగర్ మేయర్ పీఠం కమలదళం వశమైంది. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆశయం నెరవేరి.. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా రెపరెపలాడింది.

**కొత్తగూడెం కార్పొరేషన్ (సీపీఐ) :**

కొత్తగూడెం కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్‌గా 20వ డివిజన్ నుంచి సీపీఐ తరఫున గెలిచిన మూడ్ గణేష్ నిలిచారు. డిప్యూటీ మేయర్‌గా ఎనిమిదో డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన సిరిపురపు లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిజామాబాద్ మేయర్ పీఠాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నిజామాబాద్‌లో అత్యధిక స్థానాలు గెలిచిన బీజేపీ మొదటి నుంచి మేయర్ పీఠం తమదేనని ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. కాంగ్రెస్, ఎంఐఎం కలిసిపోవడంతో అది ఫలించలేదు. నిజామాబాద్ మేయర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూరగాయల ఉమారాణి ఎన్నికయ్యారు. డిప్యూటి మేయర్‌గా ఎంఐఎంకు చెందిన సల్మా తహసీన్‌ను ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ హస్తగతమైంది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా మమత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా సురేందర్ రెడ్డిని ఎన్నుకున్నారు.

రామగుండం కార్పొరేషన్ (కాంగ్రెస్) రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ వశమైంది. రామగుండం మేయర్‌గా 46వ డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా 57వ డివిజన్ కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్యను ఎన్నుకున్నారు.

**నల్గొండ కార్పొరేషన్ (కాంగ్రెస్) :** తొలిసారిగా నల్గొండ కార్పొరేషన్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. నల్గొండ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 48 డివిజన్లు ఉండగా.. కాంగ్రెస్ 27, బీఆర్ఎస్ 9, బీజేపీ 4, ఎంఐఎం 2, ఏఐఎఫ్‌బీ 4, ఇండిపెండెంట్లు రెండు స్థానాల్లో గెలిచారు. డిప్యూటీ మేయర్‌గా అష్రాఫ్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. ముగ్గురు ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మంచిర్యాల కార్పొరేషన్ (కాంగ్రెస్) :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ హస్తగతమైంది. తొలి మేయర్‌గా ధర్ణి మధు ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా రమ్యను ఎన్నుకున్నారు.

**గూడెం యూటర్న్‌తో చేజారిన పీఠాలు..**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వ్యూహంతో బీఆర్ఎస్ ఆ సెగ్మెంట్‌లో తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. ఇప్పటికే గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలను స్పష్టమైన ఆధిక్యంతో కైవసం చేసుకున్న ఆ పార్టీ సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని సైతం చేజిక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా మోటే సుమలత, వైస్ చైర్మన్‌గా పట్లోళ్ల మాధవి ఎన్నికయ్యారు. మరోవైపు.. ఎక్స్ అఫిషియో ఓటు వేసి తిరిగి వెళ్తున్న గూడెం మహిపాల్‌రెడ్డిని బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటింగ్ ఎలా జరగిందని ప్రశ్నించగా.. కాంగ్రెస్ పార్టీ, స్థానిక నేతను ఉద్దేశించి 'బుల్లెట్ దిగిందా లేదా' అని పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 12, స్వతంత్రులు 4 వార్డుల్లో విజయం సాధించారు. అందులో ముగ్గురు ఇండిపెండెంట్లు కాంగ్రెస్‌లోకి వెళ్లగా ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో రెండు పార్టీల సంఖ్య 13కు చేరింది. దీంతో మున్సిపాలిటీ కైవసం చేసుకుంటామని ధీమాతో ఉన్న కాంగ్రెస్‌కు ఎంపీ రఘునందన్ రావు షాకిచ్చారు. ఆయన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో ఒకే వాహనంలో ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఎక్స్ అఫీషియో ఓటు వేయడంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ గులాబీ వశమైంది.

**భైంసాలో మారిన సమీకరణాలు..**

భైంసా మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోయాయి. సాధారణంగా మున్సిపల్ పీఠాలపై ప్రధాన పార్టీల జెండాలు ఎగురుతుంటాయి, కానీ భైంసాలో మాత్రం స్వతంత్ర అభ్యర్థులు జైత్రయాత్ర సాగించారు. స్వతంత్ర అభ్యర్థులు ప్రధాన పార్టీల బలాబలాలను తలకిందులు చేస్తూ భైంసా మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి తుమొల్ల దత్తత్రి, వైస్ చైర్మన్‌గా మరో ఇండిపెండెంట్ అభ్యర్థి బిబి ఖతిజా సిద్దీఖీ ఎన్నికయ్యారు. ఆరుగురు బీజేపీ అభ్యర్థులు, ఏడుగురు స్వతంత్రులు, ఒక కాంగ్రెస్ అభ్యర్థి కలిసి ఈ స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం గమనార్హం. ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉంటుందని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అభ్యర్థులంతా ఏకమై ఇండిపెండెంట్లను గెలిపించుకోవడం విశేషం. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ తన ఎక్స్–అఫీషియో ఓటును వీరికి అనుకూలంగా వినియోగించడంతో స్వతంత్రుల విజయం ఖాయమైంది.

**చిగురించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తి..**

కామారెడ్డి మున్సిపాలిటీలో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రోజూ మాటల యుద్ధం జరుగుతున్న వేళ కామారెడ్డిలో మాత్రం ఆ రెండు పార్టీలు కలిసిపోయి అందరినీ షాక్ కు గురి చేశాయి. అక్కడి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులను రెండు పార్టీలు పంచుకున్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ 19, బీజేపీ 16, బీఆర్ఎస్ 11, స్వతంత్రులు 3 గెలిచారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసిపోయి మున్సిపాలిటీని దక్కించుకున్నాయి. 38వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆమెను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఇక వైస్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ నుంచి 12వ వార్డు నుంచి గెలిచిన కాసర్ల గోదావరి ఎన్నికయ్యారు.

**బీజేపీ మద్దతులో గట్టెక్కిన కాంగ్రెస్..**

మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ హంగ్ ఏర్పడింది. దీంతో గత 3 రోజులుగా అక్కడ తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది. అలియాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. అందులో కాంగ్రెస్ పార్టీకి 8, బీఆర్ఎస్ పార్టీకి 7, బీజేపీకి 3, ఇతరులు 2 స్థానాల్లో విజయం సాధించారు. అయితే ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఎవరు మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటారనే ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన చైర్మన్ ఎన్నికలో బీజేపీ, ఇతరుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కంఠం శిరీష అలియాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైయ్యారు.

**తొర్రూర్ లో రభస..**

తొర్రూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పరిస్థితి రణరంగాన్ని తలపించింది. ఓటింగ్ జరుగుతున్న సమయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన్ను పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఓ క్రమంలో కాంగ్రెస్ నేతలు ఎర్రబెల్లి పీఏపై దాడి చేశారు. పోలీసుల తీరుపై మండిపడ్డ ఎర్రబెల్లి దయాకర్ రావు ఝాన్సీరెడ్డిని లోనికి అనుమతించి.... తనను పంపకపోవడం ఏంటని ప్రశ్నించారు. అమెరికా పౌరసత్వం ఉన్న ఝాన్సీకి మీటింగ్‌లో కూర్చునే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. చైర్మన్ ఎన్నిక వేళ తాను పార్టీ సభ్యులకు విప్ జారీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన పత్రాలను ఆర్డీవోకు ఇవ్వడానికి తాను అక్కడికి వెళ్లానని స్పష్టత ఇచ్చారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు తనపై అకారణంగా దౌర్జన్యం చేశారని ఎర్రబెల్లి సంచలన ఆరోపణలు చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 వార్డుల్లో గెలుపొందింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓట్లు నమోదు చేయించుకోవడంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. చైర్మన్ ఎన్నికకు ఇరు పార్టీల సంఖ్య సమంగా ఉండటంతో లాటరీ పద్ధతిని చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

**వనపర్తి కాంగ్రెస్ లో ముసలం..**

వనపర్తి కాంగ్రెస్ పార్టీలో ముసలం పుట్టింది. చైర్మన్ పదవిని ఆశించి భంగపడ్డ ఆ పార్టీ సీనియర్ నేత చీర్ల చందర్, మూడోవార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆయన చీర్ల రజిని పార్టీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం భార్యభర్తలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగిందని వాపోయారు. పార్టీకి విధేయులుగా ఉన్న తాము ఎమ్మెల్యే గెలుపు కోసం కృషిచేశామని చెప్పారు. కానీ రాజకీయంగా అనుభవమున్న తమను కాదని, అనుభవం లేని ఇతర వ్యక్తులకు చైర్మన్ పదవి ఇచ్చిన పార్టీ పెద్దల తీరును అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవి ఆశిస్తున్న వ్యక్తులను కనీసం కూర్చోబెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలి కానీ, అలా జరగలేదని ఆరోపిం,చారు. అధిష్ఠానం నుంచి నిర్ణయం సీల్డ్ కవర్లో వస్తుందని చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందే ఎంపీకి మా వనపర్తి మున్సిపల్ చైర్మన్ వీరే అని చెప్పి పరిచయం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తన భార్యకు చైర్మన్ పదవి రానందుకు తాను, నా సతీమణి పార్టీతో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన చీర్ల చందర్.. రాజీనామా లేఖను ఆర్డీవోకు అందజేశామని చెప్పారు.

**జనగామలో రణరంగం...**

జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఆందోళనలు, కౌన్సిల్ హాల్‌లో సభ్యుల మధ్య నెలకొన్న గందరగోళం వల్ల సభ నియంత్రణలో లేదని, అందుకే ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. ఈ మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డులు ఉండగా కాంగ్రెస్ 12 వార్డుల్లో విజయం సాధించింది. దాని మిత్రపక్షమైన సీపీఎం ఒక వార్డును దక్కించుకుంది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా 13 సీట్లలో గెలిచింది. మరో నలుగురు ఇండిపెండెంట్లు గెలిచారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. బీఆర్ఎస్ నేత, జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మళ్లీ ఇరుపార్టీలకు సమానంగా చెరో 14 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దృష్టి మొత్తం ఇండిపెండెంట్ కౌన్సిలర్లపై పడింది. నలుగురు స్వతంత్ర అభ్యర్థుల్లో కాంగ్రెస్‌కు ఇద్దరు, బీఆర్ఎస్‌కు ఇద్దరు మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారం జరగడంతో జనగామ మున్సిపల్ రాజకీయాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. ఎన్నికకు ముందు జనగామలో కిడ్నాప్ కథనాలు కలకలం రేపాయి. తమ కౌన్సిలర్లను ప్రత్యర్థి పార్టీలు కిడ్నాప్ చేశాయని ఒక వర్గం ఆరోపించగా, పోలీసుల ఒత్తిడితో అక్రమంగా కేసులు పెడుతున్నారని మరో వర్గం నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయం వెలుపల వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా గుమిగూడి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఎన్నిక వాయిదా పడటంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. తాము విజయం సాధిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను పోస్ట్‌పోన్ చేయించిందని మండిపడ్డారు. అధికారుల తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని, కలెక్టర్ , పోలీస్ విభాగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు.

మున్సిపల్ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యా న్ని ఖూనీ చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన తనను నామినేటెడ్ ఎమ్మె ల్సీగా గుర్తిస్తూ తనకు రాజ్యాంగబద్ధంగా లభించే ఎక్స్ అఫీషియో ఓటు హక్కును కాంగ్రెస్ ప్రభు త్వం, జిల్లా కలెక్టర్ నిరాకరించారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ మేరకు సోమ వారం ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేస్తూ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా లోకల్ కౌన్సిలర్లు ఓటు వేస్తేనే గెలిచి న తనకు వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడైనా మున్సిపల్ చైర్మన్ కోసం ఎక్స్ అఫీషి యో ఓటు వినియోగించుకునే హక్కు తనకు ఉంటుందన్నారు. కానీ, ఆ హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాయడం ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు.

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ నూతన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు నా కల.. ఆ కల సాకారమై, ఇవాళ అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేస్తుంటే నా మనసు గర్వంతో నిండిపోయింది. నల్లగొండ నా జన్మభూమి, ఇక్కడి ప్రతి గల్లీ నా గుండె చప్పుడు. నల్లగొండను కేవలం ఒక పట్టణంగా కాదు, దేశం గర్వించేలా ఒక 'క్లీన్ – గ్రీన్ – స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే నా జీవిత ఆశయం. రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో సైతం అభివృద్ధి గంగా ప్రవాహంలా సాగుతుంది. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరడమే నా బాధ్యత. మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి, డిప్యూటీ మేయర్‌కి మరియు నూతన కార్పొరేటర్లకు నా అభినందనలు. నాటి ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుండి నేటి స్మార్ట్ సిటీ నిర్మాణం వరకు.. మీ 'కోమటిరెడ్డి' ఎప్పుడూ మీ తోడుగానే ఉంటాడు. మనందరం కలిసి నవ నల్లగొండను నిర్మిద్దాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్ కైవసం చేసుకున్న మున్సిపల్ చైర్మన్ల పీఠాలు (17) :** గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, అయిజ, మూడు చింతపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల. సిరిసిల్ల,ఆలంపూర్.

**బీఆర్ఎస్ కు అవకాశం ఉండి వాయిదా పడ్డవి :** జనగాం, తొర్రూరు, ఇబ్రహీపట్నం, జమ్మికుంట, క్యాతనపల్లి.

**బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నా దక్కని మున్సిపాలిటీ :** ఆమన్ గల్

## స్వప్నకుమారి హత్యపై నివేదిక ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి..

అయినప్పటికీ పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇది విధి నిర్వహణలో తీవ్ర అలసత్వమని న్యాయవాదులు తమ ఫిర్యాదులో (ఎస్.ఆర్. నం. 515/2026) పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, ఘటనపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందజేయాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేశారు.

## పట్టణాల్లోనూ మాదే పట్టు

మొదటి పేజీ తరువాయి..

ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. విస్తరిస్తున్న పట్టణాలను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ శాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్యూర్ – క్యూర్ – రేర్" విధానంతో ముందుకు సాగుతున్నారన్నారు. మున్సిపల్ పరిపాలనలో జవాబుదారీతనం పెంచడానికి, పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్యూర్ – క్యూర్ – రేర్" లక్ష్యమన్నారు.

## తొమ్మిది మంది కాంగ్రెస్ ఎంపిలకు లోక్ సభ నోటీసులు

మొదటి పేజీ తరువాయి..

ఎంపీ రేణుకా చౌదరిపై బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదును రాజ్యసభ ప్రివిలేజ్ కమిటీ స్వీకరించింది. ఈ నెల 23లోగా దీనిపై వివరణ ఇవ్వాలని ఆమెను ఆదేశించినట్టు తెలిసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 1న ఎంపీ రేణుకా చౌదరి ఒక వీధి కుక్కను తన కారులో పార్లమెంటు కాంప్లెక్స్ లోకి తీసుకువచ్చారు.

# దేశీయ ఎఐ సృష్టిపైనే దేశ హోదా

మొదటి పేజీ తరువాయి..

ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, రక్షణ లేదా ప్రజా సేవలలో అధిక–రిస్క్ ఎఐ వినియోగ కేసులు దామాషా ప్రకారం రక్షణలకు లోబడి ఉండాలి.

ప్రతిపాదిత ఎఐ పాలనా బృందం, సాంకేతికత, విధాన నిపుణుల కమిటీ, ఎఐ సేఫ్టీ ఇన్స్టిట్యూట్ – భారతదేశం భారీ పర్యవేక్షణను కాకుండా సంస్థాగత లోతును సిద్ధం చేస్తోందని సూచిస్తున్నాయి.

సెమీకండక్టర్ తయారీ, అధునాతన చిప్ రూపకల్పన పట్ల భారతదేశం తిరిగి ఆసక్తి చూపి, ప్రోత్సహించడం అనేది కూడా అంతే పరివర్తనాత్మకమైన అంశం. కృత్రిమ మేధస్సు కంప్యూట్‌పై నడుస్తుంది, ఈ కంప్యూట్ అనేది చిప్స్ పై ఆధారపడి ఉంటుంది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద కేంద్ర కేబినెట్ ఉత్తర్ ప్రదేశ్‌లో సెమికండక్టర్ తయారీ కేంద్రాన్ని ఆమోదించింది. జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో హెచ్‌సిఎల్, ఫాక్స్‌కాన్ జయింట్ వెంచర్ అయిన ఈ కేంద్రం డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్‌ను తయారు చేస్తుంది. వీటిని అనేకరకాల పరికరాలకు ఉపయోగిస్తారు. ఇది దేశీయ చిప్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతుంది. దేశీయంగా చిప్ ఉత్పత్తి అన్నది బహిర్గత సరఫరా లంకెలపై వ్యూహాత్మక ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. భౌగోళిక రాజకీయ పరిణామాలకు వ్యతిరేకంగా బలాన్ని ఇస్తూ, తక్కువ–వనరుల భాషా నమూనాలు, అంచు విస్తరణలతో సహా భారతీయ ఎఐ పనిభారాలకు అనుగుణంగా రూపొందించిన ప్రాసెసర్ల ఆప్టిమైజేషన్‌ను అనుమతిస్తుంది. దేశీయ ఎఐ పరిశోధన, సురక్షితమైన క్లౌడ్ మౌలికసదుపాయాలు, స్థానికంగా తయరు చేసిన చిప్స్ కలిస్తే, భారతదేశం ప్రపంచ సాంకేతిక పరిజ్ఞాన స్టాక్‌ల వినియోగదారుడి స్థాయి నుంచి స్వంత డిజిటల్ భవిష్యత్తుకు రూపశిల్పిగా మారే దిశగా కదులుతుంది. కాగా, కేవలం విధాన ప ర మైన నిర్మాణమే నాయ క త్వాన్ని అందించదు..

భారతదేశం దీర్ఘ పరిధి గల పరిశోధన, అభివృద్ధిని గణనీయంగా విస్తరించాలి. ఎఐ పరిశోధన, అభివృద్ధిలో, ముఖ్యంగా మూల అల్గోరిథంలు, సెమీకండక్టర్ డిజైన్, ఎడ్జ్ కంప్యూటింగ్, హై పెర్ఫార్మెన్స్




కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, సురక్షితమైన క్లౌడ్ పర్యావరణ వ్యవస్థలలో వ్యూహాత్మక పెట్టుబడి చాలా అవసరం. ప్రభుత్వ నిధులు ప్రైవేట్ మూలధనంలో నిండిపోవాలి, ప్రత్యేకించి విదేశీ వేదికలపై పెరుగుతున్న అప్లికేషన్‌ల కంటే అసలు మేధో సంపత్తిని నిర్మించే డీప్ టెక్ స్టార్టప్‌లకు ఈ నిధులు అవసరం.

సామర్థ్య నిర్మాణం సరైన దిశలోనే కదులుతోంది. ఇండియాఏఐ ఫ్యూచర్ స్కిల్స్ ద్వారా, ప్రభుత్వం ఏఐలో 500 మంది పీహెచ్‌డీలు, 5,000 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, 8,000 మంది అండర్‌గ్రాడ్యుయేట్లకు మద్దతు ఇస్తోంది. టైర్ 2, టైర్ 3 పట్టణాలలో 27 ఇండియాఎఐ డేటా, ఎఐ లాబ్‌లను ఏర్పాటు చేశారు. దాదాపు 543 ఐటిఐలు, పాలిటెక్నిక్‌లకు అదనపు లాబ్‌లను మంజూరు చేశారు. ఇప్పటివరకూ 290 ఫెలోషిప్‌లను అందించారు. ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ (PRIME) ప్రోగ్రామ్ అన్నది ఎంఇఐటివై (ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ), నాస్‌కామ్ మధ్య సహకారంతో నడుస్తోంది. ఇందులో ఇప్పటికే 26లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 16 లక్షలమందిని ఎమర్జింగ్ టెక్నాలజీస్ (ఉద్భవిస్తున్న సాంకేతికతలు)లో శిక్షణ ఇచ్చింది. ఈ పంపిణీ చేసిన నైపుణ్య నిర్మాణం ఏఐ సామర్థ్యం నగర కేంద్రీకృతమైనది కాదని నిర్ధారిస్తుంది.

అయితే తదుపరి దశ, ప్రతిభ వినియోగం నుంచి ప్రతిభ సృష్టికి మారాలి. భారతదేశం పరిశోధనను, విశ్వవిద్యాలయాలలో అంతర్ విభాగ ఏఐ ల్యాబ్‌లు, రక్షణ ఎఐ సహకారాలు, మిషన్–ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారించిన పరిశ్రమ విద్యాసంస్థల కన్సార్టియాను ప్రోత్సహించాలి. ఏఐ పరిశోధన గ్రాంట్లు వివరించదగిన ఏఐ, ఇంధన సమర్థవంతమైన నమూనాలు, సమాఖ్య అభ్యాసం భారతీయ సందర్భాలకు అనుగుణంగా తక్కువ–వనరుల భాషా నమూనాలపై పనిని ప్రోత్సహించాలి.

విస్తరణ కూడా అంతే కీలకం. ప్రజా సేవల పంపిణీ, ఖచ్చితమైన వ్యవసాయం, వాతావరణ నమూనా తయారీ, అంచనా వేసే ఆరోగ్య విశ్లేషణలు, లాజిస్టిక్స్ ఆప్టిమైజేషన్‌లో కృత్రిమ మేధస్సును పొందుపరచాలి. రక్షణ, వ్యూహాత్మక రంగాలలో, ఏఐ– ఆధారిత నిర్ణయ మద్దతు వ్యవస్థలు, స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థలు, సైబర్ స్థితిస్థాపకత జాతీయ భద్రతా ఫలితాలను మలుస్తాయి. ఏఐఅనేది ఐటి అప్‌గ్రేడ్ కాదు. ఇది వివిధ రంగాల వ్యాప్తంగా బలాన్ని పెంచే శక్తి గుణకం.

ప్రైవేట్ రంగం పాత్ర తోసిపుచ్చలేనిది. మేక్ ఇన్ ఇండియా సంస్థలు ఇప్పటికే స్వదేశీ ఆవిష్కరణలను జాతీయ ప్రాధాన్యతలతో ఎలా సమన్వయం చేసుకోవచ్చో ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకు, మెడిసిమ్ విఆర్, ఆరోగ్య సంరక్షణ నిపుణులకు శిక్షణ ఇవ్వడానికి ఏఐ,వర్చువల్ రియాలిటీని ఉపయోగించి అధునాతన వైద్య అనుకరణ సాంకేతికతలను నిర్మిస్తోంది. క్లినికల్ శిక్షణ సామర్థ్యం తరచుగా విస్తరించే దేశంలో, ఏఐ–ఆధారిత లీనమయ్యే అనుకరణ పరిమాణం, వ్యయ–సమర్థవంతమైన, అధిక–విశ్వసనీయ అభ్యాసాన్ని అందిస్తుంది. ఇటువంటి వేదికలు శిక్షణ వైవిధ్యాన్ని తగ్గిస్తాయి, రోగి భద్రతను పెంచుతాయి, ఆరోగ్య సంరక్షణ ఫలితాలను బలోపేతం చేస్తాయి. ప్రపంచస్థాయిలో పోటీతత్వ ఉత్పత్తులను నిర్మిస్తూనే లోతైన సాంకేతిక సంస్థలు ఏఐని అధిక–ప్రభావ రంగాలలోకి ఎలా అనుసంధానించవచ్చో మెడిసిమ్ విఆర్ ఉదాహరణగా చూపిస్తుంది.

భారతదేశం గురించి ప్రపంచ చిత్రణ లేదా ఊహ, దాని సాంకేతిక విశ్వసనీయతపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఏఐ ప్రమాణాలు, ప్రాథమిక నమూనాలు, కంప్యూట్ ఆర్కిటెక్చర్లు, భద్రతా ప్రోటోకాల్‌లను రూపొందించే దేశాలు డిజిటల్ క్రమాన్ని రూపొందిస్తాయి. భారతదేశం పరిమాణం, ప్రజాస్వామ్య పాలన, నైతిక రక్షణలు, సెమీకండక్టర్ సామర్థ్యం, స్వదేశీ ఆవిష్కరణలను మిళితం చేయగలిగితే, అది గ్లోబల్ సౌత్ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు విశ్వసనీయ ఏఐ భాగస్వామిగా ఒకేరకంగా తనను తాను నిలబెట్టుకోగలదు.

అయితే, సమయం చాలా కీలకం. కృత్రిమ మేధస్సు శర వేగంతో ముందుకు సాగుతోంది. నేడు ఆలస్యమైన పెట్టుబడి రేపు నిర్మాణాత్మక ఆధారపడటానికి దారితీస్తుంది. సరైన నియంత్రణ స్పష్టత, సరైన ఆర్థిక ప్రోత్సాహకాలు, సరైన పరిశోధన పర్యావరణ వ్యవస్థలు, సెమీకండక్టర్ సామర్థ్యం, సరైన పరిశ్రమ భాగస్వామ్యాలు ఇప్పుడు కలిసి రావాలి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల అభివృద్ధి, విస్తరణ ఒక నినాదం కాదు. ఇది ఒక వ్యూహాత్మక అజెండా. శాస్త్రీయ దృఢత్వం, సంస్థాగత పరిపక్వత, పరిశోధన, అభివృద్ధిలో నిరంతర పెట్టుబడితో కొనసాగితే, ఏఐ భారతదేశ ఆర్థిక వృద్ధి, సామాజిక పరివర్తన, ప్రపంచ స్థాయిలో మూలస్తంభంగా మారగలదు. అవకాశం చారిత్రాత్మకమైనది. బాధ్యత సమిష్టిది.



# జాతీయం-అంతర్జాతీయం



## ఇజ్రాయెల్ పర్యటనకు ప్రధాని మోడీ?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 25, 26వ తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నట్టు పిటిఐ వార్తా సంస్థ పేర్కొంది. ఆదివారం జరిగిన ప్రధాన అమెరికన్ యూదు సంస్థల అధ్యక్షుల సమావేశంలో ప్రసంగించిన సందర్భంగా, ప్రధాని మోడీ పర్యటన గురించి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మొదటగా వెల్లడించారు.
పార్లమెంటు ప్రసంగం త్వరలో ప్రారంభం కానుంది. వచ్చే వారం ఇక్కడికి ఎవరు వస్తున్నారు? నరేంద్ర మోడీ అని నెతన్యాహు సమావేశంలో అన్నారని పిటిఐ పేర్కొంది. తన పర్యటన సందర్భంగా, ప్రధాని మోడీ ఇజ్రాయెల్ నెస్సెట్ (పార్లమెంట్)ను కూడా ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది.
ఇజ్రాయెల్ భారతదేశం మధ్య అద్భుతమైన మైత్రి ఉంది. మేం అన్ని రకాల సహకారాన్ని చర్చించబోతున్నాం. భారతదేశం ఒక చిన్న దేశం కాదు. దీనికి 1.4 బిలియన్ల జనాభా ఉంది. భారతదేశం అత్యంత శక్తివంతమైనది, అపారమైన ప్రజాదరణ పొందింది అని ఆదివారం ఆ సమావేశంలో నెతెన్యాహూ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి మోడీ పర్యటన ఫిబ్రవరి 25 నుండి 26 వరకు ఉండే అవకాశం ఉందని ఆ ఏజెన్సీలోని ఒక వర్గాలు తెలిపాయి. అయితే మోడీకి ఇజ్రాయెల్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాదరణను బట్టి దాని ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. అయితే, ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటనపై పీఎంఒ కార్యాలయం లేదా విదేశాంగ మంత్రిత్వ శాఖ నుండి ఇంకా అధికారిక ధృవీకరణ వెలువడలేదు. ఇదిలా ఉండగా, ఫ్రెంచి అధ్యక్షుడు ఇమాన్యువల్ మాక్రాన్‌ను ఫిబ్రవరి 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముంబైలో కలుసుకోనున్నారు. ఈ సమావేశం సందర్భంగా ఇరువురు నాయకులు భారత్ ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన ప్రగతిని సమీక్షించనున్నారు. వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకుంటూ, వాటిని నూతన, ఉద్భవిస్తున్న రంగాలలోకి వైవిధ్యీకరించడం పై ఇరువురు నాయకుల మధ్య చర్చ సాగనుంది.
ఫిబ్రవరి 17న మధ్యాహ్నం 3:15 గంటలకు, ఇద్దరు నాయకులు ముంబైలోని లోక్ భవన్‌లో ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటారు. తరువాత, సాయంత్రం 5:15 గంటలకు, ఇరువురు నాయకులు భారతదేశంఫ్రాన్స్ ఆవిష్కరణ సంవత్సరం 2026ని, ప్రారంభిస్తారు. ఇరు దేశాల నుండి వ్యాపార నాయకులు, స్టార్టప్‌లు, పరిశోధకులు. ఇతర ఆవిష్కర్తల సమావేశంలో ప్రసంగిస్తారు.

## వివాహానికి ముందు ఎవరినీ నమ్మకూడదు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం) :** వివాహానికి ముందు ఒక మహిళ, పురుషుడు పూర్తిగా అపరిచితులు అంటూ, భౌతిక సంబంధాలను ఏర్పరచుకునే ముందు కొంత సంయమనం పాటించాలని సుప్రీం కోర్టు సోమవారం హితవు చెప్పింది. వివాహం చేసుకుంటానన్ని నమ్మించి తనపై అత్యాచారం కేసు నమోదైనకేసులోఆరోపణలుఎదుర్కొంటున్నవ్యక్తిబెయిల్‌పిటిషన్‌నువిచారిస్తున్నసందర్భంగాసుప్రీంకీలకవ్యాఖ్యలుచేసింది. ఓ వ్యక్తిగురించిపూర్తివివరాలుతెలియకుండా పెళ్లికిముందేలైంగికసంబంధంలోకిఎలా వెళ్తారని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వివాహానికి ముందు శారీరకంగా కలవాల్సిన అవసరమేముందని జస్టిస్ బీవీ నాగరత్న బాధితురాలిని ప్రశ్నించారు. యువతులు కానీ, యువకులు కానీ వివాహానికి ముందు ఎవరూ ఎవరినీ నమ్మకూడదంటూ హితవు పలికారు. కాగా, ఇరువురు ఒక వివాహ వెబ్‌సైట్‌లో 2022లో కలుసుకున్నారని, నిందితుడు ఆమెను వివాహం చేసుకుంటానన్న తప్పుడు హామీతో భౌతిక సంబంధాలను ఏర్పరచుకున్నాడని బాధితురాలి తరుపు న్యాయవాది వివరించింది. అతడు 2024లో వేరొక మహిళను వివాహం చేసుకున్నాడని ఆమెకు తర్వాత తెలిసిందని న్యాయవాది తెలిపారు. ఆ విషయమై ప్రశ్నించగా ప్రైవేటు వీడియోలు బయటపెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా..అత్యాచారం కేసు నమోదు చేశారు. పెళ్లికి ముందు, ఒక అబ్బాయి, అమ్మాయి అపరిచితులు. వారి బంధం ఎంత బలంగా ఉన్నప్పటికీ.. వివాహానికి ముందు భౌతిక సంబంధంలోకి ఎలా వెళ్లగలుగుతున్నారో అర్థం కావట్లేదు అని జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ కేసు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

### మణిశంకర్ అయ్యర్ x పవన్ ఖేడా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం):** తన మాజీ పార్టీ సహచరులపై తీవ్ర విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ కొత్త వివాదాన్ని లేవనెత్తారు. ఒక జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి శశిథరూర్, జయరామ్ రమేష్, పవన్ ఖేడా సహా పలువురిని విమర్శిస్తూ, రానున్న కేరళ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం పై అనుమానాలు వ్యక్తం చేశారు.
పార్టీలో అంతర్గత విభజనలు దాని అవకాశాలను దెబ్బతీస్తాయని అంటూ, కమ్యూనిస్టులను వ్యతిరేకించడం కన్నా కాంగ్రెస్ నాయకులు ఒకరినొకరు ద్వేషించుకుంటారని అన్నారు.
ఇటీవలే ఆయన సిపిఎంకు చెందిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కొనియాడినప్పటి నుంచీ నడుస్తున్న వివాదం నడుమ అయ్యర్ తాజా వ్యాఖ్యలు వెలువడ్డాయి. రాష్ట్ర ఎన్నికల అనంతరం విజయన్ ఆయన పదవిని నిలుపుకుంటారని ఆయన ఇంతకు ముందు సూచించారు. కాంగ్రెస్ వెంటనే అతని వ్యాఖ్యల నుంచి దూరం జరిగింది. పలు సంవత్సరాలుగా అయ్యర్ పార్టీతో కలిసి లేరని, ఆయన వ్యక్తిగత హోదాలో మాత్రమే మాట్లాడారని ఖేడా పేర్కొన్నారు.
పవన్ ఖేడా తోలుబొమ్మ అన్న అయ్యర్ ఖేడాను లక్ష్యంగా చేసుకొని ఆయన తోలుబొమ్మ అని అయ్యర్ అభివర్ణించాడు. పార్టీ అధికార ప్రతినిధిగా ఆయన పాత్రను ప్రశ్నించాడు. గత రెండేళ్లగా ఖేడా తనను లక్ష్యంగా చేసుకుంటున్నాడని, దాని ప్రతినిధుల ఎంపిక కాంగ్రెస్ ప్రస్తుత స్థితిని ప్రతిబింబిస్తుందని సూచించారు. కేరళ విషయం మాట్లాడుతూ, వ్యక్తిగతంగా కాంగ్రెస్ గెలవాలని తాను కోరుకున్నా, రాష్ట్ర యూనిట్‌లో వర్గాల కారణంగా అది జరగక పోవచ్చని ఆయన అన్నారు.
తిరువనంతపురం నుంచి నాలుగుసార్లు ఎంపీ అయిన థరూర్ విమర్శిస్తూ, ఆయన బలంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకి అని, భారత్ తర్వాత విదేశాంగ మంత్రి కావాలన్న ఆకాంక్షలను కలిగి ఉన్నవాడని అన్నారు. జయరామ్ రమేష్‌ను ప్రస్తావిస్తూ, పార్టీ కమ్యేనికేషన్స్ ఇన్‌చార్జ్ తన స్థానాన్ని పరిరక్షించుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.

**విజయన్‌పై ప్రశంసల వర్షం**

మరికొద్ది నెలల్లో కేరళ ఎన్నికల జరుగనుండగా, విజన్ 2031: డెవలప్‌మెంట్ అండ్ డెమోక్రసీ అనే ఇతివృత్తంతో తిరువనంతపురంలో జరిగిన సెమినార్‌లో అయ్యర్ ప్రసంగించిన తర్వాత ఈ వివాదం చెలరేగింది.
కేరళ ఎన్నికలలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) పాలక లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)ను ఎదుర్కోనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావద్దని రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్ అనేక మంది మేధావులను కోరినట్లు సమాచారం.
తన ఉపన్యాసం సందర్భంగా, తన పార్టీ సహచరులు లేకపోవడం గురించి విచారం వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయి పాలనను బలోపేతం చేయడంలో కేరళ రికార్డును ప్రశంసించారు.
మాజీ పంచాయతీ రాజ్ మంత్రిగా ఉన్న ఆయన, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వికేంద్రీకరణ దార్శనికతను సాకారం చేయడంలో కేరళ ఇతరులకన్నా ముందుకు సాగిందని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వేగంగా స్పందించింది. ఇటీవలి సంవత్సరాలలో అయ్యర్‌కు పార్టీతో ఎటువంటి సంబంధం లేదని ఖేరా సోషల్ మీడియాలో పునరుద్ఘాటించారు. అదే సమయంలో, కేరళ ఓటర్లు యుడిఎఫ్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తారని, మరింత జవాబుదారీ పాలనను హామీ ఇస్తామని, ఎల్‌డిఎఫ్, బిజెపి మధ్య నిశ్శబ్ద సహకారం ఉందని రమేష్ ఆరోపించారు.

## నేరాలు ఏవైనా.. శాంతి భద్రతలను ఢిల్లీ పోలీసులు కాపాడారు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం):** ఢిల్లీ పోలీసు వ్యవస్థ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు శాంతి, సేవ, న్యాయం పట్ల తన నిబద్ధతను నెరవేర్చడంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదని హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఢిల్లీ కేవలం దేశ రాజధాని మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్యానికి, అస్తిత్వానికి గుండెచప్పుడు లాంటిదని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జాతీయ రాజధానిగా ఢిల్లీ భద్రత ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం అత్యంత కీలకమని చెప్పారు. ఢిల్లీలో అనేక జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయాలు, నివాసాలు ఇక్కడే ఉండటం వల్ల ఢిల్లీ పోలీసుల బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. ఢిల్లీ పోలీసులు ఎల్లప్పుడూ ముందంజలో నిలిచి తమ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని అమిత్ షా అభినందించారు. ఢిల్లీ పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సోమవారం ప్రత్యేక విభాగం సమగ్ర ప్రధాన కార్యాలయానికి వర్చువల్ గా శంకుస్థాపన చేసినట్లు అమిత్ షా తెలిపారు. సుమారు రూ. 368 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ కార్యాలయం.. మాదకద్రవ్యాల నియంత్రణ, ఉగ్రవాద నిర్మూలనలో దేశంలోనే అత్యాధునిక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. ప్రధాన కార్యాలయంలో అత్యాధునిక ఇండోర్ ఫైరింగ్ రేంజ్, వార్ రూమ్, సైబర్ ల్యాబ్, శిక్షణ హాలు, ఇతర ఆధునిక సౌకర్యాలు ఉంటాయని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న ఇతర పోలీసు బలగాల స్పెషల్ సెల్ విభాగాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

## అస్సాం సిఎం పై హైకోర్టుకు వెళ్లమన్న సుప్రీం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (వుదయం):** ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వ్యక్తుల పై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రైఫిల్ గురిపెట్టినట్టు చూపుతున్న వైరల్ వీడియో పై చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది.
ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం పిటిషనర్లను గువాహతి హైకోర్టును ఆశ్రయించవలసిందిగా సూచించింది.
గువాహతి హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని పిటిషనర్లను ప్రశ్నిస్తూ, దాని అధికారాన్ని తక్కువ చేయవద్దని వారిని హెచ్చరించింది.
మీరు గువాహతి హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదు? దాని అధికారాన్ని తక్కువ చేయకండి. పార్టీలను సంయమనం పాటిస్తూ, రాజ్యాంగ నైతికత హద్దుల లో ఉండవలసిందిగా కోరతాం, కానీ ఎన్నికలకు ముందు ఇది ఒక ట్రెండ్‌లా తయారవుతోంది అని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.
ప్రతి వ్యవహారం ఇక్కడికే రావడమన్నది మంచి ట్రెండ్ కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. హైకోర్టులను ఇప్పటికే పర్యావరణ, వాణిజ్య లిటిగేషన్ల నుంచి దూరం చేశారని వ్యాఖ్యానించింది.
పిటిషనర్ల తరుపు వాదిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, హిమంత అలవాటుపడిన నేరగాడని అభివర్ణిస్తూ, కనుక ఈ వ్యవహారాన్ని విచారించవలసిందిగా కోర్టుకు విజ్ఞప్తి చేశారు.
అయితే, ధర్మాసనం అందుకు నిరాకరిస్తూ, హైకోర్టును ఆశ్రయించవలసిందిగా పిటిషనర్లను ఆదేశించింది. అంతేకాకుండా, ఈ వ్యవహారంలో విచారణను వేగవంతం చేయవలసిందిగా గువాహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది.
అస్సాం ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని కోరుతూ వామపక్ష నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణించేందుకు ఫిబ్రవరి 10వ తేదీన సుప్రీం కోర్టు అంగీకరించింది.
రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావిస్తూ, వాస్తవంగా ఎన్నికలు జరిగే ముందే ఒక భాగం కోర్టులో పోరాడుతుండటం సమస్య అని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.
శర్మకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌ను వాదిస్తున్న న్యాయవాది నిజాం పాషా పిటిషన్‌లను లిస్టింగ్ చేయడాన్ని పరిగణిస్తామని పేర్కొంది.
శర్మ వైరల్ వీడియో వివాదం ఏమిటి?
పాయింట్ బ్లాంక్ షాట్ పేరుతో ఫిబ్రవరి 7వ తేదీన బిజెపి అస్సాం యూనిట్ ఒక వీడియోను ఎక్స్‌పై పోస్ట్ చేసింది. అందులో శర్మ ఇద్దరు మైనార్టీకి చెందిన వ్యక్తులను గురి చూసి రైఫిల్‌తో కాలుస్తున్నట్టు కనిపించింది. అస్తిత్వం, భూమి, మూలాలు అన్న వాటికి తొలిస్థానం, మీరు పాకిస్తాన్‌కు ఎందుకు వెళ్లారు; బంగ్లాదేశీలను క్షమించేది లేదు. ఈ పోస్ట్‌పై ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఇది చాలా అసహ్యకరమైనది, కలవరపెట్టేది. దీనిని యాదృచ్ఛిక ట్రోల్ కంటెంట్‌గా తోసిపుచ్చలేము. ఇది సామూహిక హింస, మారణహోమానికి పిలుపునిస్తోందంటూ ఎక్స్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. పెరుగుతున్న ఆగ్రహం, రాజకీయ ఖండనల నడుమ బిజెపి ఆ పోస్ట్‌ను తొలిగించింది. కాగా, స్వతంత్ర దర్యాప్తు రాష్ట్ర, కేంద్ర ఏజెన్సీల నుంచి ఆశించలేం కనుక సుప్రీం కోర్టే ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఏర్పాటు చేయాలని పిటిషనర్లు కోరారు. రాజ్యాంగ పదవులలో ఉన్న వ్యక్తులు ఇటువంటి విభజనాత్మక వ్యాఖ్యలు చేయకుండా నిరోధించేందుకు ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా 12మంది వ్యక్తులు వేరుగా పిటిషన్ దాఖలు చేశారు.

## రాజస్థాన్‌లో అగ్నిప్రమాదం 7గురి మృతి



**జైపూర్, ఫిబ్రవరి 16 (వుదయం):** సోమవారం ఉదయం రాజస్థాన్‌లోని భివాడీలో ఒక రసాయన పరిశ్రమలో జరిగిన బలమైన పేలుడులో ఏడుగురు కార్మికులు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఢిల్లీ, జైపూర్‌కు పంపారు. వారి పరిస్థితి క్లిష్టంగా ఉన్నట్టు తెలుస్తోంది.
ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని దుస్తుల పరిశ్రమగా నమోదు చేశారని, అయితే టపాకాయలను అక్కడ తయారు చేస్తున్నారని సాక్షులు చెబుతున్నారు. ఘటనా స్థలి నుంచి గన్‌పౌడర్‌ను, టపాకాయలను, పాకేజింగ్ చేసే కంటైనర్లను స్వాధీనం చేసుకున్నారు.
ఈ ప్రమాదం సోమవారం ఉదయం 9.30 గంటలకు ఖుష్‌ఖేడా కరౌలి పారిశ్రామిక ప్రాంతంలో జరిగింది. భారీ అగ్ని కారణంగా ఘటనా స్థలికి చేరుకున్న సహాయక బృందాలు పరిశ్రమ సమీపంలోకి కూడా వెళ్లలేకపోయారు. ఆ ప్రమాదం జనాన్ని భయభీతులను చేసేలా ఉంది. శరీరాలు కాకుండా అస్తిపంజరాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. భివాడి ఏడీఎం సుమిత్ర మిశ్రా మాట్లాడుతూ, ఉదయం 9:30 గంటల ప్రాంతంలో, భివాడి పోలీసులు ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా, పారిశ్రామిక ప్రాంతంలోని ప్లాట్ నంబర్ జి1118 బిలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో మంటలు చెలరేగినట్లు గమనించామని చెప్పారు. మృతులందరూ బీహార్‌ఉత్తరప్రదేశ్ నివాసితులుగా భావిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమానిని రాజేంద్రగా గుర్తించారు.అతను తివారీ అనే వ్యక్తికి ఫ్యాక్టరీని అద్దెకు ఇచ్చాడు.
సోమవారం ఉదయం ఒక కర్మాగారంలో పేలుళ్లు, అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందిందని అగ్నిమాపక దళ ఇన్‌ఛార్జి నరేష్ మీనా తెలిపారు. సంఘటనా స్థలానికి ఆరు కంటే ఎక్కువ అగ్నిమాపక వాహనాలను పంపినప్పటికీ, పేలుళ్లు, కర్మాగారంలో పెద్ద మొత్తంలో కార్డ్‌బోర్డ్ నిల్వ ఉండటం వల్ల మంటలను ఆర్పడం చాలా కష్టమైందని ఆయన అన్నారు. మృతదేహాలు అస్థిపంజరాలుగా మారాయి. భద్రతా కారణాల దృష్ట్యా, సమీపంలోని ఇతర కర్మాగారాలను ఖాళీ చేయించామని, ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్టు వివరించారు.
ప్రాణనష్టంపై ప్రధానమంత్రి సంతాపం రాజస్థాన్‌లోని భివాడీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పీఎంఓ ఇండియా ఒక సందేశాన్ని పొందుపరుస్తూ రాజస్థాన్‌లోని భివాడీలో జరిగిన అగ్ని ప్రమాదం విషాదకరం.. తీవ్ర దు:ఖదాయకం. ఆత్మీయులను కోల్పోయిన వారికి నేను నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ దుర్ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అన్న మోడీ సందేశాన్ని పోస్ట్ చేసింది.






# బంగ్లా రాజకీయాల్లో నూతన అధ్యాయం

### జమాత్ నేతను కలిసిన బిఎన్‌పి అధిపతి రెహమాన్



**ఢాకా, ఫిబ్రవరి 16 (వుదయం):** బంగ్లాదేశ్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి రెండు రోజుల ముందు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధిపతి తారిఖ్ రెహమాన్ ఆదివారం జమాతే ఎ ఇస్లామి అధిపతి షఫీకర్ రెహమాన్ ను, నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు నహిద్ ఇస్లాంలను కలిశారు. ఇది బంగ్లాదేశ్ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ప్రధానంగా బంగ్లాదేశ్‌లో రాజకీయాలు అవామీ లీగ్ అధిపతి షేక్ హసీనా, బిఎన్‌పి మాజీ అధిపతి దివంగత ఖలీదా జియా మధ్య గల శత్రుత్వం చుట్టూ తిరుగుతుండేవి. ఈ ఎన్నికలలో అవామీ లీగ్‌ను పోటీ చేసేందుకు నిషేధించడంతో, బిఎన్‌పి 49.97 శాతం ఓట్ల శాతం, 209 సీట్లతో మూడొంతుల మెజారిటీ సాధించగా, 1971లో పాకిస్తాన్ నుంచి విడిపోవడాన్ని వ్యతిరేకించిన జమాత్‌ఎ ఇస్లామీ గతంలో ఎన్నడూ లేని విధంగా 31.76 శాతం ఓట్లు, 68 సీట్లతో రాణించింది. జమాత్ అధిపతి షఫీకుర్ రెహమాన్‌ను ఆయన ఇంటివద్ద తన పార్టీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ అలంగిర్‌తో కలిసి తారీక్ రెహమాన్ కలిశారు. అనంతరం, బిఎన్‌పి మీడియా విభాగం ఇరు ప్రత్యర్థి పార్టీ నాయకులు పక్కపక్కన నిలబడి ఉన్న ఫోటోను విడుదల చేసింది. అందులో తారీక్ రెహమాన్‌కు ఇచ్చేందుకు షఫీకుర్ రెహమాన్ పుష్పగుచ్ఛం పట్టుకుని నిలబడి ఉండడం కనిపిస్తోంది.
దేశ 13వ సార్వత్రిక ఎన్నికలలో అఖండ విజయం సాధించిన బిఎన్‌పి చైర్మన్ తారిక్ రెహమాన్ నేడు బంగ్లాదేవ్ జమాత్‌ఎఇస్లామీ అమీర్ డా. షఫీకుర్ రెహమాన్‌ను ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు అని బిఎన్‌పి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. బంగ్లాదేశ్ ఎన్నికల అనంతరం ఈ సమావేశాన్ని సానుకూల రాజకీయ ఆరంభంగా అభివర్ణిస్తున్నారు.

**జమాత్, ఎన్‌సిపి ఏమన్నారు?**

షఫీకుర్ రెహమాన్ గృహాన్ని తారీక్ సందర్శించడం మా జాతీయ రాజకీయ ప్రయాణంలో ఒక కీలక క్షణం. చర్చ, బాధ్యతాయుతమైన స్ఫూర్తితో ఈ కలయికను జమాత్ స్వాగతిస్తుంది అని అంటూ, సంస్థాగత పరిపక్వత, పరస్పర గౌరవంలో నూతన అధ్యాయానికి ఇది సూచన అని పార్టీ ఎక్స్‌పై పోస్ట్ చేసింది. చర్చల సందర్భంగా, ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నట్టు తారీక్ రెహమాన్ పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష మద్దతుదారులు, మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగే హానిని పరిష్కరించడానికి చర్యలు కూడా తీసుకుంటున్నట్టు తెలిపారని ఆ పోస్ట్ తెలిపింది. జాతీయ ప్రయోజనాలపై మేము పూర్తిగా సహకరిస్తాం, అయినప్పటికీ దృఢమైన, సూత్రప్రాయమైన ప్రతిపక్షంగా మా రాజ్యాంగ విధిని నిర్వర్తిస్తాం అని జమాత్ పేర్కొంది, ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం ఎక్కడ పనిచేస్తుందో, మేం మద్దతు ఇస్తాం. జవాబుదారీతనం అవసరమైన చోట, మేంమాట్లాడుతాం, అని జమాత్ పేర్కొంది.
అనంతతరం జమాత్ మిత్రపక్షమైన నేషనల్ సిటిజెన్స్ పార్టీ (ఎన్‌సిపి) కన్వీనర్ నహీద్ ఇస్లామ్‌ను బిఎన్‌పి నాయకుడు తారిక్ రెహమాన్ కలుసుకున్నారు. ఇస్లామ్ నివాసానికి కూడా రెహమాన్ వెళ్లారు. ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి ఎన్సీపీ నాయకుడు స్వాగతించినట్టు ప్రభుత్వ వార్తా సంస్థ బంగ్లాదేశ్ సంగ్‌బాద్ సంస్థ (బిఎస్‌ఎస్) పేర్కొంది.

**బంగ్లా ఎన్నికల ఫలితాలను సవాలు చేసిన జమాత్**

అంతకు ముందు, బంగ్లాదేశ్ ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ, తమ అభ్యర్థులను అన్యాయంగా పరాజయం పాలు చేసిన 32 నియోజకవర్గాలలో రీకౌంటింగ్ జరిపించాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. దానితో పాటుగా తమ మాజీ మిత్రపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) విజయాన్ని గుర్తిస్తూ ఫేస్‌బుక్‌లో పెట్టిన సందేశాన్ని కూడా పార్టీ తొలగించింది. గత గురువారం ఎన్నికలు జరుగగా, శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. కాగా, ఈ సమావేశానంతరం ఆ ఫిర్యాదు పరిస్థితి ఏమిటన్నది తెలియరాలేదు.

**బంగ్లాదేశ్ నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారం ఫిబ్రవరి 17న**

జాతీయ పార్లమెంటు సముదాయంలోని సౌత్ ప్లాజాలో బిఎన్‌పి చైర్మన్ రెహమాన్ చేత అధ్యక్షుడు మహమ్మద్ షాహబుద్దీన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమానంతరం, రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా స్పీకర్ షిరిన్ షర్మిన్ చౌదరికి బదులుగా కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులతో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఎఎంఎం నాసిర్ ఉద్దీన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.
రాజ్యాంగంలోని మూడవ షెడ్యూల్ ప్రకారం, పదవీ విరమణ చేయబోయే పార్లమెంటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు మూడవ ఎంపికగా సిఇసి ఆ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారు.

## జె&కెలో తెరుచుకోనున్న పర్యాటక ప్రాంతాలు



**కశ్మీర్, ఫిబ్రవరి 16 (వుదయం):** జమ్ముకశ్మీర్‌లోని కీలక గమ్యస్థానాలలో పర్యాటకం తిరిగి ప్రారంభం కానుంది. ఇందులో అనేక ప్రాంతాలను 2025 పహల్‌గావ్ తీవ్రవాద దాడి అనంతరం మూసివేశారు.
కశ్మీర్‌లోని 11 పర్యాటక స్థలాలు తక్షణమే తెరుచుకుంటాయని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. ఇందులో బుద్గాంలోని యూస్ మార్గ్, దూధ్‌పత్రి , కెకర్నాగ్‌లో దండిపోరా పార్క్, షోపియాన్‌లోని పీర్‌కి గాలి, దుబ్జాన్, పద్‌పవన్, శ్రీనగర్‌లోని అస్తాన్‌పొరా, టులిప్ గార్డెన్, గందర్‌బల్‌లోని తజ్వాస్ గ్లేసియర్, హంగ్ పార్క్, బారాముల్లాలోని వుల్లార్ ఉన్నాయి.
జమ్ము డివిజన్‌లో, రెయిసీలోని దేవి పిండి, రాంబన్‌లోని మహుమంగత్, కిష్టావర్‌లోని మొగల్ మైదాన్ కూడా తక్షణమే తెరుచుకుంటాయి.
మంచు తొలిగించే కార్యకలాపాలు పూర్తి అయితే, జమ్ము డివిజన్‌లోని రాంబన్‌లోని రామ్‌కుంద్‌తో పాటుగా కశ్మీర్ డివిజన్‌లోని గురేజ్, అథ్వాటూ, బంగస్ తెరుచుకుంటాయి.



> నేనొక ఎస్సీ మహిళను. జనరల్ కేటగిరి పురుషుడిని నేను పెళ్లి చేసుకుంటే నా కులం మారిపోతుందా?
> – అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్న ఒక దళిత మహిళ ప్రశ్న
>
> * ఒక వ్యక్తి ఏ కులంలో పుట్టారో అది ఆ వ్యక్తి మతం మారినా అలాగే ఉంటుంది. ఇతర కులం వ్యక్తిని పెళ్లి చేసుకున్నా సొంత కులం మారదు – కొంతమంది వ్యక్తులు తనను కులం పేరుతో దూషించారని ఆ మహిళ చేసుకున్న ఫిర్యాదు మేరకు అలహాబాద్ హైకోర్టు ఈ విధంగా తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ అలీగఢ్ కు చెందిన జాట్ కులస్థుని పెళ్లి చేసుకున్న ఆ ఎస్సీ మహిళ కోర్టులో ఫిర్యాదు చేయడంతో ఈ కేసు తలెత్తింది. తొమ్మిది మంది వ్యక్తులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద కింది కోర్టులో తమపై దాఖలైన పిటిషన్ ను కొట్టి వేయాలని వేసిన అప్పీలుపై అలహాబాద్ హైకోర్టు ఇలా తీర్పు చెప్పింది.

## వేమన పద్యం

అన్నమిడుటకన్న అధిక దానంబుల
నెన్న చేయనేమి యెన్న బోరు
అన్నమెన్న జీవనాధార మగునయా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# కులం–కులవివక్ష

కులం పోవాలి, కుల మతాలకు అతీతమైన సమాజం రావాలన్నది ఆధునికుల అభ్యుదయ వాదుల చిరకాల ఆకాంక్ష.ఇందుకు అనుగుణంగా రాజ్యాంగంలో సర్వస మానత్వ సూత్రాలను చేర్చుకున్నాము. అంటే స్వాతంత్ర్యానికి ముందు వరకు గల నిచ్చెన మెట్ల కులవ్యవస్థలోని పై, కిందుల –ఉచ్ఛ నీచాల సామాజిక దుర్మార్గానికి పట్టుకొమ్మగా ఉండిన అంటరానితనం, శ్రమ ద్వేషాలను నిర్మూలించడం ధ్యేయంగా ఈ ఏర్పాటు చేసుకున్నాము.గత సమాజంలోని అసమానతలకు స్వస్తి చెప్పి నిజమైన సమసమాజాన్ని నిర్మించుకోదలిచాము. అయితే వాస్తవం మనం కోరుకుంటున్నాదానికి భిన్నంగా ఉన్నది. గ్రామీణ సమాజంలో కుల విభేదాలు, అణచివేతలు ఇంకా కొనసాగుతున్నాయని చాటే సంఘటనలు తరచూ సంభవిస్తున్నాయి. గ్రామీణులు తరలి వచ్చే పట్టణాలు, నగరాలకు కూడా కులవివక్ష పాకుతున్నది.

కులం అనేది కేవలం శ్రమ విభజనకు ఉద్దేశించింది మాత్రమే కాదని, శ్రామికులను మెట్ల మాదిరిగా ఒకరి పైన మరొకరిని పేర్చిన సామాజిక శ్రేణుల వ్యవస్థ అని అంబేడ్కర్ చెప్పింది కఠోర వాస్తవం.కుల వ్యవస్థ వర్ణాశ్రమ విధానాన్ని సమర్థించిన హిందూ శాస్త్రాల నుంచి పుట్టిందని, దానిని పూర్తిగా నాశనం చేయడం తప్ప సంస్కరించడం సాధ్యం కాదని బాబా సాహెబ్ అన్నది సైతం నిజం.కుల నిర్మూలనమా లేక కులం తో బాటు దానిని ఆశ్రయించి అమలవుతున్న నీచ పరిగణనను, సామాజిక అణచివేతను తొలగించడమా? అనేది ముఖ్యం.రాజ్యాంగంలో చేర్చిన రిజర్వేషన్లు సామాజిక, విద్యాపరమైనవి కావడం గమనించవలసిన అంశం.

అలహాబాద్ హైకోర్టు తాజాగా ఇచ్చిన ఒక తీర్పులో పుట్టుకతో వచ్చిన కులం మనిషిని జీవితాంతం పెనవేసుకుని ఉంటుందని స్పష్టం చేసింది.

జాట్ ను వివాహం చేసుకున్న ఒక దళిత (ఎస్ సి ) మహిళపై కొందరు ఆమె కులం పేరున దూషిస్తూ దాడి చేశారు. దానితో ఆమె ఎస్ సి, ఎస్ టి అత్యాచారాల చట్టం ప్రత్యేక న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు.ఆ కోర్టు పంపిన సమన్ల పై వారు హైకోర్టుకు వెళ్లారు. ఒక జాట్ ను పెళ్లి చేసుకున్నందున ఆమెకు భర్త కులమే వర్తిస్తుందని, ఆమె ఇక ఎంతమాత్రం ఎస్ సి కాదని, అత్యాచార నిరోధక చట్టం రక్షణలు ఆమెకు వర్తించవని వాదిస్తూ నిందితులు అలహాబాద్ హకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విధంగా వారు ఎస్ సి ఎస్ టి స్పెషల్ కోర్టు సమన్లను సవాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్నా మతం మారినా జన్మతః సంక్రమించిన కులం మాత్రం శాశ్వతమని అది పోదని అలాహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు దేశంలో విచిత్ర పరిస్థితిని సృష్టిస్తున్నది. ఈ తీర్పు అట్రోసిటీ చట్టం కింద కేసు వేసిన ఆమెకు తాను ఆశించిన మేలు చేస్తుంది. కాని కులం పోవాలనుకున్న వారి ఆశలను ప్రస్తుతానికి వమ్ము చేస్తుంది.కులాంతర వివాహాలే కులనిర్మూలనకు ముఖ్యం అనే వారి వాదనా వాడిని కోల్పోతుంది. కులం పోకపోయినా, దానితో పాటు వర్ణాశ్రమ ధర్మం ప్రకారం కింది కులాలను, శ్రామిక సేవాకులాలను, అట్టడుగు బడుగు జనాలను తక్కువగా చూసి,వెలి బురద పూసి అంటగట్టిన సామాజిక న్యూనత సమూలంగా నిశ్శేషంగా తొలగిపోవడం ముఖ్యం. అది జరగనంతవరకు భారతదేశాన్ని ఈ సామాజిక కుష్టు వదలదు.అయితే కులం, కులవివక్ష పాముల్లా పెనవేసుకున్న మాట నిజం.


## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


## విస్తరాకుల చెట్టు కవిత



నీలాకాశం కింద
నీడలు కూడా ఎండిపోయిన
చోట
మోదుగ చెట్టు తలెత్తుతుంది
మూడేసి మూడేసి ఆకులు
పచ్చని హస్తాలను చాచి
పూలకు మార్గం చూపుతాయి
అగ్ని పుడుతున్న కాలానికి
పచ్చదనం కాస్తా
వినయంగా నిలబడుతుంది
పువ్వులు ఎరుపు నారింజ
గుత్తులుగా
చిలక ముక్కులా వంగి
నవ్వుతాయి
కొమ్మలన్నీ ఎర్రని జ్వాలలై
మెరిసిపోతాయి
పూలలోని పుప్పొడి
వడగాలిలో చిమ్మి
వసంతాన్ని అద్దుతుంది
ఓ... విస్తరాకుల మోదుగా ,
ఆకులు లేకుండా కూడా
అందంగానే ఉంటావు
నీ అందం త్యాగం లో
పుట్టింది
నీవోక కాంతి పూల తోటవు .




మండాది గోపీనాథ్
98850 45344


# జనాభా పైకి.. సౌకర్యాలు కిందికి

రాష్ట్రంలోని 116 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు ముగిసి, అధికారం కైవసం చేసుకున్న పార్టీల నేతలతో కొత్త పాలక వర్గాలు కొలువు దీరుతున్నాయి.మునిసిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నికలో ఎన్నెన్ని ట్విస్టులో మనం చూస్తూనే ఉన్నాం. కౌంటింగ్ ఒక వైపు జరుగుతుండగానే క్యాంపు రాజకీయాలుమొదలు కావడం మహత్తర సన్నివేశం. ఎన్నికలలో పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో , లేదో తెలియకుండా, తమ పార్టీ కి అధికారం దక్కుతుందో లేదో అన్నదానితో నిమిత్తం లేకుండా, తమ అభ్యర్థిని ఎదుటి పక్షం ఎగరేసుకుపోతుందేమో నన్న భయంతో ఎవరికి వారు క్యాంపు రాజకీయాలకు తెరతీసినట్టు మీడియా కథనాలు చూశాం. అంటే ప్రజలు ఫలానా పార్టీపై విశ్వాసం ఉంచి, నమ్మి ఓటు వేస్తే, ఆ అభ్యర్థి పట్టుమని నలభై ఎనిమిది గంటలలోనే ఏ పార్టీ వైపు చూస్తాడో నని ,బి ఫారం ఇచ్చిన పార్టీలే భయపడే కాలం వచ్చిందంటే ఎన్నికల ప్రజాస్వామ్యం ఎంత దివ్యంగా ఉందో అర్థమవుతుంది. హంగ్ వచ్చిన చోట ఇండిపెండెంట్ అభ్యర్థులను ,ఇతరులను తమవైపు తిప్పుకోవడానికి పడుతున్న పడరానిపాట్లూ చూస్తూనే ఉన్నాం. వీటన్నింటిలో ఓటరుకు ఇక ఏమీ సంబంధం లేదు. ఓటు వేసి, పోలింగ్ బూత్ నుంచి బయటకు వచ్చిన దానితో సరి. ఇక ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక రోజు ప్రజాప్రతినిధులు చాలాచోట్ల వివిధ క్యాంపులనుంచి బస్సులలో దిగుతూ ఉంటే ప్రజాస్వామ్య క్యాంపు రాజకీయాల దృశ్యం కనువిందు చేసింది. కొండకచో కొన్ని చోట్ల క్యాంపు నుంచి తిరిగివస్తున్న ప్రజా ప్రతినిధుల బస్సులనూ ఎదుటి పక్షం అడ్డుకున్న సందర్భాలూ చూశాం. ఇక రానున్న ఐదేళ్లూ ఓటరు మహాశయులది ప్రేక్షక పాత్ర.

**విమర్శలతో సరి :** ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా వాడిన భాష, చేసుకున్న విమర్శల గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఎన్నికలంటే తాము చేయదలచుకున్న మంచి గురించి చెప్పి ప్రజల మనసులను గెలుచుకునే ప్రయత్నం కాక, ఎదుటి పక్షంపై వీలైనంత ఎక్కువ దుమ్మెత్తిపోయడమే లక్ష్యంగా ప్రచారం సాగడం ప్రజాస్వామ్యానికి ఏ రకంగానూ మంచిది కాదు. అయితే ఇటువంటి అనుచిత పద్ధతి తగదని చెప్పడం, సూక్తిముక్తావళిగా మిగిలిపోతున్నది. ఇక ధనబలం గురించి చెప్పనవసరమే లేదు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన వేళ ఆయా మునిసిపాలిటీలు , మునిసిపల్ కార్పొరేషన్లముందు ఎన్నో సవాళ్లు కనిపిస్తున్నాయి. వాటిని ఈ పాలక పక్షాలు ఎలా ఎదుర్కొని ముందుకుసాగుతాయన్నది ప్రశ్న.

### ఈనాటిది కాదు మునిసిపల్ పాలన

పట్టణ ప్రాంతాల పాలన మనదేశానికి కొత్త కాదు. ప్రాచీనమైనదే. మరి మనం మన చరిత్ర నుంచి ఏం నేర్చుకున్నాం. ఇంత ప్రాచీన వ్యవస్థనుంచి మనం పొందిన అనుభవం ఏమిటి అన్నదే అసలు ప్రశ్న.




> *స్వాతంత్రం వచ్చే నాటికి మన దేశ అప్పటి జనాభాలో కేవలం 17 శాతం మాత్రమే పట్టణాలలో నివసిస్తున్నారు. కానీ 2011 జనాభా లెక్కల ప్రకారం, తెలంగాణాలో పట్టణ ప్రాంత జనాభా సుమారు 38.64 శాతంగా ఉంది. దేశ సగటుకంటే తెలంగాణాలోనే పట్టణ జనాభా పెరుగుతోందని గణాంకాలు సూచిస్తున్నాయి. .ఈ ఏడాది నాటికి దేశ జనాభాలో 38 శాతం మంది పట్టణాలు,నగరాలలో నివసిస్తున్నారని అంచనా. 2050 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని భావిస్తున్నారు. అంటే భవిష్యత్తులో పట్టణాలు, నగరాలపై మరింత ఒత్తిడి పెరగనుంది. ఇప్పటికే పల్లెలనుంచి పట్టణాలకు వలసలు భారీగా పెరిగాయి. మరి అలాంటపుడు పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పట్టణాలు, నగరాలలో మౌలిక సదుపాయాలను ఏ మేరకు మెరుగు పరుచుకుంటున్నామన్నది ప్రశ్న. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఏర్పాట్లతో కాలం వెళ్ల దీయడం కాక, పట్టణాలు, నగరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా దీర్ఘకాలిక వ్యూహాలను ఏమేరకు రూపొందించి అమలు చేస్తారన్నది అసలు ప్రశ్న.*

సింధూలోయ నాగరికతను పరిశీలించి చూసినపుడు హరప్ప, మొహంజదారోలలో పట్టణ పాలన ఎంత గొప్పగా విలసిల్లిందో చరిత్రకారులు ప్రత్యేకంగా పేర్కొన్నారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనూ నగరాధ్యక్ష, నగర రక్షక్ వంటి పదాలు నగర పాలనకు సంబంధించిన విషయాలలో కనిపిస్తాయి. ఆ తర్వాత వివిధ రాజవంశాల కాలంలోనూ వివిధ పేర్లతో పుర, పట్టణ పాలనకు ఏర్పాట్లు ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలన కాలంలో దేశంలో తొలిసారిగా 1688 సెప్టెంబర్ 29న లో మద్రాస్ మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటైంది. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకు బొంబాయి, కలకత్తాలలో మునిసిపల్ కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. పూర్వపు నిజాం పాలనలో 1869లో తొలిసారిగా హైదరాబాద్ మునిసిపల్ బోర్డు ఏర్పాటైంది. ఇక ఆ తర్వాత మునిసిపల్‌పాలనకు సంబంధించి స్వాతంత్రం అనంతరం వివిధ మునిసిపల్ చట్టాలు వచ్చాయి. మునిసిపాల్ పాలనకు సంబంధించి రాజ్యాంగ 74వ సవరణ చట్టం –1992 కీలక మలుపుగా చెప్పుకోవచ్చు. 1993 జూన్ 1 నుంచి ఇది అమలులోకి వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ణీత కాలంలో నిర్వహించవలసిన తప్పని సరి పరిస్థితిని ఇది తీసుకువచ్చింది. తెలంగణా రాష్ట్ర అవతరణ అనంతరం ఎన్నో కొత్త మునిసిపాలిటీలు అవతరించాయి. పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న సంకల్పం మంచిదే.

### పెరుగుతున్న పట్టణ జనాభా

స్వాతంత్రం వచ్చే నాటికి మన దేశ అప్పటి జనాభాలో కేవలం 17 శాతం మాత్రమే పట్టణాలలో నివసిస్తున్నారు. కానీ 2011 జనాభా లెక్కల ప్రకారం, తెలంగాణాలో పట్టణ ప్రాంత జనాభా సుమారు 38.64 శాతంగా ఉంది. దేశ సగటుకంటే తెలంగాణాలోనే పట్టణ జనాభా పెరుగుతోందని గణాంకాలు సూచిస్తున్నాయి. .ఈ ఏడాది నాటికి దేశ జనాభాలో 38 శాతం మంది పట్టణాలు,నగరాలలో నివసిస్తున్నారని అంచనా. 2050 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని భావిస్తున్నారు. అంటే భవిష్యత్తులో పట్టణాలు, నగరాలపై మరింత ఒత్తిడిపెరగనుంది. ఇప్పటికే పల్లెలనుంచి పట్టణాలకు వలసలు భారీగా పెరిగాయి. మరి అలాంటపుడు పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పట్టణాలు, నగరాలలో మౌలిక సదుపాయాలను ఏ మేరకు మెరుగు పరుచుకుంటున్నామన్నది ప్రశ్న. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఏర్పాట్లతో కాలం వెళ్ల దీయడం కాక, పట్టణాలు, నగరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా దీర్ఘకాలిక వ్యూహాలను ఏమేరకు రూపొందించి అమలు చేస్తారన్నది అసలు ప్రశ్న.

**కోవిడ్ నేర్పిన పాఠం :** పట్టణ ,నగర ప్రజల ఆరోగ్య సంరక్షణ చర్యలలో మనం ఎంత వెనుకబడి ఉన్నామన్నది కోవిడ్ సందర్భంగా బట్టబయలైంది. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య రంగం పటిష్టతకు, ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు మొదలయ్యాయి. అలాము ప్పుముంచుకువచ్చినపుడు పరుగులు తీయడం కాక, రాబోయే తరం అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ, నగర ప్రణాళికలు రూపొందించుకుంటే పట్టణాలు మరింత నివాసయోగ్యంగా ఉంటాయి.

### మునిసిపల్ వ్యర్థాలు, మురుగు సమస్య

ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా పట్టణాలు నగరాలు ఎదుర్కొంటున్న అతి పెద్దసమస్య, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలికసదుపాయాల కల్పన. ఉపాధి , మునిసిపల్ వ్యర్థాలను వదిలించుకోవడం, మురుగునీటి సమస్యను పరిష్కరించడం, అలాగే జలవనరులను కాపాడుకోవడం , వాయు కాలుష్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం వంటివి మునిసిపాలిటీల ముందున్న సవాళ్లు. ఇందుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయి. వీటికి నిధులు సమకూర్చుకోవడం, మునిసిపాలిటీలకు తలకు మించిన భారం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులపై కాలం వెళ్లదీయాల్సిరావడం అవీ సకాలంలో అందక పోవడంతో నిధుల సమస్యతో ఇవి సతమతమౌతుండడం చూస్తున్నాం. అలాగే సామాన్యుడికి సైతం స్వంత గూడు లభించే స్థితిలో పట్టణ ప్రణాళికలు రూపొందించవలసి ఉంది. ప్రజారవాణా వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటే అంతగా సామాన్యులు ప్రయోజనం పొందగలుగుతారు. శివారుప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత లభించినపుడే సామాన్యులు , వలసజీవులు పట్టణాలలో తమ జీవనాన్నిసజావుగా సాగించడానికి వీలు కలుగుతుంది. అలాగే వాతావరణ మార్పులకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ఇవాళ చర్చ జరుగుతోంది. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా, పర్యావరణ హిత విధానాలను మునిసిపాలిటీలు అమలు చేయవలసి ఉంది. ఇందుకు సంబంధించిన అవగాహన మునిసిపల్ పాలక వర్గాలకు ఉంటేనే వాటిని బాధ్యతతో అమలు చేయడానికి వీలుంటుంది.

**సమగ్ర ప్రణాళిక..** ఎన్నికైన \పురపాలక ప్రజాప్రతినిధులపై ప్రజలకు కోటి ఆశలు ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యూహంతో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు రూపొందించి వాటి అమలుకు కదలాలి. చిరువ్యాపారులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల ఆరోగ్యకరమైన జీవనానికి, ఉపాధి కల్పనకు మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల పాలక మండళ్లు తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.




రేవూరు ఉమామహేశ్వరరావు,
సీనియర్ జర్నలిస్ట్


## ఆధునిక జీవన సూత్రం

# తామరాకు మీద నీటిబొట్టు

జీవితం అనేది ఒక గొప్ప ప్రయాణం. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతాయి, కొత్త బంధాలు ఏర్పడతాయి, ఎన్నో బాధ్యతలు మన భుజాల మీదకు వస్తాయి. కానీ, వీటన్నింటి మధ్య మనల్ని మనం కోల్పోకుండా, మనసులోని ప్రశాంతతను ఎలా కాపాడుకోవాలి? దీనికి మన పెద్దలు ఒక అద్భుతమైన మాట చెప్పారు ,తామరాకు మీద నీటిబొట్టులా బతకమని. ఇది వినడానికి ఏదో కవితలా అనిపించినా, దీని వెనుక ఒక గొప్ప జీవిత సత్యం ఉంది. తామరాకు బురదలో పుట్టి నీటిలో పెరిగినా, ఆ బురదను గానీ, ఆ నీటిని గానీ తనకి అంటించుకోదు. దాని పవిత్రత ఎప్పుడూ తగ్గదు.

అంతెందుకు, తామరాకు మీద పడ్డ నీటిబొట్టు కూడా అంతే! ఆ ఆకు మీద ఉంటుంది కానీ, ఆకును తడి చేయదు. అది ఎప్పుడూ తన ఉనికిని తాను కాపాడుకుంటూనే ఉంటుంది. మనం కూడా అంతే ఈ లోకంలో ఉంటూ, అన్ని బాధ్యతలు నెరవేరుస్తూనే, వేటికీ అతిగా అతుక్కుపోకుండా ఉండటమే నిజమైన జీవన సూత్రం. నిజానికి ఈ రోజుల్లో మనం బతుకుతున్న తీరు చాలా సంక్లిష్టంగా మారిపోయింది. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక సవాలు, ఎవరో ఒకరి అంచనాలు, ఇంకేదో ఒత్తిడి,మనల్ని చుట్టుముడుతూనే ఉన్నాయి. ఇంటి బాధ్యతలు, ఆఫీసులో పోటీ, ఆర్థిక ఇబ్బందులు,వీటన్నింటి మధ్య పడి అసలు మనల్ని మనం మర్చిపోతున్నాం. మనం చేసే పనులు, మన బంధాలు, మనం సంపాదించే ఆస్తులు,ఇవన్నీ మన మనసుకి విడదీయలేనంతగా అతుక్కుపోతున్నాయి. అందుకే, రేపు పొద్దున వాటిలో చిన్న మార్పు వచ్చినా లేదా ఏదైనా కోల్పోయినా తట్టుకోలేనంత బాధ పడుతున్నాం. మరి తామరాకు మీద నీటిబొట్టులా ఉండటం అంటే ఏంటి? అది లోకాన్ని వదిలేసి ఎక్కడికో పారిపోవడం కాదు, బాధ్యతల నుండి తప్పుకోవడం అస్సలే కాదు. అది కేవలం మన చూపును మార్చుకోవడం మాత్రమే. మనం అందరితోనూ ఉండాలి, అన్ని పనులూ చేయాలి, కానీ వేటికీ అతిగా అతుక్కుపోకూడదు. ఒక ఆరోగ్యకరమైన దూరాన్ని పాటించాలి. బంధాలను ప్రేమిద్దాం, కానీ అవే మన జీవితం అనుకుని వాటిపైనే ఆధారపడకూడదు. లక్ష్యం కోసం కష్టపడదాం, కానీ ఆశించిన ఫలితం రాకపోయినా కుంగిపోకుండా ఉండాలి. అదే అసలైన బతుకు మరి ఈ జీవన శైలిని అలవాటు చేసుకోవడం ఎలా? దీనికి కావాల్సింది మొదటగా మనం ఎవరో మనం తెలుసుకోవడం. మనం చేసే ఉద్యోగమో, మన సంపాదనలో, లేదా ఇంట్లో మనకున్న హోదా మాత్రమే మనం కాదు. ఇవన్నీ జీవితంలో మనం పోషించే పాత్రలు మాత్రమే! కానీ మన అసలు గుర్తింపు వీటన్నింటికీ అతీతమైనది. మనం ఒక స్వచ్ఛమైన ఆత్మ అని, ఒక శక్తి అని మనకు అర్థమైతే ఏ పరిస్థితి వచ్చినా కుంగిపోకుండా ధైర్యంగా ఉండగలం. రెండవది, అనాసక్తి ని అలవాటు చేసుకోవడం. అనాసక్తి అంటే ఏదో విరాగిలా మారిపోవడం కాదు, లేదా బాధ్యతల్ని గాలికొదిలేయడం కాదు. మనం చేసే ప్రతి పనిని పూర్తి మనసుతో, అంకిత భావంతో చేయడం,కానీ దాని ఫలితం మీద మాత్రం అతిగా ఆశ పెట్టుకోకపోవడం. ఉదాహరణకు ఒక విద్యార్థిని తీసుకోండి. తను పరీక్షల కోసం శక్తివంచన లేకుండా కష్టపడి చదువుతాడు. తన వంతు ప్రయత్నం తను చేస్తాడు. కానీ రిజల్ట్స్ ఎలా వస్తాయో అని అనవసరంగా టెన్షన్ పడి ఆరోగ్యం పాడు చేసుకోడు. మార్కులు బాగా వచ్చినా, రాకపోయినా ప్రశాంతంగా ఉండగలుగుతాడు. ఎందుకంటే, కష్టపడటం మాత్రమే తన చేతుల్లో ఉందనీ, ఫలితం కాదని అతనికి తెలుసు. ఇదే నిజమైన అనాసక్తి! మూడవది, వర్తమానంలో బతకడం నేర్చుకోవాలి. గతం గురించి ఆలోచిస్తూ బాధపడటం, భవిష్యత్తు గురించి భయపడటం,ఈ రెండూ మన మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఆ నీటిబొట్టును చూడండి,అది ఆ క్షణంలో ఆ తామరాకు మీద ఉండటం గురించి మాత్రమే ఆలోచిస్తుంది. అంతకుముందు ఏ ఆకు మీద ఉందో అని బాధపడదు, రేపు ఎక్కడికి జారిపోతుందో అని భయపడదు. మనం కూడా అంతే! చేస్తున్న పని ఏదైనా, మాట్లాడుతున్న మనిషి ఎవరైనా,ఆ క్షణంలో పూర్తిగా అక్కడే ఉండాలి. నాల్గవది, వివేకాన్ని పెంచుకోవాలి. వివేకం అంటే మరేదో కాదు,ఏది శాశ్వతం, ఏది తాత్కాలికం అని తెలుసుకోవడం. డబ్బు, పేరు, హోదా, ఈ శరీరం కూడా ఇవన్నీ ఎప్పటికైనా మారిపోయేవే. కానీ మన మనసులోని ప్రశాంతత, మన ప్రేమ, మన మంచితనం మాత్రమే శాశ్వతంగా మిగిలేవి. తాత్కాలికమైన వాటి మీద అతిగా ఆశలు పెట్టుకుంటే అవి పోయినప్పుడు బాధ తప్పదు. అదే శాశ్వతమైన విలువలపై దృష్టి పెడితే, బయట ఎన్ని మార్పులు వచ్చినా మనం చెలించం. ఐదవది, బంధాల్లో సమతుల్యత. మన బంధువులను, స్నేహితులను ప్రాణప్రదంగా ప్రేమించాలి, గౌరవించాలి. కానీ ఏ ఒక్కరి మీద కూడా పూర్తిగా ఆధారపడకూడదు. ఎవరి ప్రయాణం వారిదే! కొంతకాలం కలిసి నడవడం అనేది ఒక అందమైన జ్ఞాపకం మాత్రమే, కానీ అది మన జీవితాధారం కాకూడదు. మనం ఒంటరిగా ఉన్నా కూడా సంతోషంగా ఉండగలగాలి. ఇది స్వార్థం కాదు, ఆత్మవిశ్వాసం. మన ఆనందానికి బాధ్యత మనదే కానీ, ఆ భారాన్ని ఇతరుల మీద వేయకూడదు. ఆరవది, గెలుపోటములను సమానంగా తీసుకోవడం. జీవితంలో ఒక్కోసారి గెలుస్తాం, ఒక్కోసారి ఓడిపోతాం.. ఇది చాలా సహజం. గెలిచినప్పుడు ఆకాశంలో విహరించకూడదు, ఓడినప్పుడు కుంగిపోకూడదు. రెండూ మనకు పాఠాలు నేర్పేవే! గెలుపు మనకు నమ్మకాన్ని ఇస్తే, ఓటమి మనం ఇంకా ఏం నేర్చుకోవాలో చెబుతుంది. ఏడవది, డబ్బు, సుఖభోగాలతో జాగ్రత్తగా ఉండాలి. మంచి ఇల్లు, కారు, సౌకర్యాలు ఉండటం తప్పు కాదు. కానీ అవే మన జీవిత పరమార్థం కాకూడదు. అవి మనం వాడుకోవడానికి ఉన్న సాధనాలు మాత్రమే కానీ, మనం వాటికి బానిసలు కాకూడదు. అవి ఉన్నా లేకపోయినా మన మనశ్శాంతి చెదరకూడదు. ఎనిమిదవది, నిస్వార్థంగా సేవ చేయడం. మన ఎదుగుదల మాత్రమే కాకుండా, పక్కవారికి కూడా ఏదో ఒక మేలు చేయాలి. అయితే, ఆ సేవ ఏదో పేరు కోసమో, గుర్తింపు కోసమో చేయకూడదు. మనం చేసే మంచిని ఎవరైనా గుర్తించినా గుర్తించకపోయినా, అది మన బాధ్యత అని మనస్ఫూర్తిగా చేయాలి. తొమ్మిదవది, మన శరీరాన్ని, మనసుని జాగ్రత్తగా చూసుకోవడం. మనం ఏదైనా సాధించాలన్నా, ప్రశాంతంగా ఉండాలన్నా మన ఆరోగ్యం బాగుండాలి. మంచి ఆహారం, తగినంత నిద్ర, కొంచెం వ్యాయామం, ధ్యానం,ఇవే మనల్ని దృఢంగా ఉంచుతాయి. ఆరోగ్యం బాగుంటేనే ఏ సవాలునైనా ఎదుర్కోగలం. చివరిగా, ఓర్పుగా ప్రయత్నించడం. తామరాకు మీద నీటిబొట్టులా బతకడం అనేది ఒక్క రోజులో వచ్చే విద్య కాదు. ఇది ఒక నిరంతర సాధన. ఒక్కోసారి మనం పాత పద్ధతుల్లోకే జారిపోవచ్చు, విఫలం కావచ్చు. కానీ పర్వాలేదు! ముఖ్యం ఏమిటంటే ,మళ్ళీ నిలబడటం, మళ్ళీ ప్రయత్నించడం. అలా చేస్తూ ఉంటే, ఏదో ఒక రోజు ఇది మన సహజ స్వభావంగా మారిపోతుంది. ఇలా జీవించడం వల్ల కలిగే లాభాలు అన్నీ ఇన్నీ కావు. మొదటిది, ప్రశాంతత. ఎప్పుడైతే మనం బయట జరిగే విషయాల మీద అతిగా ఆధారపడటం మానేస్తామో, అప్పుడు మన మనశ్శాంతిని ఎవరూ చెడగొట్టలేరు. రెండోది, మంచి బంధాలు. మన సంతోషం కోసం ఎదుటివారిని ఇబ్బంది పెట్టనప్పుడు, ఆ సంబంధాలు మరింత అందంగా మారతాయి. మూడోది, సరైన నిర్ణయాలు. ఆవేశకావేశాలకు లోనుకాకుండా నిలకడగా ఆలోచిస్తే, ఎలాంటి సమస్యనైనా సరిగ్గా పరిష్కరించగలం. ఇక నాలుగోది, మనోధైర్యం. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా సరే, మనం డీలా పడిపోకుండా స్థిరంగా నిలబడగలం.అయితే, ఇక్కడ మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. తామరాకు మీద నీటిబొట్టులా ఉండటం అంటే,రాయిలా మారిపోవడం కాదు, ఎవరి మీదా ప్రేమ లేనట్టు నటించడం అంతకంటే కాదు. మనం అందరినీ ప్రేమించవచ్చు, కానీ ఆ ప్రేమ మనల్ని బంధించేదిగా ఉండకూడదు. మనం కష్టపడి పని చేయవచ్చు, కానీ అది ఒత్తిడిగా మారకూడదు. మనం ప్రతి క్షణాన్ని ఆస్వాదించవచ్చు, కానీ అది వేరే దేని మీదో ఆధారపడి ఉండకూడదు. ఇది ఒక సున్నితమైన Balance సాధన చేస్తే ఇది ఖచ్చితంగా మనందరికీ సాధ్యమే ఈ రోజుల్లో లోకం ఎంత వేగంగా మారిపోతుందో మనం చూస్తూనే ఉన్నాం. టెక్నాలజీ, సోషల్ మీడియా, ఈ పోటీ ప్రపంచం ఇవన్నీ మన జీవితాల్ని గందరగోళం చేస్తున్నాయి. ఎప్పుడూ ఏదో ఒక సమాచారం, వేల రకాల ఆప్షన్లు, వీటికి తోడు ఒత్తిడి. ఇలాంటి సమయంలోనే మనకు ఆ తామరాకు మీద నీటిబొట్టు తత్వం చాలా అవసరం. అది మనకు ప్రశాంతంగా, బ్యాలెన్స్‌డ్‌గా ఎలా ఉండాలో నేర్పిస్తుంది. నిజానికి, ఈ పద్ధతిలో బతకడం వల్ల మనకే కాదు, సమాజానికి కూడా మేలే! మనలో అహంకారం తగ్గి, జాలి,కరుణ పెరిగినప్పుడు,మనం ఒక మంచి పొరుగువారిగా, మంచి సహోద్యోగులుగా, బాధ్యతగల పౌరులుగా మారతాం. అవసరానికి మించి సంపాదించాలనో, విచ్చలవిడిగా ఖర్చు చేయాలనో మనం పరుగెత్తం. దీనివల్ల పర్యావరణానికి, సమాజానికి కూడా ఎంతో మంచి జరుగుతుంది. తామరాకు మీద నీటిబొట్టు అనేది కేవలం కవిత్వం మాత్రమే కాదు, అది ఒక పవర్‌ఫుల్ జీవన విధానం. ఈ లోకంలో ఉంటూనే, లోకం మనల్ని కంట్రోల్ చేయకుండా ఎలా బతకాలో ఇది చూపిస్తుంది. బంధాల్లో ఉంటాం కానీ అవి మనల్ని బంధించవు. బాధ్యతలు నెరవేరుస్తాం కానీ అవి మనకు భారం కావు. ఇలాంటి స్వేచ్ఛ, ప్రశాంతతను పొందడమే నిజమైన విజయం! ప్రతి రోజూ ఒక కొత్త అవకాశమే. ఈ రోజు నుండే చిన్న చిన్న అడు గులు వే యడం మొదలుపెడదాం. నిరంతర ప్రయ త్నంతో ఈ జీవన శైలిని మన సొంతం చేసుకుం దాం. లోకం లోఉం టూనే,లోకానికి అంటకుండా, స్వతంత్రం గా, స్వచ్ఛంగా బతకడం నేర్చుకుందాం. అదే జీవితానికి నిజమైన సార్థకత.




డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169


## సంథాలీల స్వంత లిపి ఒల్ చికి

సంథాల్ సమాజానికి స్వంత భాష, సాహిత్యం, సంస్కృతి ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కొత్త ఢిల్లీలో సోమవారం నిర్వహించిన ఒల్ చికీ లిపి శతాబ్దోత్సవాలను ఆమె ప్రారంభించారు. తన స్వంత లిపి లేకపోవడంతో సంథాలీ భాషలను రోమన్, దేవనాగరి, ఒరియా, బెంగాలీ లిపులలో రాసేవారు. నేపాల్, భూటాన్, మారిషియస్‌లలో నివసిస్తున్న సంథాల్ వర్గం ఆయా దేశాలలో ప్రాబల్యం ఉన్న లిపులలో రాసేవారు. అయితే, ఈ లిపులు సంథాలీ భాషకు చెందిన ఉచ్చారణను సరిగ్గా ప్రతి ఫలించలేకపోయేవి. 1925లో పండిత్ రఘునాథ్ ముర్ము ఒల్ చికి లిపిని కనుగొన్నారు. అప్పటి నుంచీ సంథాలీ భాషకు దానినే ఉపయోగిస్తున్నారు. నేడు, ఈ లిపి ప్రపంచవ్యాప్తంగా సంథాల్ గుర్తింపుకు శక్తివంతమైన చిహ్నంగా ఉంది. ఇది సంథాల్ సమాజంలో ఐక్యతను నెలకొల్పడానికి ఒక ప్రభావవంతమైన మార్గమైంది.

### సవరణ

సోమవారం (16-02-2026) నాటి మా సాహిత్య పేజీ 'ఉష'లో సీరియల్ కవితా శీర్షిక 'భారతీయ' కవిత కింద ప్రచురించిన అనువాద కవిత 'నాతోడు' తెలుగు అనువాదకులు డాక్టర్ దర్భశయనం శ్రీనివాసాచార్య అని గమనించగలరు.

– ఎడిటర్



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (వుదయం):**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ , అదనపు కమిషనర్ లు , విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. హెడ్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కి మొత్తం 28 ఫిర్యాదులు,వినతులు పౌరుల నుంచి అందాయి. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విభాగాల వారీగా వచ్చిన ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు . కార్యక్రమంలో అదనపు కమిషనర్ లు సత్యనారాయణ, మంగతాయారు, విజిలెన్స్ ఏఎస్పీ నరసింహా రెడ్డి, చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్,అదనపు, సీసీపీ శ్రీనివాస్ జాయింట్ కమిషనర్ లు జయంత్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

**జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (వుదయం) :**

నేటి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ (టిటియు) డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచిగా నిలుస్తూ విలువైన మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర మరింత ప్రాధాన్యత సంతరించుకుందని ఆయన అన్నారు. అనంతరం టీజీవో జిల్లా అధ్యక్షులు వైద్యనాథ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ ముందంజలో ఉందని, ఉపాధ్యాయుల పక్షాన నిలబడే ఇలాంటి సంఘం ఉండటం ఆనందకరమని అన్నారు. సీఎంవో వెంకటేశం మాట్లాడుతూ, జిల్లాలోని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంలో ముందుండటం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిటియు జిల్లా అధ్యక్షులు పి. ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రవికుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బట్టు నరసింహారాజు, జిల్లా మహిళా కార్యదర్శి సౌజన్య, జిల్లా కార్యదర్శులు రాములు, ఆనంద్ కుమార్, జిన్నారం మండల అధ్యక్షులు హనుమంతు, సంగారెడ్డి మండల అధ్యక్షులు గోరక్‌నాథ్, కంది మండల ప్రధాన కార్యదర్శి అరుణ్‌రావు, మహిళా కార్యదర్శి అనురాధ, కిషోర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు

**9 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక పూర్తి - జహీరాబాద్, ఇంద్రేశం ఎన్నికలు వాయిదా**



**సంగారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి) :**

సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, అలాగే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కోసం ఈ సమావేశాలను నిర్వహించారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు అన్ని మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి.

సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం అధీకృత అధికారి జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. తెలుగు అక్షరమాల క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించిన తర్వాత ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు.

ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు, పారదర్శకంగా పూర్తయ్యింది.

జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, ఆందోల్-జోగిపేట్, కోహిర్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, గుమ్మడిదల గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి.

అయితే జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీల్లో సరిపడా కోరం లేకపోవడంతో ఎన్నికలను మంగళవారం (17022026)కి వాయిదా వేశారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల సందర్భంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

### మున్సిపాలిటీ వారీగా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లు

**ఆందోల్-జోగిపేట్:**
చైర్మన్ - సోమ్మిరెడ్డి గారి కృష్ణారెడ్డి (INC)
వైస్ చైర్మన్ - ఆకుల సత్యనారాయణ (INC)

**గడ్డపోతారం:**
చైర్‌పర్సన్ - గద్దె సుష్మ (BRS)
వైస్ చైర్మన్ - లక్ష్మ గోని మహేందర్ గౌడ్ (BRS)

**గుమ్మడిదల:**
చైర్మన్ - చిన్న పాపాని కుమార్ గౌడ్ (BRS)
వైస్ చైర్‌పర్సన్ - చిమ్ముల సంధ్య (BRS)

**ఇస్నాపూర్:**
చైర్‌పర్సన్ - మోతే సుమలత (BRS)
వైస్ చైర్‌పర్సన్ - పట్లోళ్ల మాధవి (INC)

**జిన్నారం:**
చైర్మన్ - నక్కిర్తి యాట జనార్ధన్ (BRS)
వైస్ చైర్మన్ - వంగెట్టి ప్రతాప్ రెడ్డి (BJP)

**కోహిర్:**
చైర్మన్ - ఎం. అశోక్ (INC)
వైస్ చైర్మన్ - మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ (INC)

**నారాయణఖేడ్:**
చైర్మన్ - నగేష్ కుమార్ షట్కార్ (INC)
వైస్ చైర్మన్ - దారం శంకర్ (INC)

**సదాశివపేట:**
చైర్‌పర్సన్ - మునిపల్లి అంజమ్మ (INC)
వైస్ చైర్మన్ - హెచ్. రేణుక (INC)

**సంగారెడ్డి:**
చైర్‌పర్సన్ - కూన వనిత (INC)
వైస్ చైర్మన్ - షేక్ షఫీ అహ్మద్ (INC)

## లోనికలాన్‌లో మహాశివరాత్రి ఉత్సవాలు

**సంగారెడ్డి , ఫిబ్రవరి 16 (వుదయం):**

మునిపల్లి మండల పరిధిలోని లోనికలాన్ (పెద్దలోడి) గ్రామంలో బేమిలిగే సంగిశెట్టి గారి వ్యవసాయ భూమిలో ఉన్న, సుమారు 500 సంవత్సరాల క్రితం పూర్వీకులు నిర్మించిన పురాతన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయానికి ఆనుకుని ఉన్న పురాతన బావి ఈ క్షేత్రానికి చారిత్రక ప్రాధాన్యతను చాటుతోంది.

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, రుద్రాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తిగీతాలు, శివతాండవ నృత్యాలు ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపాయి.

అలాగే భక్తులకు అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాలను బేమిలిగే సంగిశెట్టి గారు మరియు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించగా, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున సహకరించారు.

మహాశివరాత్రి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మొత్తం ఉత్సవం భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది.

## 33 వ వార్డ్ కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (వుదయం )**

సంగారెడ్డి మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పడిన నేపథ్యంలో 33వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా రవీందర్ నాయక్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా జరిగింది.

ప్రమాణ స్వీకారం అనంతరం రవీందర్ నాయక్ మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వార్డు ప్రజలందరినీ కలుపుకొని మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.



## నర్సాపూర్‌లో కాంగ్రెస్–బీజేపీ దోస్త్



**సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి )**

నర్సాపూర్ మున్సిపాలిటీలో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీజేపీ కలిసి అధికార పీఠాన్ని దక్కించుకున్నాయి. మొత్తం 15 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ - 6 , బీఆర్ఎస్ - 5, బీజేపీ - 4 వార్డులు గెలవడంతో హంగ్ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ కూటమి కట్టి మున్సిపల్ పాలనను స్వాధీనం చేసుకున్నాయి. ఛైర్పర్సన్‌గా కాంగ్రెస్‌కు చెందిన 5వ వార్డు కౌన్సిలర్ మాచునూరి లక్ష్మి ఎన్నిక కాగా, వైస్ ఛైర్మన్‌గా 13వ వార్డు కౌన్సిలర్ బుచ్చేశ్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ విజయంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు కలిసి సంబరాలు జరుపుకున్నారు.

## నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్‌కి శుభాకాంక్షలు





షాద్ నగర్ మున్సిపాలిటీ చైర్మన్ గా నూతనంగా నియమతులైన అగ్గునూరు బస్వం అప్ప గారికి, వైస్ చైర్మన్ అందే మోహన్ గారికి మరియు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్ కి కేశంపేట మాజీ జడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, వైస్ చైర్మెన్ గా అందే మోహన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రసాయన శాస్త్రంలో కుమారస్వామికి పీహెచ్‌డీ



**సంగారెడ్డి \ రుద్రారం, ఫిబ్రవరి 16 (వుదయం):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సాదినేని కుమార స్వామి డాక్టరేట్ కు అర్హత సాధించారు. '1,2,3ట్రయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, ఔషధ మూల్యాంకనం, ఇన్‌సిలికో డాకింగ్ అధ్యయనాలు' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు హరిదాస్యం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. కుమారస్వామి చేసిన డాక్టోరల్ పరిశోధన, ఆశాజనకమైన యాంటీమైక్రోబయల్, క్యాన్సర్ నిరోధక సామర్థ్యంతో కూడిన నూతన ట్రయాజోల్‌ఆధారిత టెట్రాజోల్, ఇమిడాజోల్ ఉత్పన్నాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఔషధ రసాయన శాస్త్రంలో కొత్త చికిత్సా అభ్యర్థులను అన్వేషించడానికి ఆయన అధ్యయనం అధునాతన డిజైన్, సంశ్లేషణ, ఔషధపోలిక విశ్లేషణ, ఫార్మాకోఫోర్ మోడలింగ్, మాలిక్యులర్ డాకింగ్ పద్ధతులను ఏకీకృతం చేస్తుందని వివరించారు.

కుమారస్వామి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విజయం ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే అధికప్రభావ శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలకు గీతం యొక్క నిరంతర నిబద్ధతను చాటిచెబుతోందన్నారు. గీతం యొక్క విద్యా నైపుణ్యం, పరిశోధన కార్యక్రమాలకు హైదరాబాదు ఒక శక్తివంతమైన కేంద్రంగా కొనసాగుతోందని తెలిపారు.

## పరిశ్రమలతో అనుసంధానం చేయడమే లక్ష్యం

**పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం**





**హైదరాబాద్ 16 ఫిబ్రవరి, (వుదయం):**

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్, ఉప్పల్, ఫిబ్రవరి 16, 2026న పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీ ఆర్ ఎస్ ఐ)హైదరాబాద్ చాప్టర్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని (ఎం ఓ యూ) పునరుద్ధరించుకుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా కళాశాలలో "నలంద PRSI-LFDC స్టూడెంట్ ఫోరం" స్థాపించబడింది. విద్యా రంగం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ఈ భాగస్వామ్య ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందం ప్రకారం 2026-27, 2027-28 విద్యా సంవత్సరాలలో విద్యార్థి కేంద్రిత కార్యక్రమాల శ్రేణి నిర్వహించబడుతుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక అనుభవం, పరిశ్రమల అవగాహన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయి.

MoU కార్యక్రమానికి PRSI హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి, సీనియర్ మెంబర్ శ్రీ కృష్ణ బాజీ (కన్వీనర్), నలంద ఇనిషియేటివ్ సహకన్వీనర్ డా. ఫాతిమా రహీమ్, అలాగే హైదరాబాద్ చాప్టర్ నలంద స్టూడెంట్ ఫోరం సబ్ కమిటీ కమిటీ సభ్యుడు, మాజీ చైర్మన్ శ్రీ కె. గోవింద్‌రాజ్ హాజరయ్యారు.

డా. యాదగిరి కంభంపాటి మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్, నలంద స్టూడెంట్ ఫోరం 11 విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసుకుని దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి పి. జయంతి రెడ్డి మాట్లాడుతూ, "మా లక్ష్యం 'అకాడెమిక్స్‌ను పరిశ్రమలతో అనుసంధానం చేయడం'. PRSIతో ఈ భాగస్వామ్యం మా దృష్టిని మరింత ముందుకు తీసుకెళ్తుంది" అని అన్నారు.

హైదరాబాద్ చాప్టర్ మాజీ చైర్మన్ లయన్ కె. గోవింద్‌రాజ్ ప్రధానోపన్యాసం అందించారు. "PR ఒక వృత్తిగా" అనే అంశంపై ఆయన తన అభిప్రాయాలను పంచుకుంటూ, మంచి PR నిపుణుడిగా మారేందుకు అవసరమైన నైపుణ్యాలు, వృత్తి అవకాశాల గురించి వివరించారు.

PRSI మాజీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ (దక్షిణ), నలంద ఫోరం సబ్ కమిటీ కన్వీనర్ శ్రీ కృష్ణ బాజీ మాట్లాడుతూ, PRSI ప్రారంభించిన వివిధ కార్యక్రమాలలో హైదరాబాద్ చాప్టర్ సాధించిన విజయాలను వివరించారు.

హైదరాబాద్ చాప్టర్ నలంద ఫోరం సబ్ కమిటీ సహకన్వీనర్ డా. ఫాతిమా రహీమ్ మాట్లాడుతూ, "PRSIనలంద స్టూడెంట్ ఫోరం అనేది PR, కమ్యూనికేషన్ రంగంలోని ప్రస్తుత ధోరణులపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఒక అర్థవంతమైన కార్యక్రమం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్ ఆర్ట్స్ విభాగాధిపతి శ్రీమతి థానే సవారియప్ప, మాస్ కమ్యూనికేషన్ & జర్నలిజం విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ నోబిన్ చార్లీ కూడా హాజరై, విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దేందుకు మెంటార్‌షిప్ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే ప్రాముఖ్యతను తెలిపారు.



# పట్టుదలతో అన్ని రంగాలలో రాణించాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మంవు, ఫిబ్రవరి 16 (వుదయం బ్యూరో) :

పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగ విద్యార్థులు అన్ని క్రీడా విభాగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లా నుంచి వివిధ క్రీడా విభాగాలలో ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందాన్ని కలెక్టర్‌లో జిల్లా కలెక్టర్ అభినందించారు. పోటీలకు బయలుదేరుతున్న దివ్యాంగ విద్యార్థుల బృందం బస్సును సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని, ఎందులోను మేము ఎవరికి తక్కువ కాదని, ఎల్లప్పుడూ అన్ని రకాల ఆటల పోటీలలో పాల్గొంటూ ఉండాలన్నారు. హైదరాబాదులో జరుగుతున్న రాష్ట్రస్థాయి దివ్యాంగ చిన్నారుల ఆటల పోటీలకు ఖమ్మం జిల్లా తరుపున అండర్14, అండర్16 విభాగంలో 20 మంది వివిధ పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మానసిక వైకల్యం, అంధత్వం, బధిరత్వం, శారీరక అంగవైకల్యం మొదలగు కేటగిరీలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తారని వివరించారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగ చిన్నారుల బృందానికి సహాయకులుగా ఐదుగురు ఐఆర్పిలు, ఇద్దరూ స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇద్దరు కేర్ గివర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్ళుతున్నారని వెల్లడించారు. క్రీడా పోటీలలో పథకాలు సాధించి విజేతలుగా నిలవాలని, ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ మనోధైర్యం కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి కష్టపడి ఆడితే క్రీడల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ ముఖ్యమేనని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, ఇన్చార్జి డిఈఒ శ్రీనివాసరావు, ఎఎస్పి భాను ప్రకాష్, డిఎస్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతాం

## త్వరలో డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

మధిర ఫిబ్రవరి 16, వుదయం ప్రతినిధి.



మధిర పట్టణాన్ని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ గా నివసించడానికి అత్యంత అనువైన మోస్ట్ లివబుల్ టౌన్ గా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం మధిరలో మున్సిపల్ నూతన పాలు ఒక వర్గం ఎన్నిక తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చిన ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయబోమని అత్యంత బాధ్యతగా ఈ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన అపారమైన నమ్మకాన్ని గౌరవిస్తూ అత్యంత బాధ్యతగా ఈ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత ఈ మూడు సూత్రాలతో మధిర పట్టణ వాసులకు మెరుగైన పాలన అందిస్తాం. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, తెలుగుదేశం కూటమి అభ్యర్థులు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తూచా తప్పకుండా అమలు చేసి మధిర ప్రజల రుణం తీర్చుకుంటాం అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలు పక్కన పెట్టండి. మధిర పట్టణాన్ని భవిష్యత్తు తరాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే తమ తక్షణ కర్తవ్యమని వెల్లడించారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గానికి దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. పదవులు చేపట్టాక ఇక రాజకీయం ఉండకూడదు. నో పాలిటిక్స్ ఓన్లీ డెవలప్‌మెంట్ అనే నినాదంతో పని చేయాలి. పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చడానికి ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగాలి అని సూచించారు. అభివృద్ధి కమిటీ ఏర్పాటుభవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచేలా మధిరను అభివృద్ధి చేసేందుకు పట్టణంలోని పెద్దలు, మేధావులతో రాజకీయాలకు అతీతంగా ఒక డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కమిటీ పట్టణ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి నూతన పాలకవర్గానికి తగిన సలహాలు సూచనలు ఇస్తుందన్నారు. వీరి సలహాలు, సూచనలతో పట్టణ రూపురేఖలు మార్చి, రాష్ట్రంలోనే మధిరను ఒక మోడల్ టౌన్‌గా నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి 15 రోజులకు లేదా నెలకు ఒకసారి అభివృద్ధి పనులపై తానే స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక క్యాలెండర్‌ను ఫిక్స్ చేసుకుని, ప్రణాళికాబద్ధంగా పట్టణ రూపురేఖలు మారుస్తామని చెప్పారు. ప్రతిభావంతంగా పనిచేసే మధిరను ప్రగతి పథంలో అగ్రస్థానంలో నిలపాలని పాలకవర్గానికి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ మీడియా సమావేశంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వర్ రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రామనాథం, మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ, నూతనంగా గెలిచిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్‌గా నాగలక్ష్మిరాజేష్

ధర్మపురి, ఫిబ్రవరి 15 (వుదయం ప్రతినిధి):



ధర్మపురి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ మధుసూదన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా మంత్రి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్‌గా వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ గా ఇందారపు రామన్న, కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్, సంఘని జ్యోతిసంతోష్, కొమురెల్లి పవన్ కుమార్, ముదుసుల ప్రశాంత్, వంకదోత్ విజయ్ బాబు, జంజీ రిజాని సువర్ణ, వివేకనాగలక్ష్మి, సంగి ఆనంద్, చుక్క సంధ్య, చిలివేరి రాజేష్, వేముల రమాదేవి, జక్కు పద్మ, బొజ్జాల లక్ష్మణ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధర్మపురి ప్రజలు తనపై విశ్వాసం ఉంచి 15 వార్డుల్లో 15 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 2009 నుంచి గెలుపోటములు పట్టించు కోకుండా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అయ్యానని చెప్పారు. చైర్మన్ పదవి కోసం సంఘనపట్ల దినేష్ సంతోష్, వేముల నాగలక్ష్మి పోటీ పడ్డారని తెలిపారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు వేముల నాగలక్ష్మిని చైర్మన్‌గా, ఇందారపు రామన్నను వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు వివరించారు. మొదటి రెండు సంవత్సరాలు నాగలక్ష్మి చైర్మన్‌గా, అనంతరం మూడు సంవత్సరాలు సంఘనపట్ల సంతోష్ బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. పోటీలో నిలిచిన దినేష్ సంతోష్‌కి త్వరలోనే రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చి గౌరవాన్ని కాపాడతానని హామీ ఇచ్చారు. పోటీ చేసిన ఇద్దరూ తనకు సన్నిహితులేనని, కష్టకాలంలో పార్టీకి సేవలందించిన వారేనని మంత్రి అన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఎంపికలు జరిగాయని పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన పట్టణంలో ఎలాంటి విజయోత్సవాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 60 రోజుల్లో నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ఓటర్లను కలిసి కృతజ్ఞతలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కేవీఆర్ అవినీతి కింగ్ ఎమ్మెల్సీ టికెట్ ఇస్తే అమ్ముకున్నాడు

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



కామారెడ్డి, ఫిబ్రవరి 16 (వుదయం) :

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అవినీతిపరుడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పదేపదే అవినీతి గురించి మాట్లాడడం కంటే రైతుల డబ్బులతో కొన్న కళాశాల ఆస్తులను ఎందుకు అమ్ముకున్నాడని ప్రశ్నించారు. అరోరా ఇంజినీరింగ్ యాజమాన్యానికి రూ.18 కోట్లకు స్థలాన్ని అమ్మాడని అది అవినీతి కాదా అని ప్రశ్నించారు. అంతేకాకుండా తాను ఎమ్మెల్సీ టికెట్ ఇప్పిస్తే అమ్ముకొని పోటీ నుంచి విరమించుకున్నాడని అవినీతి చరిత్ర ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి దేనని అన్నారు. కామారెడ్డి అభివృద్ధి కోసం టిఆర్ఎస్‌తో జతకట్టి చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఇప్ప ఉమారాణి కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారని అన్నారు. బిఆర్ఎస్‌కు వైస్ చైర్మన్ పదవిని ఇచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ రానందున కామారెడ్డి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ కౌన్సిలర్ మద్దతు తీసుకున్నామన్నారు. బిజెపికి చెందిన ఎమ్మెల్యే రమణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై రెండు సంవత్సరాలు గడిచిన కామారెడ్డిలో ఒక అభివృద్ధి చేసిన పాపాన పోలేదని అన్నారు. తాము అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక అడ్డుకుంటున్నాడని విమర్శించారు. ఆకాశం పై ఉమ్మేస్తే మన పైనే పడుతుందని అనే విషయాన్ని ఎమ్మెల్యే గ్రహించాలని కోరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని నిజామాబాద్ స్మార్ట్ సిటీ కోసం రూ.1000 కోట్లు ఇస్తే కామారెడ్డికి రూ.500 కోట్లు ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. ప్రత్యేక నిధుల కింద కామారెడ్డికి రూ.300 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని తెలిపారు. ఇప్పటికే కామారెడ్డిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కామారెడ్డిలో తాగునీటి సమస్య లేకుండా మార్చి వరకు పూర్తి స్థాయిలో నీటి సమస్య లేకుండా పనులు పూర్తవుతాయని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదివస్

## ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి):



ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం లక్ష్యంగా ప్రజా దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 08 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాలో కట్టుదిట్టమైన బందోబస్తు...

భూపాలపల్లి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పరోక్ష ఎన్నికల సందర్భంగా జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలో సోమవారం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 163 బి ఎన్ ఎస్ ఎస్ (సెక్షన్ 144) అమల్లో ఉండగా, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడడం, అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం నిషేధం అని డీజేలు, మైకులు, బాణాసంచా వంటి శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు కూడా నిషేధించామన్నారు ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ పరోక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

# ఓర్పుకు దక్కిన 'ఓదార్పు' నిజాయితీకి దక్కిన 'గౌరవం'

## ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వేముల నాగలక్ష్మి రాజేష్

ధర్మపురి, ఫిబ్రవరి 16 (వుదయం) :



రాజకీయాలు అంటే హంగామా కాదు, ప్రజల మనసు గెలుచుకోవడమే అసలు లక్ష్యం అని నమ్మిన మహిళా నేత వేముల నాగలక్ష్మీరాజేష్‌కు చివరికి పార్టీ పెద్దలు తగిన గౌరవం ఇచ్చారు. ఎన్నో ఒడిదుడుకులు, విమర్శలు, కష్టకాలాలు ఎదురైనా పార్టీ జెండాను వదలకుండా నిలబడ్డ ఆమెకు ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి వరించింది. పార్టీ బలహీన దశలోనూ మొక్కవోని ధైర్యంతో ముందుండి పోరాడిన నాగలక్ష్మి పదవి కోసం కాకుండా ప్రజల కోసం పని చేసిన నాయకురాలిగా గుర్తింపు తెచ్చు కున్నారు. సాధారణ మహిళగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, అసాధారణ సేవాభావంతో పట్టణ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. పదవి రాలేదని నిరుత్సాహపడకుండా వచ్చినప్పుడు ఆర్భాటం చేయకుండా స్థితప్రజ్ఞత తో వ్యవహరించడం ఆమె ప్రత్యేకతగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ పట్ల ఆమె చూపిన విధేయత, కష్టకాలంలో నిలిచిన తీరును గుర్తించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

అభివృద్ధి పథంలో ధర్మపురి..

ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగలక్ష్మి మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచిన మంత్రి కి రుణ పడి ఉంటాను. పట్టణ అభివృద్ధే నా లక్ష్యం అని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ వాసులు, కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగి పోయారు. మహిళా నాయకత్వం ద్వారా ధర్మపురి అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**పార్టీ విధేయతకే అగ్రతాం బూలం..**

విధేయతకు ఇచ్చిన గౌరవం ఇది అంటూ అనుచరులు వ్యాఖ్యానిస్తున్నారు. నిరాడంబరత, సేవా గుణం కలిసొచ్చిన నాయకత్వానికి ఇది సరైన గుర్తింపని అభివర్ణిస్తున్నారు. పేదవాడి కష్టం తెలిసిన నాయకురాలిగా పేరుగాంచిన నాగలక్ష్మి నేతృత్వంలో ధర్మపురి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# ఘనంగా కొమురవెల్లి మల్లన్న పెద్దపట్నం

వుదయం, ఫిబ్రవరి 16 (సిద్దిపేట ప్రతినిధి) :



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పెద్దపట్నం మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి ఆలయ తోటబావి ప్రాంగణంలో ఒగ్గు పూజారులు సంప్రదాయ బద్ధంగా పంచరంగులతో 41 వరుసల పెద్దపట్నం వేశారు. లింగోద్భవ కాలంలో గర్భగుడిలో వీరశైవ అర్చకులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మల్లన్న కల్యాణాన్ని ఒగ్గుపూజారులు ఘనంగా జరిపారు. ముందుగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, యాదవ పూజారులు గంగ తెప్పలో ఊరేగింపుగా తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింపజేశారు. అనంతరం పట్నం వద్ద అష్టదిక్కులకు నిమ్మకాయలు, గుమ్మడికాయలతో బలిహరణ చేసి, ఉత్సవ విగ్రహాలతో అర్చకులు పట్నం దాటారు. ఈ సందర్భంగా డప్పుల నాదం, ఒగ్గు పూజారుల జపాలు, శివసత్తుల ఆశీర్వాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికోత్సాహంతో కళకళలాడింది. పసుపు రంగుతో మెరిసిన పెద్దపట్నం వద్దకు చేరుకున్న భక్తులు "శరణు శరణు మల్లన్న", "కొమురవెల్లి మల్లన్న శరణు" అంటూ గళమెత్తి నినదిస్తూ పట్నాన్ని తొక్కారు. ఒగ్గు పూజారుల ప్రత్యేక పాత్ర సంప్రదాయానికి అనుగుణంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మల్లన్న వైభవాన్ని వివరించే ఒగ్గు కథలతో భక్తులను భక్తిరసంలో ముంచెత్తారు. పెద్దపట్నం ఆచారం ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అశేష జనవాహిని తెలంగాణ నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీతో కొమురవెల్లి గ్రామం కిటకిటలాడింది. భక్తులు మల్లన్న నామస్మరణతో పట్నంపై చిందులేస్తూ తన్మయత్వం చెందారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో బారికేడ్లు దాటి పట్నం వైపు భక్తులు పరుగులు తీయడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించాల్సి వచ్చింది.

# రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి):

తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ (సమగ్ర శిక్ష) ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కొరకు రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు జిల్లా విద్యాశాఖ తరపున బయలుదేరిన విద్యార్థుల బస్సును సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు వివిధ మండలాల నుంచి మొత్తం 26 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 7 మంది తల్లిదండ్రులు బయలుదేరారు. జిల్లా తరపున పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, జిల్లా సమీకృత విద్య కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్యామల రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, మరియు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే శాశ్వతం

## చండూరు మున్సిపల్ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దిశానిర్దేశం

చండూరు, ఫిబ్రవరి 16 (వుదయం) :



నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరై నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పదవులు శాశ్వతం కావు. ప్రజల విశ్వాసమే శాశ్వతం. అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తేనే ప్రజల గుండెల్లో స్థానం సంపాదించగలం" అని అన్నారు. ప్రజలు నమ్మకంతో గెలిపించిన ప్రతినిధులు వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఇతర నియోజకవర్గాల కంటే వెనుకబడిందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం ప్రభుత్వం తమ చేతుల్లో ఉన్నందున అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. చండూరును హైదరాబాద్ తరహాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, పట్టణ సుందరీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన కొంతమంది చైర్మన్‌లు, కౌన్సిలర్లు పార్టీలు మారడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేశారని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, ప్రస్తుతం గెలిచిన ప్రజాప్రతినిధులు ఎలాంటి రాజకీయ మార్పులు చేయకుండా ఆత్మవిశ్వాసంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన సేవ అని, చండూరు మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, మాజీ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మేయర్, చైర్మన్ల ఎంపిక

మంచిర్యాల , ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి) :

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 1 నగరపాలక సంస్థ, 4 పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికలలో భాగంగా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు జరిగిన ఎన్నికలలో గెలుపొందిన కార్పొరేటర్లతో మంచిర్యాల పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయ హాల్‌లో ఎన్నికల పరిశీలకులు కె.గంగాధర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా చల్లా రమ్య లను ఎన్నుకున్నారని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషనర్ సంపత్ ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించి చైర్ పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ లను ఎన్నుకున్నారని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం చైర్ పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్‌గా నాయకపు వినయ్‌లను ఎన్నుకున్నారని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్ పర్సన్‌గా దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్‌గా మోతుకూరి రాజేశ్వరిలను ఎన్నుకున్నారని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు ఎన్నికలు జరగగా సోమవారం రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశామన్నారు.

# దళితులను రక్షించేందుకు నిరంతరం కృషి

## జాతీయ ఎస్సీ కమిషన్ కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై ఆగ్రహం

కోదాడ, ఫిబ్రవరి 16 (వుదయం) :



దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ ఆఫ్ డెత్‌కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుంచి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అడిషనల్ డీజీ చౌహాన్ ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి లలితమ్మకు అందజేశారు. అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతిపై నేటి వరకు చార్జిషీటు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చార్జిషీట్‌కు సమయం కోరారని కాగా కమిషన్ చార్జిషీటు వెంటనే దాఖలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడమే కాక, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీలని ఆదేశించారు. పది రోజుల్లో రీ పోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. 1989 జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు యాక్ట్ ప్రకారం సస్పెన్షన్‌తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు. రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేశామని, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, మూడు ఎకరాల భూమి ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డిజి డిఎస్ చౌహన్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానంద రాణి, తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ ఎంపికలో అధిష్ఠానం నిర్ణయమే శిరో ధార్యం

- మున్సిపల్ చైర్మన్‌గా నాగలక్ష్మి రాజేష్
- వైస్ చైర్మన్ గా ఇందారపు. రామన్న
- హామీలు నెరవేర్చిన తర్వాతే విజయోత్సవాలు మంత్రి అడ్లూరి

ధర్మపురి, ఫిబ్రవరి 15 (వుదయం ప్రతినిధి):

ధర్మపురి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం లో ఆర్డీఓ మధుసూదన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా మంత్రి హాజర య్యారు. మున్సిపల్ చైర్మన్ గా వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ గా ఇందారపు. రామన్న,కౌన్సిలర్లుఅయ్యోరి.వేణుగోపాల్, సంఘన బట్ల. సంతోషి,కొమురెల్లి. పవన్ కుమార్,ముదుసుల.ప్రశాంత్, వంకుడోత్.విజయ్ బాబు,జంజీ రిజాని. సువర్ణ,వీరవేణి.నాగలక్ష్మి,సంగి.ఆనంద్,చుక్క.సంధ్య, చిపిరిశెట్టి. రాజేష్,వేముల.రమా దేవి,జక్కు.పద్మ,వొజ్జాల. లక్ష్మణ్లు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ ధర్మపురి ప్రజలు తనపై విశ్వాసం ఉంచి 15 వార్డుల్లో 15 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. 2009 నుంచి గెలుపోటములు పట్టించు కోకుండా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల కష్టసు ఖాల్లో భాగస్వామ్యం అయ్యానని చెప్పారు. చైర్మన్ పదవి కోసం సంఘనభట్ల దినేష్ సంతోషి, వేముల నాగలక్ష్మి పోటీ పడ్డారని తెలిపారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు వేముల నాగలక్ష్మిని చైర్మ న్‌గా, ఇందారపు రామన్నను వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు వివరించారు.మొదటి రెండు సంవత్సరాలు నాగలక్ష్మి చైర్మన్‌గా, అనంతరం మూడు సంవత్సరాలు సంఘనభట్ల సంతోషి బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. పోటీ లో నిలిచిన దినేష్ సంతోషికి త్వరలోనే రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చి గౌరవాన్ని కాపాడతానని హామీ ఇచ్చారు.పోటీ చేసిన ఇద్దరూ తనకు సన్నిహితులేనని, కష్టకాలంలో పార్టీకి సేవలందించినవారేనని మంత్రి అన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి ఎంపికలు జరిగాయని పునరుద్ఘాటించారు.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించినా పట్టణంలో ఎలాంటి విజయోత్స వాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 60 రోజుల్లో నెరవేర్చిన తరువాతే విజయోత్సవాలు జరుపుతామని చెప్పారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ఓటర్లను కలిసి కృతజ్ఞతలు తెలపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# కోరం లేక పుర పాలక వర్గం ఎన్నిక వాయిదా

- నిర్దేశించిన సమయానికి కౌన్సిలర్లు రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేసిన అధికారులు

రామకృష్ణాపూర్,ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి):

క్యాతనపల్లి మున్సిపాలిటీ లో చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం కోరం లేక వాయిదా పడింది. నిర్దేశించిన సమయానికి మునిసిపాలిటీ కార్యాలయానికి 22 మంది కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కోరం వాయిదా వేస్తున్నట్లు మందమర్రి ఎమ్మార్వో, ఎన్నికల అధికారి సతీష్ కుమార్ తెలిపారు. తేది 17/02/26 మంగళవారం రోజున మళ్లీ 11 గంటల ప్రాంతంలో కౌన్సిలర్ల ప్రమాణస్వీకారాలు ఉంటాయని, కౌన్సిలర్ లు అందరూ సకాలంలో విచ్చేసి ఎన్నికలకు హాజరు కావాల్సిందిగా ఎమ్మార్వో కోరారు. దీంతో మున్సిపాలిటీ కార్యాలయం ముందు బిఆర్ఎస్, సిపిఐ, కాంగ్రెస్ శ్రేణుల పోటా పోటీగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బిఆర్ఎస్,సిపిఐ కలిపి 14 కౌన్సిలర్ సీట్లు గెలుపొందగా కౌన్సిలర్లను ప్రమాణస్వీకారానికి తీసుకొస్తున్న సందర్భంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కౌన్సిలర్లతో పాటు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రావడాన్ని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు రఘునాథ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్యలను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం ముందు కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితులు అదుపు తప్పుతున్నాయని గమనించిన పోలీస్ యంత్రాంగం, ఎన్నికల అధికారులు మున్సిపాలిటీ కౌన్సిలర్ల ప్రమాణస్వీకారాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంతంలో అల్లరి సద్దుమణిగింది. నేడు ఎన్నిక జరిగే సమయంలో మళ్లీ పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘానికి, జిల్లా కలెక్టర్ కు సమాచారం అందిస్తామని ఎమ్మార్వో, ఎన్నికల అధికారి సతీష్ కుమార్ తెలిపారు.



# కార్పొరేటర్లు అంకితభావంతో పనిచేయాలి

**పార్టీలకతీతంగా అభివృద్ధి**
**కార్పొరేటర్లు పేదల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి**
**నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ఎన్ని నిధులైన తీసుకొస్తా**
**రాష్ట్ర రోడ్డు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**
**మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి**



నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు మేయర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం నగర అభివృద్ధికి మంచి సంకేతమని, శుభ సూచికమని రాష్ట్ర రోడ్డు, భవనాలు సినిమాటోగ్రపి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు . సోమవారం నల్గొండ నగర మేయర్ కార్యాలయ సమావేశ మందిరంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్ ,కార్పొరేట్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నల్గొండ కార్పొరేషన్ పరిధిలోని 48 మంది కార్పొరేటర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.అధికారంలో ఉన్నంత కాలం కార్పొరేటర్లు ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని మంత్రి సూచించారు. ఏ సమస్య వచ్చినా ముందుగా మేయర్ దృష్టికి, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయల ఫ్రీ కరెంటు బిల్లు చెల్లించిందని, ఒక్కో కుటుంబానికి సుమారు 50 వేల రూపాయల వరకు కరెంటు బిల్లు భారం తగ్గించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో ఎంపీగా తనకు ఉన్న పరిచయాలతో ఢిల్లీ నుంచి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. 700 కోట్ల రూపాయలతో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి ఇప్పుడు మీ చేతుల్లో ఉందని కార్పొరేటర్లకు స్పష్టం చేశారు. మేయర్‌తో సమన్వయం చేసుకుని నల్గొండ నగర అభివృద్ధికి కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి అన్ని పార్టీల కార్పొరేటర్లు అభివృద్ధి కోసం ఏకమవ్వాలని సూచించారు. . మూడేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉండి, పూర్తిగా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. తనకు పదవులు ముఖ్యమేమీ కావని, అభివృద్ధే ముఖ్యమని స్పష్టం చేశారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గెలిచిన ప్రతి ఒక్కరూ అభివృద్ధి కోసం కృషి చేయాలని, మూడేళ్లలో నల్గొండ కార్పొరేషన్ జాతీయ స్థాయి అవార్డు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. నగరంలో శానిటేషన్ వ్యవస్థ సరిగా లేదని, వెంటనే మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎంఐఎం ఎమ్మెల్సీ ఆఫన అలీ , నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ హఫీజ్ ఖాన్ , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్*

ఖమ్మంవుదయం బ్యూరో ఫిబ్రవరి -16:

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.వైరా మండలం గన్నవరం గ్రామం నుండి కిన్నెర రాణి, తనకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మొదటి విడత డబ్బులు జమ అయినట్లు, తదుపరి విడతల డబ్బులు జమకాలేదని, ఇప్పించుటకు కోరగా, హౌజింగ్ పిడి ని పరిశీలించి, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మంచుకొండ, కోయచిలక గ్రామ రైతులు, తమకు రఘునాధపాలెం మండలం, మంచుకొండ, కోయచిలక రెవెన్యూ శివాయిగూడెం పరిధిలోగల సర్వే నెంబర్లు 174, 175, 362, 364/92 లలో గల స్వంత వ్యవసాయ భూములకు, వైకుంఠదామం, డంపింగ్ యార్డు లకు వెళ్లే దారిని, అట్టి భూమితో సంబంధం లేని వ్యక్తి నిరోధిస్తున్నట్లు, తమకు న్యాయం చేయాలని కోరగా, తహశీల్దార్ ను తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.కొనిజర్ల నుండి సయ్యద్ లాల్ బి కొనిజర్ల మండలం, గుండ్రాతిమడుగు రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 421/1/లూ లో 2 ఎకరాల భూమి తన పేరున ఉన్నట్టు, అట్టి భూమిలో 1 ఎకరం తన పెద్ద అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయించినట్టు, మిగిలిన ఎకరం భూమిని తన చిన్న అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయాలని మీ సేవ కేంద్రానికి వెళ్ళగా, అట్టి భూమి అసైన్డ్ భూమిగా చూపిస్తుందని, అట్టి దానిని పిఓపి నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహశీల్దార్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం అర్బన్ గోపాలపురం గ్రామం నుండి ఎస్ కె. రజియా, తనకు ఇల్లు లేదని, భర్త ఆక్సిడెంట్ అయి, ఇబ్బందుల్లో ఉన్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు చేయగా, హౌజింగ్ పిడి కి పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర వుదయం బ్యూరో ఫిబ్రవరి -16:

బాసర శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము మాసోత్సవము సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవం గా జరిగినవి. ముందుగా దీపారాధన,కలశస్థాపన, పుణ్యాహవచనము ,లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హోమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నదానము ఘనంగా జరిగింది..సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గణించిన హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ నటరాజ నృత్య డాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు ,నాట్య గురువులు కుమారి లక్ష్మీ హారిక దుగ్గిరాల కు ఉత్తమ ఆధ్యాత్మిక నాట్య సేవ పురస్కారం వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికనాథ శర్మ సంధ్య దంపతులు అందజేశారు. మరియు నాట్య గురువుల శిష్యులు స్వరణి చంద్రికసంహిత ,ఓవిక శ్రీ ,అనీక్ష ,ఆశ్రిత ,గీత కురికాల ,లక్ష్మీ సాయి అనురాధ సంగెం ,నక్షత్ర ప్రత్తిపాటి ,శివాంజలి ప్రత్తిపాటి ,గౌరవరం రష్మి రెడ్డి ,నిరమయా శ్రీ ,శ్రీ వైష్ణవి ,లేఖ్య తుంగ ,ప్రవస్థి,డి. జీవా మేగన్ ఆర్. అక్షర,వై. మేధాంశ్ రెడ్డి,వై. మహన్య తదితరులు చక్కని నృత్యాభినయంతో కళా ప్రియులను కట్టిపాడేశారు.ప్రతి నెల మూడవ ఆదివారము మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమంలో భాగంగా నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నామని ఆసక్తి గల నాట్య గురువులు తమ పిల్లల చేత నృత్య ప్రదర్శన చేయించదలచిన వారు 9948332032 సంప్రదించి తమ సంస్థ పేరు నమోదు చేసుకోవాలి వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికానాథ శర్మ తెలిపారు.

# గుండె ఆపరేషన్ నిమిత్తమై చిన్నారికి మూడు యూనిట్ల రక్తం అందజేత

- మానవత్వాన్ని చాటిన రక్తదాతలు సంతోష్ రెడ్డి, రోహిత్, విక్రమ్

కామారెడ్డి, ఫిబ్రవరి 16 (వుదయం):-

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల చిన్నారి కళ్యాణికి గుండె ఆపరేషన్ నిమిత్తమై సికింద్రాబాద్ లోని కిమ్స్ వైద్యశాలలో ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు సామల సంతోష్ రెడ్డి, రోహిత్, విక్రమ్ లు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి రక్తదానం చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, ధర్మారావుపేట గ్రామానికి చెందిన సామల సంతోష్ రెడ్డి 47 వ సారి రక్తదానం చేయడమే కాకుండా తన తోటి సాఫ్ట్వేర్ ఉద్యోగులను కూడా రక్తదానంలో భాగస్వాములుగా చేయడం చిన్నారి ప్రాణాలను కాపాడడం కోసం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేయడం కోసం నిరంతరాయంగా పని చేస్తున్నామని రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని రక్త కొరత లేని సమాజం కోసం కృషి







# సిద్ధిపేటలో మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా





వుదయం, సిద్ధిపేట ప్రతినిధి, ఫిబ్రవరి, 16:

నీలకంఠ సమాజం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక భాగంలో ఉన్న నీలకంఠేశ్వర నగర్‌లో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు ముమ్మరంగా నిర్వహించగా మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలందించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది.సాయంత్రం వేళ స్వామివారిని పల్లకిపై అలంకరించి రాత్రి సమయంలో పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు హరహర మహాదేవ శంకర నినాదాలతో ఊరేగింపులో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. స్వామి వారిని స్మరించుకుంటూ భజన కార్యక్రమాలు జాగారం చేశారు భక్తులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గౌరవ అధ్యక్షులు కడవేర్గు నరసింహులు, అధ్యక్షులు గుండ్ల యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి అబ్బతిన్ సురేష్, కోశాధికారి కాల్వ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు గుండ్ల జనార్ధన్, కాల్వ శంకర్, సహాయక కార్యదర్శి కడవేర్గు యాదగిరి,ముఖ్య సలహాదారులు గుండ్ల జనార్ధన్ సార్, లోక లక్ష్మీ రాజ్యం, కడవేర్గు శ్రీనివాస్, ఆలయం యొక్క డైరెక్టర్లు రాయిని భాస్కర్, కడవేర్గు రాజు, సభ్యులు నారాయణ, సురేందర్, రాజు, శ్రీనివాస్, సుధాకర్, రామచంద్రన్, యాదగిరి తదితరులు హాజరయ్యారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది సమన్వయంతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొత్తం మీద మహాశివరాత్రి వేడుకలు భక్తి పరవశంలో, ఆధ్యాత్మికోత్సాహంతో విజయవంతంగా పూర్తయ్యాయి.

## ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి వుదయం జిల్లా ప్రతినిధి :




ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల, మాటూరు గ్రామంలోని పల్లె దవాఖనాని కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ... ప్రతి రోజు ఓ.పి.కి ఎంతమంది వస్తున్నారని ఆరా తీశారు. ఆసుపత్రిలో డాక్టర్, మెడికల్ సిబ్బంది అందరూ వచ్చారా లేదా అని హాజరు రిజిస్టర్ పరిశీలించారు. హాజరు రిజిస్టర్ తనిఖీలో బాగంగా మాటూరు పల్లె దవాఖానలో అనధికారిక విధులకు గైర్హాజరు అయిన ఎం.పి.హెచ్. ఏ విజయరాణి కి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన సోమయ్య అనే వృద్ధుడిని కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి ఎందుకు వచ్చారని, ఏమీ సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. సోమయ్య తన భార్యకు జ్వరం వచ్చిందని చెప్పడంతో సిబ్బంది వారి ఇంటికి వెళ్లి మందులు ఇచ్చి రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అన్ని ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్, సిబ్బంది అందరూ సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ రజిత, ఎచ్ ఈ ఓ శ్రీనివాస్, ఎచ్ ఎస్ సుగుణ, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ ఎల్ డి సి సందీప్, హెల్త్ అసిస్టెంట్ సైదులు తదితరులు ఉన్నారు.

# కొలువుదీరిన పురపాలక 'పాలకులు'

- నూతన మేయర్, చైర్మన్లకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు



ఖమ్మం వుదయం బ్యూరో ఫిబ్రవరి 16ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నూతనంగా ఎన్నికైన మేయర్, చైర్మన్లతో పాటు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు , నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఈ నూతన సారథులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్ (సీపీఐ), డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సిరిపురపు లలిత (కాంగ్రెస్) లకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆయన అభినందించారు. మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోట ధనమూర్తి, సత్తుపల్లి చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, వైరా చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, అశ్వారావుపేట చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఏదులాపురం చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరిలకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు తెలుపుతూ.. వారంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శవంతమైన పాలన అందించాలని సూచించారు.పట్టణాల్లోని ప్రతి వార్డు, డివిజన్ అభివృద్ధి చెందాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కూడిన పూర్తి పాలకవర్గం పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులు, డివిజన్లలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- ప్రణాళికపై ప్రాథమిక సమీక్ష
- జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

ధర్మపురి, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి):




2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణా ళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికా రులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మంది రంలో జరిగిన సమీక్ష సమావేశం లో రెవిన్యూ,మున్సిపల్,పంచా యతీ రాజ్ ఇంజనీరింగ్,ఆర్ & బి,దేవదాయ,విద్యుత్ శాఖలతో పాటు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.పుష్కరాల ఏర్పాట్లకు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యలపై శాఖల వారీగా వివరాలు తెలుసుకు న్నారు.ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన దేవాలయాల అభి వృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిం చాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం, కోటిలింగాల ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

మౌలిక వసతుల విస్తరణ ఒకే రోజు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండేలా రహదారుల అభివృద్ధి, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, స్నాన ఘాట్లు, వసతి సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. కొత్తగా అవసరమైన చోట్ల పుష్కర ఘాట్లు నిర్మించాల్సిన అవసరాన్ని కూడా గుర్తించారు. సమగ్ర నివేది కలు సమర్పించాలిఇప్పటివరకు సమర్పించిన నివేదికలను మండ ల స్థాయిలో మరోసారి సమీక్షించి, వారం రోజుల్లో పూర్తి స్థాయి సమగ్ర నివేదికలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. శాశ్వత మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిం చాలని పేర్కొన్నారు.ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత,బి.రాజ గౌడ్,ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ, సంబంధి త శాఖల ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, కలెక్టరేట్ ఏవో, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యంలో అగ్నివీర్ కొలువులు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

దేశసేవ చేయాలనుకునే యువతకు భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్ నియామకాలు మంచి అవకాశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. 2027 రిక్రూట్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి అన్ని విభాగాల్లో అగ్నివీర్ పోస్టుల భర్తీకి ఆర్మీ నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.joinindianarmy.nic.in లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 13, 2026 నుండి ఏప్రిల్ 01, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



# నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం








- ఆర్డీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ
- చైర్మన్‌గా కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా భూతరాజు దశరథ పదవీ బాధ్యతలు స్వీకారం

**చండూరు, ఫిబ్రవరి 16 ( వుదయం విలేఖరి ) :**

నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్డీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ముందుగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా కోడి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వైస్ చైర్మన్‌గా భూతరాజు దశరథ పదవీ ప్రమాణం చేశారు. అలాగే నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు తేలుకుంట్ల రాజకుమారి , బుషిపాక వాసు, కోడి సుష్మ , కలిమికొండ పారిజాత , కొంరెడ్డి మధు, జెల్ల ధనమ్మ, సామ సుజాత ,కటకం రమేష్ లు తమ పదవులకు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్డీఓ శ్రీదేవి వారికి ప్రమాణం చేయించి, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని సూచించారు.ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ, చండూరు పట్టణ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పారదర్శక పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు.వైస్ చైర్మన్ భూతరాజు దశరథ మాట్లాడుతూ చైర్మన్‌తో సమన్వయంతో పని చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లేశం ,ఆర్వో వెంకటేశం , వార్డు ఆఫీసర్ సాయి, ఎన్వీరాన్మెంట్ ఇంజనీర్ అరవింద్ రెడ్డి, భూతరాజు ఆంజనేయులు ,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ , గంట సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికే కరీంనగర్ మేయర్ పీఠం

* కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసిన బీజేపీ నాయకత్వం
* కార్యకర్త నుండి మేయర్ దాకా కొలగాని శ్రీనివాస్ ప్రస్థానం.
* డిప్యూటీ మేయర్ గా సునీల్ రావు.


కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్


కరీంనగర్ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**

కరీంనగర్ నగర పాలక సంస్థ ''మేయర్'' పదవి సామాన్యుడికే దక్కింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థిగా 2వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావును ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఈ మేరకు వారి పేర్లను ఖరారు చేస్తూ లేఖపై సంతకం చేశారు. బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి ఆ లేఖతో కూడిన కవర్ ను తీసుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ కు విచ్చేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని వి.కన్వెన్షన్ లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా బీజేపీ కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల సమక్షంలో డాక్టర్ మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను కార్పొరేటర్లకు తెలియజేస్తూ వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు.ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. అట్లాగే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. బీజేపీ సీనియర్ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, వాసాల రమేశ్ సహా బీజేపీ కార్పొరేటర్లందరూ కొలగాని శ్రీనివాస్, సునీల్ రావు పేర్లను మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక బస్సులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు విచ్చేసిన కార్పొరేటర్లంతా ప్రమాణ స్వీకారం చేశారు. వాస్తవానికి కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ కార్పొరేటర్లంతా ఆశలు పెట్టుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా నాయకత్వం బీసీ, జనరల్ స్థానాల్లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్ల పేర్లను, వారి బయోడేటాను రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఆ జాబితాలో ఉన్న ఒక్కో కార్పొరేటర్ పేరును, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పేరును పరిశీలించింది. చివరకు ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్త కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. మేయర్ అభ్యర్థి పదవి తనను వరిస్తుందని కొలగాని శ్రీనివాస్ అస్సలు ఊహించలేదు. ఈరోజు ఉదయం బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో పార్టీ జిల్లా ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి కొలగానిని మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిందని తెలియజేయడంతో కొలగాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్పొరేటర్లంతా వచ్చి కొలగానికి అభినందనలు తెలియజేస్తున్న సమయంలోనూ ఆశ్చర్యం, ఆనందంతో పాటు ఆనందంతో చెమర్చిన కళ్లతో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తనైన తనను మేయర్ కు ఎంపిక చేస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. బీజేపీలో కష్టపడి, విధేయతతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయనే దానికి తానే నిదర్శనం అని చెప్పారు. 37 ఏళ్ల కొలగాని శ్రీనివాస్ 1989 జూన్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించారు. ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ చేసిన కొలగాని చిన్నప్పటి నుండే ఆర్ఎస్ఎస్ లో శాఖలో చురుకుగా పాల్గొనే వారు. 2013లోనే ప్రాథమిక శిక్షను పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే స్వామి వివేకానంద ఆలోచనలతో ప్రభావితమై ఎన్ఎస్ఎస్, ఎన్ వైపీ, ఏక్తా పరిషత్ సంస్థల ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న కొలగాని శ్రీనివాస్ 2005 నుండి 2007 వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. 2007 నుండి 2009 వరకు భారతీయ జనతా యువ మోర్చాలో పనిచేసి యువజన పోరాటాల్లోనూ పాలు పంచుకున్నారు. 2007 నుండి 2009 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేసి 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు చేరి దేశ సేవకు అంకితం కావాలని భావించిన కొలగాని 2009లో అసోంలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ పీస్ క్యాంప్ కు హాజరయ్యారు. లక్షద్వీప్, బెంగళూరు, యూపీ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ లలో నిర్వహించిన అనేక జాతీయ స్థాయి శిబిరాల్లోనూ పాల్గొన్నారు. యువత & పిల్లలతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు. 2009 నుండి 2013లో ఏక్తా పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు. కొలగాని సేవలకు గాను 2005 లో భాయిజీ సేవా పురస్కార్ (NYP), 2010లో NSS ఉత్తమ వలంటీర్, 2021 కరోనా కాలంలో అందించిన సేవలకుగాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా 'రక్షక్ అవార్డు'లను అందుకున్నారు. రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే 2014 నుండి 2019 వరకు BJP మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుండి 2025 వరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ గా కొనసాగారు. 2021 లో కరోనా వ్యాక్సిన్ జిల్లా కన్వీనర్ గా, 2023 నుండి 2024 వరకు కరీంనగర్ టౌన్-1 కన్వీనర్ గా, 2024 లో ఎన్.ఐ.ఎఫ్.ఎఫ్. ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025 లో చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్ గా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం అందించిన సహకారం, లీగల్ సాయం ఎనలేనిదని పేర్కొన్నారు.

## వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని

# కాంగ్రెస్ పార్టీ కైవసం

## వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు..



**వర్ధన్నపేట వుదయం ప్రతినిధి:**

మున్సిపాలిటీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీలో ఎమ్మెల్యే నాగరాజు , నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ర్యాలీ అంతటా కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో పట్టణం మార్మోగింది.ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు.అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.సోమవారం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నేతావాత్ శిభారాణిలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.కొంతమంది వ్యక్తులు వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడి అసత్య ప్రచారాలు నిర్వహించినా ప్రజలు వాటిని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు.అధికార దుర్వినియోగం చేశామనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తాముఎప్పుడూరాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలోనే పని చేస్తామని స్పష్టం చేశారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు.వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబు కు, అలాగే మండలాధ్యక్షులు, పట్టణ నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు .వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక ,ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

# పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం





- చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత
- వైస్ చైర్మన్ గా మహ్మద్ షఫీ ఉల్లా ఎన్నిక ఏకగ్రీవం

**సూర్యాపేట జిల్లా ,ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం నాడు స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నిక అధికారి సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు ,సహాయ ఎన్నిక అధికారి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి గౌరవ సభ్యులు 10:45 నిమిషములకు మీటింగ్ హాలుకు హాజరయ్యారు .అనంతరం మున్సిపల్ కార్యాలయ రిజిస్టర్ లో 48 మంది గౌరవ పాలకసభ్యుల పేర్లను నమోదు చేసుకుని,వారినుంచి దసంతకాలు సేకరించారు. అనంతరం 48 మంది సభ్యుల చేత ముందుగా తెలుగు వర్ణమాల పేరు పద్ధతిలో గౌరవసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు ఎన్నిక అధికారులు వారికి శుభాభినందనలు తెలిపారు. <

12:30 నిముషముల అనంతరం చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు .చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత (46 వ వార్డు)పేరును గుణగంటి హేమ(44వ వార్డు) ప్రపోజ్ చేశారు. వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు. ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ గా మహమ్మద్ షఫీ ఉల్లా (41వ వార్డు )పేరును నాగుల శ్రీనివాస్ (33వ వార్డు) నామ అరుణ(30వ వార్డు) లు ప్రపోజ్ చేశారు .వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు . దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అనంతరం చైర్మన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మెన్ మహ్మద్ షఫీ ఉల్లా లకు, ఎన్నిక అధికారులు ఆర్డిఓ వేణుమాధవ రావు సహాయ ఎన్నిక అధికారి సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి లు పుష్పగుచ్చాలను అందించి శాలువాతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రేయిని రమేష్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## దశాబ్ది ఉత్సవాలను

# జయప్రదం చేయండి !

**నల్లగొండ జిల్లా ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి**

ఈనెల ఫిబ్రవరి 21, 22 తేదీలలో హైదరాబాద్ లో నిర్వహిస్తున్న తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్య ఉత్సవాల పోస్టర్ ను నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీనివాసరాజు ఆవిష్కరించి మాట్లాడుతూ...... తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ -2026 లో కవిత్వం, కథ,నవల, విమర్శలపై విశ్లేషణ మహిళ, యువ సాహిత్యం పై చర్చలు, పుస్తకావిష్కరణలు-కవి సమ్మేళనాలు, ఫోటో ఎగ్జిబిషన్-పుస్తక ప్రదర్శనలు, పాటలు, నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.నల్లగొండ జిల్లా తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ మాట్లాడుతూ ..... జిల్లా స్థాయిలో ప్రభుత్వ/ప్రైవేటు కళాశాలల డిగ్రీ ,పీజీ విద్యార్థులకు 'డ్రగ్స్ రహిత సమాజం - సుస్థిర భవిష్యత్తు' అనే అంశంపై వ్యాస రచన పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని, విద్యార్థులు రాసిన వ్యాసాలను 19/02/2026 గురువారం మధ్యాహ్నం వరకు సంబంధిత కళాశాలల్లో తెలుగు శాఖలో అందజేయాలని,విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ మరియు రెండు కన్సోలేషన్ బహుమతులు హైదరాబాదులో ఇవ్వబడతాయని, ఈ ఉత్సవాలకు నల్లగొండ జిల్లాలోని సీనియర్ కవులు, రచయితలు,సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ సుంకరి రాజారాం, డాక్టర్ వీరన్న,
అధ్యాపకులు అజయ్, చైతన్య సుధ, సుమతి, సరిత, సునీత, ధనుజ , తెలంగాణ సాహితీ జిల్లా కోశాధికారి తరునోజు భీష్మచార్య, పందిరి శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ వినతి పత్రం అందజేత

**పోతేపల్లి గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్**



**వెల్దండ, ఫిబ్రవరి 16 (వు దయం ప్రతినిధి)**

మండల పరిధిలోని పోతేపల్లి గ్రామపంచాయతీ లో విద్యుత్ సబ్స్టేషన్ మంజూరై ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో కరెంటు అవకతలతో ఇబ్బంది పడుతున్నారని నష్టపోతున్నారని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ కి గ్రామ సర్పంచ్ తగుల కొండల్ యాదవ్ వినతి పత్రం అందజేశారు

ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ అశోక్ కుమార్, వావిళ్ళ యాదగిరి , ఎగిరిశెట్టి శివ పాల్గొన్నారు.

## మక్తల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం

**మక్తల్ ,ఫిబ్రవరి 16 (వు దయం ప్రతినిధి)**



అయితే మక్తల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. మక్తల్, ఆత్మకూరు, అమరచింత మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా కాంగ్రెస్ అభ్యర్థుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, వైస్ చైర్ పర్సన్ శైవీ రెడ్డి.. ఆత్మకూరు చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్ పర్సన్ నల్లగొండ శ్రీనివాసులు.. అమరచింత చైర్ పర్సన్ జింక సువర్ణ, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లకు రాష్ట్ర క్రీడా, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుభాభినందనలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు నేడు ప్రమాణస్వీకారం చేస్తున్నారు.

# గద్వాల పురపాలక పీఠం ఖరారు

## ప్రశాంతంగా గద్వాల పురపాలక చైర్పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**గద్వాల ,ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**

- ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వినియోగించుకున్న ఎంపీ మల్లు రవి
- ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నర్సింగరావు.
- గద్వాల పురపాలక సంఘం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు తెలిపారు.

సోమవారం గద్వాల పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి 37 వార్డుల సభ్యులుగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ పదవుల ఎన్నిక కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్నికైన సభ్యులతో అదనపు కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 33వ వార్డు నుంచి కౌన్సిలర్ గా ఎన్నికైన జయలక్ష్మిని చైర్ పర్సన్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున 35వ వార్డు నుంచి ఎన్నికైన ఎండి బాబర్ ప్రతిపాదించగా, 28వ వార్డు నుంచి కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి 23వ వార్డు సభ్యురాలిగా గెలుపొందిన అనిత కుమారిని అదే పార్టీ నుంచి ఏడవ వార్డు సభ్యుడిగా గెలుపొందిన జగదీష్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించగా, 20వ వార్డు సభ్యులు నరసింహులు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. చేతులెత్తే విధానంలో ఇరు పార్టీల నుంచి చైర్పర్సన్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో మొదట అనిత కుమారికి చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరారు. బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 11మంది సభ్యులు అనిత కుమారికి మద్దతుగా చేతులెత్తే విధానం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరపున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జయలక్ష్మికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 16 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో జయలక్ష్మిని గద్వాల పురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు. అనంతరం వైస్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నుంచి 14వ వార్డు సభ్యుడు శంకర్ ను 9వ వార్డు నుంచి కాంగ్రెస్ సభ్యులుగా గెలుపొందిన రామలింగేశ్వర కామ్లే ప్రతిపాదించగా, 3వ వార్డు నుంచి అదే పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన నాగులు బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ వైస్ చైర్మన్ అభ్యర్థిగా 21 వార్డు నుంచి గెలుపొందిన పులిపాటి వెంకటేష్ ను 20వ వార్డు సభ్యులు నరసింహులు ప్రతిపాదించగా, ఐదవ వార్డ్ సభ్యులు చిన్నసంటన్న బలపరిచారు. మొదట పులిపాటి వెంకటేశుకు చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరగా 11 మంది సభ్యులు అతనికి మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన శంకర్ కు 16 మంది కాంగ్రెస్ సభ్యులతోపాటు, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో శంకర్ ను వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైన జయలక్ష్మి తో, వైస్ చైర్మన్ గా ఎన్నికైన శంకర్ తో అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేయించారు ఈ కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు






# వాయిదపడ్డ జహీరాబాద్ మున్సిపాలిటీ




**మెదక్ ,ఫిబ్రవరి 16 (వు దయం ప్రతినిధి)**

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల్లో ఎక్కువ శాతం కాంగ్రెస్ పార్టీనే విజయం సాధించగా.. కొన్ని చోట్ల హంగ్ ఏర్పడింది. అలా హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా కూడా ఉంది. సోమవారం ఈ మున్సిపాలిటీల్లో పలు పార్టీలు విజయం సాధించాయి. ఆ పార్టీల వివరాలు ఇలా.. 1.ఇస్నాపూర్ మున్సిపాలిటీని ఎమ్మెల్యే, ఎంపీ ఎక్స్ అఫిషియో ఓటుతో దక్కించుకున్న బిఆర్ఎస్2.జిన్నారం మున్సిపాలిటీని బిజెపి కౌన్సిలర్ల మద్దతుతో గెలిచిన బిఆర్ఎస్ 3.నర్సాపూర్ మున్సిపాలిటీని బిజెపి కౌన్సిలర్ల మద్దతుతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ 4.కోహిర్ మున్సిపాలిటీని ఎంఐఎం మద్దతుతో గెలిచిన కాంగ్రెస్ 5.మెదక్ మున్సిపాలిటీని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటుతో దక్కించుకున్న కాంగ్రెస్ 6.కోరం లేక వాయిదపడ్డ జహీరాబాద్ మున్సిపాలిటీ.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చూపాలి..
## పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ క్రైం, వుదయం:**




నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు.రేపటి నుండి సైబరాబాద్ కమిషనరేట్ లో ప్రారంభమయ్యే తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడా గ్రామంలో ఎగురవేసే వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ట్రాక్ సూట్ తో పాటు స్పోర్ట్స్ షూ, టీ షర్ట్ అందజేశారు.క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ క్రీడాకారులు తమ సత్తా చూపాలని, పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుం దని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపి నాగయ్య, ఆర్.ఐ సతీష్, ఆర్. ఎస్.ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

# టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తు ఆహ్వానం

**హనుమకొండ టౌన్, వుదయం:**

హన్మకొండజిల్లాలోనిప్రభుత్వ ఐ.టి.ఐ., హన్మకొండలో ఇటీవల ఏర్పడిన అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్ (ATC) లో P.M.K.V.Y., 4.0 పథకం లో భాగంగా "3D ప్రింటింగ్" కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ప్రిన్సిపాల్ జి. సక్రు తెలిపారు. మూడు నెలల కాలపరిమితి గల ఈ కోర్స్ 20వ ఫిబ్రవరి, 2026 నుండి ప్రారంభం కానుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్.ఎస్.సి., మేమో జీరాక్స్ తో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్ కోరారు.

# వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటి ఏకగ్రీవం
## సంఘం అధ్యక్షుడిగా బలుగూరి విజాకర్ రావు

**ఖానాపురం, వుదయం:**



మండలంలోని ధర్మారావుపేట గ్రామ వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా బలుగూరి విజాకర్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బలుగూరి విజాకర్ రావు, ఉపాధ్యక్షుడు కత్తల సంపత్ రావు, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి పెద్ద సంపత్ రావు, సహాయ కార్యదర్శి బొంపల్లి వెంకటేశ్వర్ రావు, కోశాధికారి ఎర్రబెల్లి సంపత్ రావు, ముఖ్య సలహాదారులు కత్తల మాధవరావు, నడిపెల్లి రాజేశ్వర్ రావు, ఆరెల్లి రామచంద్రరావు, పోల్సన్ సంపత్ రావు, కొలుగూరి నరసింహా రావు, కత్తల వెంకటేశ్వర్ రావు, కొలుగురి రవీంద ్రావు, పోల్సాని సాగర్ రావు, నాగిని వెంకటేశ్వర్ రావు, సూర్నేని భుజంగ రావు, దగ్గుల సంపత్ రావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా
## ఇండిపెండెంట్ అభ్యర్థి అనూష బండారి ఎన్నిక

**ఆదిలాబాద్, వుదయం:**



ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ గా ఇండిపెండెంట్ అభ్యర్థిని... అనూష బండారి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎంఐఎం, ఇండిపెండెంట్ లు మొత్తం 27 కౌన్సిల్ మెంబర్లు ఓటు హక్కు వినియోగించి..45 వ వార్డు కౌన్సిలర్ అనూష ను మున్సిపల్ చైర్మన్ గా ఎన్నుకున్నారు. దీంతో అదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ఉత్కంఠకు తెరవీడింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 21/కాంగ్రెస్ 11 వార్డులలో విజయం సాధించగా... అధికార కాంగ్రెస్ పార్టీ.. తమ పార్టీ నుండి గెలిచిన వార్డు సభ్యులు 11 మంది తో కలిసి , ఎంఐఎం 6 గురు, స్వతంత్ర అభ్యర్థులు 4 గురు, బి.ఆర్.ఎస్. నుండి గెలిచిన 6 గురు వార్డు సభ్యులు స్వతంత్ర అభ్యర్థి అయిన బండారి అనూష కు మద్దతు ఇవ్వ దంతో...ఆమె మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు.. వైస్ చైర్మన్ గా ఏఐ ఎంఐఎం పార్టీ నుండి గెలిచిన వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ రోహిత్ ఎన్నికయ్యారు.

# నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్ సమ్మిరెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



మహాదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామ పంచాయతీ లోని 2026-2027 నర్సరీ పనులను సోమవారం సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు నాటి, లక్ష్యానికి అనుగుణంగా పూలు, పండ్ల మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు.నర్సరీలలో మొక్కలు ఆరోగ్యంగా ఉండేలా, తగిన నీటి సౌకర్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్లు సిబ్బందికి సూచించారు వన మహోత్సవం కార్యక్రమంలో లక్ష్యంగా ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాలను వినియోగించుకుని మొక్కలు పెంచడం, పచ్చదనం పెంచడం లక్ష్యంగా పని చేస్తున్నారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆమురాజి యశోద రవి,కార్యకర్తలు గోమాస కుమార్, మరియు కూలీలు పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఇప్ప ఉమారాణి,
## వైస్ ఛైర్మన్ గా కాసర్ల గోదావరి

**కామారెడ్డి, వుదయం:**



కామారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి



కామారెడ్డి మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరి స్వామి

కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియ సోమవారం పూర్తయింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకటై స్వతంత్ర అభ్యర్థి ఇప్ప ఉమారాణిని ఎన్నుకున్నాయి. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి ఉదయం 10:30 గంటలకు కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. 11.20 గంటలకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, 12 గంటలకు ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి తో పాటు బిజెపి కౌన్సిలర్లు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ మధుమోహన్ ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నిక నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 49 వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన మహమ్మద్ ఇసాక్ షేరు మున్సిపల్ చైర్పర్సన్ గా స్వతంత్ర అభ్యర్థి ఇప్ప ఉమారాణి పేరును ప్రతిపాదించారు. 29వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ అంజాద్ బలపరిచారు. బిజెపి నుంచి 44వ వార్డు కౌన్సిలర్ ప్రీతి జైన్ చైర్పర్సన్ అభ్యర్థిగా గాండ్ల సుజిత పేరును ప్రతిపాదించగా 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల రాణి బలపరిచారు. స్వతంత్ర అభ్యర్థికి కాంగ్రెస్ నుంచి 19 మంది కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు చేయి లేపి ఓటు వేశారు. బిజెపి అభ్యర్థికి ఎమ్మెల్యేతో పాటు బిజెపికి చెందిన 17 మంది కౌన్సిలర్లు మద్దతు ప్రకటించారు. దాంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ఇప్ప ఉమారాణి చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. బిఆర్ఎస్ కు వైస్ చైర్పర్సన్.. మున్సిపల్ వైస్ చైర్ప ర్సన్ గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామిని 45 వ వార్డు కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్ ప్రతిపాదించగా 18వ వార్డు కౌన్సిలర్ బలపరిచారు. బిజెపి నుంచి 39వ వార్డు కౌన్సిలర్ మోటూరి శ్రీకాంత్ ను ఆ పార్టీ అభ్యర్థులు ప్రతిపాదించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కాసర్ల గోదావరి వైస్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# లక్షెట్టిపేట్ మున్సిపల్ ఛైర్పర్సన్గా దొంత అంజలి..
## వైస్ ఛైర్మన్ గా మోత్కూరి రాజేశ్వరి

**లక్షెట్టిపేట్, వుదయం:**




లక్షెట్టిపేట్ మున్సిపాలిటీ చైర్మన్వైస్ చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారో త్సవంలో భాగంగా మున్సిపాలిటీ చైర్మన్ గా 2వ వార్డు కౌన్సిలర్ దొంత అంజలి, వైస్ చైర్మన్గా 4వ వార్డు కౌన్సిలర్ మోతుకూరి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం వార్డు కౌన్సిలర్లకు మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ లకు మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ ఆధ్వర్యం లో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డ్ లుండగా 11 కాంగ్రెస్, 3 బీ ఆర్ ఎస్, 1 బీజేపీ గెలుపొందాయి. సంపూర్ణ మెజారిటీ ఉండటంతో మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కాగా, పట్టణ చరిత్రలో మున్సిపల్ పీఠంపై ఇద్దరు మహిళలే కొలువుదీరడం పట్టణ చరిత్రలో ఇదే తొలిసారి.

# వైభవంగా లక్ష్మి దేవర బోనాలు

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముదిరాజ్ కుల సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మి దేవర బోనాలు వైభవంగా నిర్వహించారు లక్ష్మి దేవర బోనాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు నైవేద్యాలతో కూడిన బోనాలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురుకి పూనకాలు రావడంతో లక్ష్మి దేవర బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలలో మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్, ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్, ముదిరాజ్ కుల సంఘం పెద్దలు నాయకులు జోడు చంటి, కార్తీకు, సంతోష్, జోడు మహేందర్, గడ్డం తిరుపతి, వార్డు సభ్యులు గడ్డం స్వామి నల్లభాగ సమ్మయ్య చీర్లవంచ చంద్రశేఖర్ మహమ్మద్ బిన్ అలీ వడాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి నిలయంలో నటరాజ కళాక్షేత్రం
## విద్యార్థుల వైభవోపేత కూచిపూడి నృత్య ప్రదర్శన

**ఖానాపూర్, వుదయం**



ఖానాపూర్ నియోజకవర్గం, జన్నారం మండల కేంద్రానికి చెందిన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు రాష్ట్రపతి నిలయంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. హైదరాబాద్ నగరంలోని ప్రసిద్ధి గాంచిన రాష్ట్రపతి నిలయంలోని కళా సంధ్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవం కళా వైభవంతో కళకళలాడింది. నటరాజ కళాక్షేత్రం జన్నారం, లక్సెట్టిపేట్ లకు చెందిన విద్యార్థులు తమ అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనతో సభలోని ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేశారు. భారతీయ సాంప్రదాయ నృత్యరూపాలలో ప్రత్యేక స్థానం కలిగిన కూచిపూడిని విద్యార్థులు ఎంతో నైపుణ్యంతో, భక్తి భావంతో ఆవిష్కరించారు. గురువు నర్మద కృషి, శిక్షణ, మార్గనిర్దేశంతో విద్యార్థులు ప్రతి అడుగులోనూ క్రమశిక్షణ, లయ, తాళ సమన్వయం, భావవ్యక్తీకరణలను సమర్థంగా ప్రతిబింబించారు. వారి ముద్రాభినయాలు, నేత్రాభినయాలు, హస్తముద్రలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ప్రతి నృత్యాంశం భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మికతలను ప్రతిఫలించేలా సున్నితంగా రూపుదిద్దుకుంది. వేదికపై విద్యార్థుల ఆత్మవిశ్వాసం, సమన్వయం, శ్రద్ధ ప్రత్యేకంగా మెరిసాయి.సంగీతానికి అనుగుణంగా వారు చేసిన నృత్య కదలికలు సభలో కళాత్మక వాతావరణాన్ని సృష్టించాయి. రాష్ట్రపతి నిలయం వంటి అత్యంత గౌరవనీయమైన ప్రదేశంలో ప్రదర్శన ఇవ్వడం తమకు ఎంతో గర్వకారణమని, ఇది విద్యార్థుల కృషికి లభించిన గొప్ప గుర్తింపని గురువర్యులు నర్మద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ నర్మదా గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన నాటరాజ కళాక్షేత్రం యొక్క కళా ప్రస్థానానికి మరొక విశిష్ట ఘట్టంగా నిలిచింది.గురువు, శిష్యుల సమిష్టి కృషి ఫలితంగా ఈ నృత్య ప్రదర్శన సాంస్కృతిక వేదికపై చిరస్మరణీయంగా నిలిచిపోనుంది అని అన్నారు.

# ఘనంగా మల్లికార్జున స్వామి బోనాల జాతర

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మేడిగడ్డ గ్రామంలో మల్లికార్జున స్వామి (మల్లన్న) బోనాల ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలోని భక్తులు కొత్త కుండలలో బోనాలను వండుకుని, శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల నడుమ స్వామివారికి సమర్పించారు. ఈ సంప్రదాయ వేడుకల్లో భాగంగా పట్నాల కార్యక్రమం, ఒగ్గు కథలు, ఆది మల్లికార్జున స్వామి కళ్యాణం చూపారులను ఆకట్టుకున్నాయి. గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించిన బోనం కుండలను తలపై మోసుకెళ్లి, మల్లన్నకు నైవేద్యంగా సమర్పించారు. గతంలో జిల్లాలో యాచారం మండలం సింగారం, మహదేవపూర్ మండలంలోని బెగ్లూర్, ముత్తారం మండలం ఓడెడ్‌లోని ఆలయాల్లో బోనాల జాతరలను అంగరంగ వైభవంగా నిర్భహించేవారు కొద్ది సంవత్సరాలుగా మేడిగడ్డ గ్రామంలో కూడా కన్నుల పండుగగా నిర వ్వహిస్తున్నారు. ఈ బోనాల్లో మహిళలు అత్యంత నియమ నిష్ఠలతో తయారు చేసిన బోనాలను (బెల్లం పాయసం, నవధాన్యాల పరమాన్నం) స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. కాకతీయుల కాలంనాటి ప్రసిద్ధ ఐనవోలు మల్లికార్జున స్వామి దేవాలయంలో సంక్రాంతి నుండి ఉగాది వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ బోనాల ఉత్సవాలు మల్లికార్జున స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని జరుపుకుంటారు.

# నూతన కౌన్సిలర్ల కు సన్మానం
## చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి



**కామారెడ్డి, వుదయం:**

ఇటీవల జరిగిన కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ముగ్గురు నూతన కౌన్సిలర్లను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సోమవారం అభినందించారు. 14వ వార్డ్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత, 1వ వార్డ్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, 21వ తాటి లావణ్య ప్రసాద్ లను పీసీసీ ప్రధాన కార్యదర్శి సన్మానించారు.

వార్డ్ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కు పెద్దపీట వేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కోరారు. వార్డుల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని కోరారు.

# 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్
## చాంపియన్ షిప్ జిల్లా రెండో స్థానం

**ఊర్కొండ న్యూస్, వుదయం**




నాగర్ కర్నూల్ జిల్లా45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ లో భాగంగా రాష్ట్రంలో నుంచి 33 జిల్లాలు ఈ టోర్నమెంట్లో పాల్గొనడం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా లో 13 14 15 తేదీలలో జరిగినటువంటి సబ్ జూనియర్ బాలికల విభాగంలో నాగర్ కర్నూల్ జిల్లా ద్వితీయ స్థానం సాధించారు. నాగర్ కర్నూల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మల్లేష్ ,ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, శివలింగం, సతీష్, అజయ్ కుమార్, సాయి ప్రకాష్ సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారు వంగూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, మున్ననూర్ సోషల్ వెల్ఫేర్, కల్వకుర్తి ఎం జె పి గర్ల్స్, వంగూరు సోషల్ వెల్ఫేర్ క్రీడాకారులు పాల్గొన్నారు అని జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ యొక్క ప్రకటనలో తెలియజేశారు. పిఈటి స్నేహ, అంజనమ్మ జిల్లా కోచ్, మేనేజర్ గా వ్యవహరించారు.

# 3 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్,
## వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక పూర్తి

**అలంపూర్, వుదయం**





అలంపూర్ నియోజక వర్గంలోని 3 మున్సిపాలిటీలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, అలాగే చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కోసం ఈ సమావేశాలను నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి.ఎమ్.సంతోష్ మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు 3 మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. అయిజ మున్సిపల్ ప్రత్యేక సమావేశం అధీకృత అధికారి జడ్పీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్ సైదులు ఆధ్వర్యంలో జరిగింది. తెలుగు అక్షరమాల క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించిన తర్వాత ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల పూర్తయ్యింది. అయిజ మున్సిపాలిటీ చైర్మన్ గా బి ఆర్ ఎస్ పార్టీ నుండి సి.ఎమ్ సురేష్, వైస్ చైర్మన్ గా మాల నరసింహులు ఎన్నికయ్యారు. వడ్డేపల్లిలో ఆల్ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ నుండి చైర్మన్ గా మంజుల, వైస్ చైర్మన్ గా సారంద ఎన్నికయ్యారు. అలంపూర్ మున్సిపాలిటీ లో చైర్మన్ గా బి ఆర్ ఎస్ నుండి పింది జయరాములు, వైస్ చైర్మన్ గా బి.విక్రమ్ ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల సందర్భంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో
## సంబరాలు సెక్యులరిజం గెలిచిందన్న నేతలు

**ఆదిలాబాద్, వుదయం:**



బీజేపీ మతతత్వ విధానానికి వ్యతిరేకంగా కలిసి వచ్చిన పార్టీలు స్వతంత్రులతో కలిసి మున్సిపల్ పీఠాన్ని హస్తగతం చేసుకోవడం ఆనందంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్ ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అభినందనలు చెప్పుకున్నారు. తమతో కలిసి నడిచిన పార్టీలు బీఆర్ఎస్, ఎంఐఎమ్ స్వతంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ విధానాలకు నిరసనగా వారంతా మద్దతిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరికల్ గ్రామపంచాయతీ పోటాపోటీగా వేలంపాట

**మరికల్, వుదయం**

మరికల్ మండల కేంద్రంలోని సోమవారం గ్రామపంచాయతీ 24 షాపులు వేలంపాట నిర్వహించారు. మరికల్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి మరియు మరికల్ సర్పంచ్ గోప చెన్నయ్య ఆధ్వర్యంలో వేలంపాటి నిర్వహించారు. గ్రామస్తులు పోటాపోటీగా వేలం పాటలో పాల్గొన్నారు. అత్యధికంగా 16వ నెంబర్ షాపుకు 26వేల రూపాయలు కిరాయి పలకగా అతి స్వల్పంగా 39వ షాపుకు ఎనిమిది వందల రూపాయలు కిరాయి పలికింది వేలం పాటలో గ్రామస్తులు అధికారులు పాల్గొన్నారు.

# న్యూ గీతాంజలి ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**అలంపూర్, వుదయం**

అలంపూర్ నియోజక వర్గంలో ఐజ మండల కేంద్రంలోని న్యూ గీతాంజలి ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం పాఠశాల కరస్పాండెంట్ కె. వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చిన్న తరగతుల విద్యార్థులకు పాఠాలను బోధించడం విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను సమర్థంగా నిర్వహిస్తూ, పాఠ్యాంశాలను స్పష్టంగా వివరిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలంటే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. అలాగే రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శ్రమించి మంచి ఉత్తీర్ణత సాధించాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేతేశ్వర కంకాలమ్మ దేవాలయంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణం

**జన్నారం, వుదయం**

జన్నారం మండల కేంద్రంలోని వీర్ల గుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ శివాలయం ప్రాంగణంలో సోమవారం అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజారి భూమయ్య శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేసి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎమ్మార్ నరసింహారావు, కోశాధికారి పిల్లి మల్లయ్య, గౌరవ అధ్యక్షులు చిలివేరి నర్సయ్య, ఉపాధ్యక్షులు పర్ల కనకయ్య, సభ్యులు సూ రనేని కొండయ్య, పోతు సురేష్, పోతురమణ, మదిరే సతీష్, నగురు మహేందర్, పిల్లి అంజయ్య, కోడి జుట్టు రాజన్న, నగురు సతీష్, నగురు నరేష్, సంద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా మున్సిపల్ చైర్మన్ గా
## బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం

**కల్వకుర్తి, వుదయం**



కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ గా బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లో ఆర్డీఓ సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో చైర్మన్ గా బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ గా శాన్వాస్ ఖాన్, తోపాటు 20 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి, బచ్చు రామకృష్ణ, చారకొండ వెంకటేష్, బాలాజీ సింగ్, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీల్లో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలా మందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీల్లో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళ్లు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

## చికెన్‌లో ఈ పార్ట్ సైలెంట్ కిల్లర్..

బిర్యానీలో చికెన్ లెగ్ ముక్కలు తినడం ఆరోగ్యానికి ప్రయోజనకరమా లేదా హానికరమా? గుండె జబ్బులు, మధుమేహం, బరువు పెరిగే సమస్యలు ఉన్నవారు లెగ్ ముక్కలు ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. బిర్యానీలో



చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది జ్యూసీ చికెన్ లెగ్ పీస్. బిర్యానీలో చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది జ్యూసీ చికెన్ లెగ్ పీస్. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ ముక్క కోసం పోటీపడతారు. అయితే ఈ రుచికరమైన చికెన్ పీస్ ఆరోగ్యానికి మేలు చేస్తుందా లేదా అనే దాని గురించి తప్పక తెలుసుకోవాలి.ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం చికెన్ లెగ్ ముక్కలలో ప్రోటీన్‌తోపాటు దాదాపు 12 రకాల విటమిన్లు ఖనిజాలు ఉన్నప్పటికీ, అవి కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి సైలెంట్ కిల్లర్‌లా ప్రాణాలను హరిస్తాయట.చికెన్ లెగ్ ముక్కల్లో ముదురు మాంసం ఉంటుంది. తెల్ల మాంసంతో పోలిస్తే చికెన్ లెగ్ పీస్‌లో కొవ్వు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వాటిని జాగ్రత్తగా తీసుకోవాలి.లెగ్ ముక్కల్లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరం. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నవారు, డైట్ ఫాలో అవుతున్నవారు లెగ్ పీసెస్ తినకుండా ఉండాలి. వీటిలో ఉండే అదనపు కేలరీలు వేగంగా బరువు పెరగడానికి దారితీస్తాయి. డయాబెటిక్ రోగులు తమ ఆహారంలో కొవ్వు పరిమాణాన్ని నియంత్రించుకోవాలి. చికెన్ అధికంగా తీసుకోవడం వల్ల జీవక్రియపై ప్రభావం చూపుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు ఆటంకం కలిగిస్తుంది.

## ఈ గింజలు వదలకుండా తినేయండి..!



జాక్ ఫ్రూట్ గింజలు ఫైబర్ తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల రు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగి ఉంటారు. అతిగా తినకుండా ఉండటానికి సహాయపడుతుంది. పనస గింజల్లో ఇనుము పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కూడా సహాయపడుతుంది. దీన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. పనస గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి, తరచుగా మలబద్ధకంతో బాధపడేవారు వీటిని తినాలి. అలాగే, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కూడా పనస గింజలు ఎంతో మంచిదని చెబుతున్నారు. పనస గింజలను పొడి చేసుకుని తీసుకుంటే జీర్ణ సమస్యలు ముఖ్యంగా గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయని సూచిస్తున్నారు. అలాగే, విటమిన్ ఎ పనస గింజల్లో పుష్కలంగా లభ్యమవుతుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకాలలో ఒకటన్న సంగతి తెలిసిందే. దాంతో కంటి ఆరోగ్యం పెరుగుపడుతుంది. అదేవిధంగా పనస గింజల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకులను, దంతాలను దృఢంగా మారుస్తాయి. గుండె పోటు, ఇతర గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రు పనస గింజలను వేయించి తినవచ్చు. వాటిని ఒక పాన్ ద 15–20 నిమిషాలు వేయించాలి. అవి కొద్దిగా గోధుమ రంగులోకి మారిన తర్వాత, వాటిపై కొంచెం నల్ల ఉప్పు, చాట్ మసాలా చల్లి తినండి. పనస గింజలను ఎండలో ఎండబెట్టి పొడి చేసి, సలాడ్లు లేదా పండ్లపై చల్లి తినవచ్చు. కు ఇష్టమైన పండ్లతో పాటు పనస గింజల సహాయంతో రు స్మూతీలను కూడా తయారు చేసుకోవచ్చు. కాబట్టి, పనస గింజలను ఉడకబెట్టి లేదా వేరే విధంగా కూడా తీసుకోవచ్చు.

## అరటిపండ్లు లేదా ఖర్జూరా.. మార్నింగ్ తినేందుకు ఏది బెస్ట్!

మార్నింగ్ మనం తినే ఆహారం అనేది మన డే మొత్తంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి మనం మార్నింగ్ తినే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఈ మధ్య కాలంలో చాలా మంది మార్నింగ్ లేచిన వెంటనే టీ, కాఫీ వంటివి తీసుకోవడం మనం గమనించవచ్చు. కానీ నిపుణులు మాత్రం ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో అరటి పండు, ఖర్జూరం రెండూ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయని చెబుతున్నారు. సరైన ఆహారంతో మన డేను ప్రారంభించడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇది మన మొత్తం ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యం మార్నింగ్ పండ్లను తినడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి పండు ప్రత్యేకమైనదే.. వీటిని ఖాళీ కడుపుతో తిన్నప్పుడు ఒక్కొటి ఒక్కొరకమైన ప్రయోజనాలను అందిస్తాయి.



సాధారణంగా జనాలు ఎక్కువగా తీసుకునే అరటి పండు, లేదా ఖర్జూరా పండ్ల విషయానికి వస్తే ఈ రెండు కూడా వేర్వేరు పోషక ప్రొఫైల్‌లను అందిస్తాయి. కాబట్టి ఏ పండు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి. మార్నింగ్ తినేందుకు రెండింటిలో ఏద ఉత్తమమైనదో చూద్దాం. అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. దీనిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల అవి గుండె, కండరాల పనితీరుకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇది చాలా మందికి సులభంగా జీర్ణం అవుతుంది. అయితే దీన్ని తినడం వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఉంటాయి. ఇది శరీంలోని మెగ్నీషియం సమతుల్యతను దెబ్బతీయవచ్చు. అలాగే సహజ చక్కెరలు శక్తిలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతాయి, ఆ తర్వాత అకస్మాత్తుగా తగ్గుతాయి. సున్నితమైన వ్యక్తులలో, ఇది ఆమ్లత్వం లేదా ఉబ్బరాన్ని కలిగిస్తుంది. కాబట్టి ఇది అందిరికి ఒకే రకమైన ప్రయోజనాలను అందించలేదు. ఖర్జూరాలు ఖాళీ కడుపుతో తినడానికి అత్యంత ప్రయోజనకరమైన పండ్లలో ఒకటిగా పరిగణించబడతాయి, ముఖ్యంగా సాంప్రదాయ, ఆయుర్వేద పద్ధతులలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అలాగే మలబద్ధకాన్ని నివారిస్తుంది. అలాగే ఆమ్లత ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఖర్జూరాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, జీవక్రియను పెంచుతాయి. వాటిలో ఇనుము, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి, ఇవి ఉదయం అలసట లేదా శక్తి లేకపోవడం అనుభవించే వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2–3 ఖర్జూర పండ్లను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి పోషకాలు గ్రహించబడతాయి. చాలా మంది కి, ఖాళీ కడుపుతో ఖర్జూరాలు తినడం ఆరోగ్యకరమైన ఎంపిక కావచ్చు. ఎందుకంటే అవి జీర్ణక్రియకు సహాయపడతాయి అలాగే దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు పోషకమైనవి, కానీ జీర్ణ సమస్యలను నివారించడానికి వాటిని తరువాత లేదా ఇతర ఆహారాలతో కలిపి తినడం మంచిది. అయితే, మధుమేహ వ్యాధిగ్రస్తులు తాము తీసుకునే పండ్లు, కూరగాయల పరిమాణాన్ని పర్యవేక్షించాలి. ఆమ్లత్వం లేదా ఉబ్బరం ఉన్నవారు అరటిపండ్ల కంటే ఖర్జూరం జీర్ణం కావడానికి సులభం అని భావిస్తారు. అరటిపండ్లు, ఖర్జూరాలు రెండూ ఆరోగ్యకరమైన పండ్లు, కానీ వాటిని తీసుకునే సమయం వేటితో కలిపి తింటున్నామనేది ముఖ్యం. ఖర్జూరాలు సాధారణంగా ఖాళీ కడుపుతో తింటే పోషకమైనవి, కానీ ఉదయం అరటిపండ్లను ఇతర ఆహారలో పార్టు తీసుకోవడం ఉత్తమం.

## లంచ్ తర్వాత నిద్రొస్తోందా..?

మధ్యాహ్నం భోజనం చేశాక.. కొంత మంది నిద్రొచ్చినట్లుగా, మగతగా ఫీలవుతుంటారు. మరి, ఇంట్లో ఉంటే కాసేపు కునుకు తీయచ్చు.. కానీ ఆఫీసులో ఉండేవారికి ఇది కుదరదు.. ఇలా మగతగా ఉన్నప్పుడు చేసే పనిపై ఏకాగ్రత పెట్టలేం.. అలాగని కాసేపు రిలాక్సవుదామంటే కుదరకపోవచ్చు. అందుకే ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కొన్ని అంశాలు దృష్టిలో ఉంచుకోవాలంటున్నారు నిపుణులు. తిన్న వెంటనే శరీరం రిలాక్సవుతుంది.. దాంతో నిద్రొచ్చినట్లుగా అనిపిస్తుంది. కాబట్టి తిన్న వెంటనే సీట్లో వాలిపోకుండా.. ఓ పది నిమిషాల పాటు నడక మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల శరీరంలో ఆక్సిజన్ స్థాయులు పెరిగి.. అవయవాలకు రక్తప్రసరణ మెరుగవుతుంది. తద్వారా శరీరం తిరిగి శక్తిని కూడగట్టుకుంటుంది. చూయింగ్ గమ్ నమిలితే నిద్ర మత్తు వదిలిపోతుందని ఓ అధ్యయనం చెబుతోంది. అయితే అది కూడా ఐదు నుంచి పది నిమిషాలు చాలట! శరీరం డీహైడ్రేషన్‌కి గురైనా అలసిపోయినట్లుగా అనిపిస్తుంది. కాబట్టి రోజూ సరైన మోతాదులో నీళ్లు తాగడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అలాగే మధ్యాహ్నం భోజనం తర్వాత కూడా కొంత విరామం ఇచ్చి నీళ్లు, ఇతర పానీయాలు తీసుకోవడం వల్ల శరీరం పునరుత్తేజితమవుతుంది. మధ్యాహ్న భోజనం కడుపు నిండుగా తినాలనుకుంటారు చాలామంది! ఆ సమయంలో నిద్ర రావడానికి, మగతగా అనిపించడానికి ఇదీ ఓ కారణమేనట. అతిగా తినడం వల్ల కడుపు ఉబ్బరంగా, అసౌకర్యంగా అనిపిస్తుంది.. శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది. కాబట్టి ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినకుండా, తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు తినేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు నిపుణులు. రాత్రుళ్లు కనీసం ఏడెనిమిది గంటల సుఖ నిద్ర ఉన్న వారిలో ఈ మగత ఫీలింగ్ ఉండనే ఉండదు. తద్వారా లంచ్ తర్వాతే కాదు.. ఇతర సమయాల్లోనూ కునుకు రానే రాదు. కాబట్టి రాత్రిళ్లు సుఖంగా నిద్రపోయేలా అలవాటు చేసుకోవాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగడం వల్ల రాత్రుళ్లు సరిగా నిద్ర పట్టక, పగటి పూట మగతగా ఉండే అవకాశం ఉంటుందంటున్నారు. అందుకే రోజుకు ఒకటి లేదా రెండు కప్పులకు మించి వీటిని తీసుకోకపోవడమే ఆరోగ్యకరమని చెబుతున్నారు.



## రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది..?

మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ



శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలా మందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్ మ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరం లోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

## ఈ లక్షణాలు కనిపించినా.. ఒంట్లో డయాబెటిస్ తిష్ఠవేసినట్లే!

దయాబెటిస్ అనేది సాధారణ వ్యాధి కాదు. ఒక్కసారి ఇది ఒంట్లోకి ప్రవేశిస్తే ఎన్నో రకల రోగాలు దాని వెంట వచ్చి శరీరంలో తిష్ఠ వేస్తాయి. అందుకే నేటి కాలంలో దీనికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అయితే కొంతమందికి ఎన్ని సార్లు డయాబెటిస్ టెస్ట్ చేయించినా రక్తంలో వారి చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ సాధారణంగా ఉంటాయి. కానీ నిరంతరం అలసట వారిని వేదిస్తుంది. దీనిని తరచుగా ఒక సాధారణ సమస్యగా విస్మరిస్తారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం నిరంతర అలసట శరీరంలో అంతర్గతంగా దాగిన డయాబెటిస్‌కు సంకేతం కూడా కావచ్చని అంటున్నారు. కాబట్టి లక్షణాలు కనిపించకుండా రహస్యంగా దయాబెటిస్ అంటే ఏమిటి? అది రక్త పరీక్షలలో ఎందుకు సులభంగా కనిపించదు? దానిని కనుగొనడానికి ఏం చేయాలి? వంటి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. ఘజియాబాద్ జిల్లా ఆసుపత్రికి చెందిన డాక్టర్ శాంత్రమ్ వర్మ దీని గురించి మాట్లాడుతూ.. చాలా మందికి చక్కెర స్థాయిలు సాధారణంగానే ఉన్నప్పటికీ ఇన్సులిన్ నిరోధకత ఉంటుంది. దీని వల్ల బ్లడ్ టెస్ట్‌లో చక్కెర స్థాయిలు సాధారణంగానే కనిపిస్తాయి. కానీ ఇన్సులిన్ సరిగ్గా పని చేయదు. ఈ పరిస్థితిలో రక్తంలో చక్కెర కొంతకాలం సాధారణంగానే కనిపించవచ్చు.



## ద్రాక్షని శుభ్రం చేస్తున్నారా?

ఈ సీజన్లో వచ్చే ద్రాక్షపండ్లంటే పిల్లల నుంచి పెద్దలవరకూ అందరికీ ఇష్టమే. కానీ సమస్యల్లా వాటిపైన పిచికారీ చేసే రసాయన క్రిమిసంహారకాలతోనే. అందుకే వాటిని తినేముందు తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. ముందుగా ఒక పాత్రలోకి తీసుకుని పండ్లను గుత్తుల నుంచి విడదీసి... చేతులతో శుభ్రంగా కడగండి. దీనివల్ల వాటిపైన ఉండే దుమ్ముధూళీ, పొరగా ఏర్పడ్డ కొన్ని రసాయనాలు పోతాయి. రెండో దశలో వంట సోడాను తీసుకోండి. లీటరు నీటిలో టీ స్పూను వంట సోడాను కలిపి, అందులో పండ్లని పావుగంటసేపు ఉంచండి. క్రిమి సంహారకాలను శుభ్రపరచడంలో ఇది మెరుగ్గా పనిచేస్తుంది. ఆపై ద్రాక్షని మంచినీటితో కడగండి. బేకింగ్ సోడాకు ఉన్న ఆల్కలైన్ స్వభావం రసాయనాలను తొలగిస్తుంది. ఇప్పుడు వినెగర్ తీసుకోండి. ఇది పండ్లపై ఉండే రసాయనాలతో పాటు బ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవుల్నీ శుభ్రపరుస్తుంది. మూడు వాటాల నీటికి, ఒక వాటా వినెగర్‌ని కలపండి. ఆ నీటిలో ద్రాక్షపండ్లను 5–10 నిమిషాలు ఉంచండి. తర్వాత మంచి నీటితో శుభ్రం చేస్తే సరి. బేకింగ్ సోడా, వినెగర్ లేకున్నా రాళ్ల ఉప్పుతోనూ ద్రాక్ష పండ్లను శుభ్రం చేయొచ్చు. కడిగాక వాటిని క్లాత్‌తో తుడిచి తింటే సరి.



# మళ్లీ తగ్గిన బంగారం ధర

బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు క్రమంగా కొనసాగుతున్నాయి. కొద్దిరోజులుగా వెండి రేట్లలో కొత్తట్రెండ్ కనిపిస్తోంది. ప్రతి మూడురోజులకు ఒకసారి వెండి ధరలు మారుతున్నాయి. ఫిబ్రవరి 13న రూ.20,000తగ్గిన కిలో వెండి ధర రూ.2,80,000 వద్ద స్థిరపడింది. నేడు కూడా ఇదే ధర కొనసాగుతోంది. బంగారం విషయానికొస్తే.. నేడు ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1310 తగ్గి



రూ.1,56,440వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1200 తగ్గి రూ.1,43,400గా ఉంది. ఎల్లుండి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు ప్రారంభం కానున్న క్రమంలో బంగారం ధరలు తగ్గడం కొనుగోలు దారులకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పాలి. ఇదిలా ఉండగా.. 2027 చివరినాటికి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000 నుంచి లక్షరూపాయల మధ్యలో స్థిరపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం రష్యా – అమెరికా మధ్య డాలర్ డీల్ జరుగుతుందన్న వార్తలు రావడమే. రష్యా.. అమెరికా డాలర్లలో వ్యాపారానికి డీల్ చేసుకుంటే బంగారం ధర గరిష్ఠంగా తగ్గుతుందని చెప్తున్నారు. గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.84 లక్షలు తాకినా.. ప్రస్తుతం రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతోంది. బంగారంపై పెట్టుబడులు పెరగడంతోనే దాని ధర అమాంతం పెరిగిపోయింది.

# సగానికి పైగా ఈవీ మార్కెట్ వాటా మూడు కంపెనీలదే



దేశీయ ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) రంగంలో దేశీయ టీవీఎస్ మోటార్, బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ వంటి సాంప్రదాయ దిగ్గజ కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ కంపెనీలు దేశంలోని ఎలక్ట్రిక్ స్కూటర్, బైక్ మార్కెట్‌లో 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి. వీటి ముందు కొత్త స్టార్టప్ కంపెనీలు ఈ మాత్రం సత్తా చాటడంలేదు. ఈవీ రంగం ప్రారంభ దశలో ఉన్నప్పుడు చిన్న స్టార్టప్ బ్రాండ్‌లు ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లో ముందంజలో ఉన్నాయి. కానీ గతేడాది కంపెనీలన్నీ ఈవీ విభాగంలో కొత్త బైక్, స్కూటర్లను తీసుకురావడం, కస్టమర్ల నుంచి నమ్మకాన్ని పొందడంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున అమ్మకాలను సాధించాయి. 2023లో టీవీఎస్, బజాజ్, హీరో కంపెనీల వాటా కేవలం 34 శాతం మాత్రమే ఉండేది. ఆ సమయంలో ఓలా, ఏథర్ లాంటి కంపెనీలు అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే, ఆలస్యంగా ఈవీ విభాగం లోకి వచ్చినప్పటికీ ఈ మూడు కంపెనీలు తమ పెట్టుబడుల సామర్థ్యం, నెట్‌వర్క్, తొందరగా కొత్త మోడల్స్‌ను తీసుకురావడం ద్వారా తక్కువ సమయంలోనే మార్కెట్ వాటాను సొంతం చేసుకున్నాయి. అధికారిక వివరాల ప్రకారం, ఈ ఏడాది జనవరి నాటికి టీవీఎస్ 28 శాతం, బజాజ్ ఆటో 21 శాతం, ఏథర్ 18 శాతం, హీరో మోటోకార్ప్ 11 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈవీలు కొత్తగా వచ్చిన సమయంలో 35 శాతానికి పైగా వాటా ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతానికి పడిపోయింది.

# రూపాయికి ముడి చమురు సెగ!



అమెరికా ఒత్తిడితో రష్యాయేతర చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ద్వారా రూపాయి మరింత బలహీనపడనుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఖరీదైన రష్యాయేతర ముడి చమురు కొనుగోలు కారణంగా 2026 నాటికి డాలర్‌తో రూపాయి విలువ 93కి పడిపోవచ్చని విశ్లేషించింది. గతేడాది కాలంలో డాలర్‌తో రూపాయి 5 శాతం పతనమై 92 మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. ఉగతేడాది డాలర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించిన రూపాయి ఇటీవల యుఎస్– ఇండియా వాణిజ్య ఒప్పందం వల్ల ప్రస్తుతం రూ.90.4 వద్ద నమోదవుతోంది. మేము గతంలో డాలర్‌తో రూపాయి విలువ 95కి చేరుతుందని అంచనా వేయగా.. ఇప్పుడు 2026 చివరి నాటికి రూపాయి మరింత నెమ్మదిగా క్షీణించి సుమారు 93 వద్ద ట్రేడ్ కావొచ్చని భావిస్తు న్నాము. మార్కెట్ల నుంచి ఎఫ్‌ఐఐలు తరలిపోవడం, వాణిజ్య ఒప్పందం ప్రకారం ఖరీదైన రష్యాయేతర ముడి చమురు వైపు మళ్లడం ఈ క్షీణతకు కారణమవుతాయి.'' అని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు ఆసియా కరెన్సీలకు మద్దతునిస్తుందని.. అయితే దేశీయ స్థిరత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఫిచ్ తెలిపింది. 'బలహీనమైన యుఎస్ డాలర్ నేపథ్యం ఎంపిక చేసిన కరెన్సీలకు మద్దతు ఇస్తుంది.. కానీ లాభాలు అసమానంగా ఉంటాయి. బలమైన కరెంట్ ఖాతాలు, ఆర్థిక లోటు, వాణిజ్య క్షీణత లేదా జోక్యం ఎక్కువగా ఉండే దేశాల కరెన్సీలు తమ విలువను నిలబెట్టుకోవడంలో ఇబ్బంది పడతాయి.'' అని ఫిచ్ తెలిపింది.

# అందరూ వాట్సాప్ స్పామ్ బాధితులే

వాట్సాప్‌లో స్పామ్ మెసేజ్‌లు, కాల్స్ బెడద ఎక్కువైపోయాయి. దీనిపై చాలామంది నుంచి ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. ముఖ్యంగా అంతర్జాతీయ నెంబర్లతో వచ్చే కాల్స్ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి స్పామ్ మేసేజ్‌లు, కాల్స్‌ను ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు కూడా రకరకాల స్కామ్‌లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. పెరుగుతున్న డిజిటల్ వినియోగానికి తగినట్టుగా ఈ స్పామ్ కాల్స్, మేసేజ్‌లు పట్టణాలకే పరిమితం కాలేదు, గ్రాణ ప్రాంతాలకూ విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి వాట్సాప్ యూజర్ ప్రతిరోజూ ఏదొక స్పామ్, ప్రమోషనల్ వాట్సాప్ మెసేజ్‌లను ఎదుర్కొంటున్నారు. ప్రముఖ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన తాజా సర్వేలో మరిన్ని వివరాలు బహిర్గతం అయ్యాయి. దాదాపు 96 శాతం వాట్సాప్ యూజర్లు ప్రతి రోజూ ఈ స్పామ్ మెసేజ్, కాల్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల కస్టమర్ల ప్రైవసీ, డేటా దుర్వినియోగం, స్పామ్‌ల తనిఖీలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాట్సాప్‌లో ప్రతిరోజూ రకరకాల ప్రమోషనల్, స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని యూజర్లు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని వాట్సాప్ యూజర్ల నుంచి లోకల్ సర్కిల్స్ వివరాలను సేకరించగా, కేవలం 4 శాతం మంది మాత్రమే తమకు అటువంటి మెసేజ్‌లు రావట్లేదన్నారు. సగం మందికి(54 శాతం) పైగా యూజర్లు రోజుకు మూడు సార్లు స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని, 30 శాతం మంది 4–7 స్పామ్ మెసేజ్‌లను, 11 శాతం మంది 8, అంతకంటే ఎక్కువ మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. ఈ మెసేజ్‌లలో ఎక్కువగా బిజినెస్ అకౌంట్ల నుంచి వస్తున్నాయని, స్పామ్ మెసేజ్‌లు పంపేవారు వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌కు డబ్బు చెల్లిస్తున్నారని యూజర్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న స్పామ్‌లు మూడేళ్ల నాటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయని లోకల్ సర్కిల్స్ నివేదిక అభిప్రాయపడింది. గత 36 నెలల్లో స్పామ్‌ల సమస్య మరింత తీవ్రమైందని డేటా చెబుతోంది. రోజుకు ఒకటి నుంచి మూడు స్పామ్ మెసేజ్‌లను ఎదుర్కొనే యూజర్లసంఖ్య తగ్గినప్పటికీ, 4–7మెసేజ్‌లు, 8లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లను చూసే యూజర్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రతిరోజూ 8లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు చూసే వారు 2023లో 11 శాతం ఉండగా, ఇప్పుడు 19 శాతానికి పెరిగారు.




# బిజినెస్

# ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలున్నాయి..

పూర్తిస్థాయిలో ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. మనదేశంలో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగానికి కొన్ని గంటల ముందు శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.భారత్‌కు ఉన్నటెక్నాలజీ ప్రతిభ, జాతీయ వ్యూహం, టెక్నాలజీ సామర్థ్యంపై నమ్మకం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారత్ స్వదేశీ నైపుణ్యం ద్వారా ఏఐలో సరైన స్థాయిలో అమలు చేసేందుకు విధానపరమైన ప్రోత్సాహం కలిగి ఉంది. ముఖ్యంగా భారత ప్రభు త్వం ఇండియాఏఐ మిషన్ లక్షలాది మందికి అవసరమైన సాధ నంగా మారుతోంది. కంప్యూటర్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు, స్టార్టప్‌లకు మద్దతిచ్చేందుకు, హెల్త్‌కేర్, వ్యవసాయం, పబ్లిక్ సర్వీసెస్‌లో యాప్‌లను రూపొందించడంలో విజయవంతమైందని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఏఐ టూల్స్‌ను వేగంగా ఉపయోగించడంలో 10 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లతో అమెరికా తర్వాత రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో భారత్ పూర్తిస్థాయి ఏఐ లీడర్‌గా ఉండటానికి అన్ని అర్హతలను కలిగి ఉంది.



# పీఎస్‌బీల లాభాలు రూ.2 లక్షల కోట్లకు పైనే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు(పీఎస్‌బీ) రూ.2 లక్షల కోట్లకు పైగా రికార్డు లాభాలను సాధిస్తాయని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు విశ్వాసం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగ ఆర్థికంగా బలపడుతోందని, స్థిరమైన లాభాలను చూస్తున్నాయని ఆయన తెలిపారు. పీటీఐతో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయి. డిపాజిట్లు అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యం బలంగా ఉండటాన్ని సూచిస్తుంది. ఈ ఏడాది పీఎస్‌బీలో క్రెడిట్ వృద్ధి దాదాపు 12 శాతం వద్ద ఉంది. ఇదే సమయంలో డిపాజిట్ల వృద్ధి దాదాపు 10 శాతం ఉందని నాగరాజు వివరించారు. ఈ నేపథ్యంలో పీఎస్‌బీలు చారిత్రాత్మక లాభాలను చూడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే దాదాపు రూ. లక్ష కోట్లను చేరుకున్నాయి. మిగిలిన సగంలో రూ. 2 లక్షల కోట్లను దాటడం సులభమేనని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లలో బ్యాంకింగ్ రంగం ఆదాయం భారీగా పెరిగింది.

## దేశీయంగా మొట్టమొదటి నథింగ్ ఇండియా స్టోర్

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టెక్ గ్యాడ్జెట్‌లకు భారత మార్కెట్ అత్యంత అనువైన కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే భారత మార్కెట్లో రిల్ స్టోర్ల ఏర్పాటుతో ఎంట్రీ ఇచ్చిన యాపిల్ రికార్డు స్థాయిలో అమ్మకాలను సాధిస్తోంది. ఈ క్రమంలో మరో




గ్లోబల్ కంపెనీ, బ్రిటీష్ బ్రాండ్ నథింగ్ దేశీయంగా తన మొట్టమొదటి ఫ్లాగ్‌షిప్ రిల్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బెంగళూరులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ప్రారంభానికి నథింగ్ సీఈఓ కార్ల్ పీ, కో–ఫౌండర్, నథింగ్ ఇండియా ప్రెసిడెంట్ అకిల్ ఎవాంజెలిడిస్ హాజరయ్యారు. ఈ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ద్వారా కంపెనీ భారత మార్కెట్లో తన బ్రాండ్ కింద ఉన్న స్మార్ట్‌ఫోన్, దుస్తులు సహా ఇతర ఉత్పత్తులను విక్రయించనుంది. దేశీయంగా కంపెనీ విస్తరణకు ఈ స్టోర్ కీలక మైలురాయిగా నిలుస్తుందని కంపెనీ అభిప్రాయపడింది. ఇప్పటికే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తమ బ్రాండ్‌కు స్థానిక కమ్యూనిటీ సంబంధాలు మరింత బలపడేందుకు ఈ స్టోర్ సహకారం అందిస్తుందని అభిప్రాయపడింది. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉన్న ఈ స్టోర్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు అందుబాటులో ఉంటుందని నథింగ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటివరకు నథింగ్ కంపెనీ లండన్‌లో మాత్రమే స్టోర్‌ను నిర్వహిస్తోంది. దీని తర్వాత భారత్‌లో మాత్రమే రెండో స్టోర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ స్టోర్‌లో నథింగ్ స్మార్ట్‌ఫోన్‌లతో పాటు స్మార్ట్ వాచ్‌లు, ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, ఇతర స్మార్ట్ పరికరాలను కస్టమర్లు స్వయంగా సందర్శించి కొనుగోలు చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.

# క్రీడలు

## పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించిన భారత్



టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం సాధించింది. ఈ ఉత్సాహం కేవలం భారత సరిహద్దులకే పరిమితం కాకుండా పొరుగు దేశాల్లోనూ పెను సంచలనం సృష్టించింది. ముఖ్యంగా పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రాంతంతో పాటు ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి భారత విజయాన్ని తమ సొంత గెలుపుగా భావిస్తూ సంబరాలు జరుపుకున్నారు. భారత్ గెలవగానే అక్కడ బాణసంచా కాల్చుతూ, పరస్పరం మిఠాయిలు పంచుకుంటూ స్థానిక ప్రజలు చేసిన సందడికి సంబంధించిన వార్తలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ వేడుకలు కేవలం క్రీడాభిమానాన్ని మాత్రమే కాకుండా, పాకిస్తాన్‌లోని ప్రస్తుత పరిస్థితులు, ఆ దేశంపై అక్కడి ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబించాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా బలూచ్ ప్రజలు తమపై జరుగుతున్న అణచివేతకు నిరసనగా, పాకిస్తాన్ ఓటమిని ఒక పండుగలా జరుపుకోవడం సోషల్ డియాలో వైరల్‌గా మారింది.

# నిప్పులు చెరిగిన పేసర్ అరుంధతి రెడ్డి



హైదరాబాద్ అమ్మాయి, యువ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) నాలుగు వికెట్ల ప్రదర్శనతో నిప్పులు చెరగటంతో ఆస్ట్రేలియా మహిళలతో తొలి టీ20లో భారత్ ఘనవిజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించడంతో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో జరిగిన ఈ మ్యాచ్లో భారత్ 21 పరుగులతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జార్జియా వారెహామ్ (30, 19 బంతుల్లో 4 ఫోర్లు), లిచ్‌ఫీల్డ్ (26, 19 బంతుల్లో 5 ఫోర్లు), జార్జియా వోల్ (26, 10 బంతుల్లో 4 ఫోర్లు), ఎలిసీ పెర్రీ (20, 11 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. బెత్ మూనీ (5), గార్డ్‌నర్ (4), అనాబెల్ (3), నికోల (12), కిమ్ (2) నిరాశపరిచారు. భారత బౌలర్లలో రేణుక సింగ్ (2/14), యువ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) వికెట్లు తీశారు. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత అమ్మాయిలు 5.1 ఓవర్లలో 50/1తో నిలిచారు. ఓపెనర్ స్మృతీ మంధాన (16 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు), జెమా రొడ్రిగ్స్ (9 నాటౌట్, 3 బంతుల్లో 2 ఫోర్లు) అజేయంగా నిలువగా.. షెఫాలీ వర్మ (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది.

# సఫారీల అద్భుత విజయం.. కివీస్ 7 వికెట్ల తేడాతో ఓటమి

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్–డి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో సఫారీలు సూపర్–8 దశలోకి అర్హత సాధించి టోర్నీలో తమ ఆధిపత్యాన్ని చూపించారు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ నిర్ణయం సరిగ్గా నిరూపించబడింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది, అయితే దక్షిణాఫ్రికా బాట్స్‌మెన్ ఈ లక్ష్యాన్ని కేవలం 17.1 ఓవర్లలోనే సులభంగా పూర్తి చేశారు. కెప్టెన్ మార్క్రమ్ అజేయంగా 86 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు, బౌలింగ్‌లో మార్కో జాన్సెన్ 4 వికెట్లు తీసి కివీస్ బ్యాటింగ్‌ను కష్టంలో పెట్టాడు. వరుస విజయాల తర్వాత న్యూజిలాండ్‌కు ఈ ఓటమి పెద్ద షాక్‌గా నిలిచింది. కానీ సఫారీ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఓపెనర్ ఫిన్ అలెన్ వేగవంతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, సఫారీ పేసర్ మార్కో జాన్సెన్ బౌలింగ్ ధాటికి టాప్



ఆర్డర్ బలహీనపడ్డది. మార్క్ చాప్మన్ (48) మరియు డారిల్ మిచెల్ (32) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకోవడానికి ప్రయత్నించగా, జేమ్స్ నీషమ్ (23 నాటౌట్) చివర్లో మెరుపులు చూపి గౌరవప్రదమైన స్కోరు సాధించాడు. సఫారీ బౌలర్లలో జాన్సెన్ 40 పరుగులకే 4 కీలక వికెట్లు తీసి ''ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'' అవార్డు గెలుచుకున్నాడు.176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా, క్వింటన్ డి కాక్ (20) మరియు రయాన్ రికెల్టన్ చక్కగా ప్రారంభించి, తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ మార్క్రమ్ మెరిసిపోయాడు. ట్రిస్టన్ స్టబ్స్‌తో కలసి ఇన్నింగ్స్ నడిపిన మార్క్రమ్ కేవలం 17.1 ఓవర్లలో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. 86 పరుగుల అజేయ ఇన్నింగ్స్ మ్యాచ్ హైలైట్‌గా నిలిచింది. న్యూజిలాండ్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్ ఒక వికెట్ మాత్రమే తీసగలిగాడు.ఈ విజయం దక్షిణాఫ్రికాను గ్రూప్–డి నుంచి సూపర్–8 దశకు అధికారికంగా చేరువ చేసింది.

# ఏం తెలియని వ్యక్తిని పీసీబీ ఛైర్మన్ చేశారు..



టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. కనీసం ఏ దశలోనూ పాక్ భారత్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. మ్యాచ్ పూర్తి ఏకపక్షంగా సాగింది. ఈ నేపథ్యంలో పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ పీసీబీ ఛైర్మన్ నఖ్వీపై విమర్శలు చేశాడు. పాక్ సీనియర్ ఆటగాళ్లైన బాబర్ అజామ్, షాహిన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్ చెత్త ప్రదర్శనలు చేస్తున్నా.. వారిని ఎందుకు టీమ్‌లో కొనసాగిస్తున్నారని ప్రశ్నించాడు. 'అతడికి.. తాను పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ అన్న విషయమైనా గుర్తుందా? ఏ తెలియని వ్యక్తిని పీసీబీ ఛైర్మన్ చేశారు. ఇలాఉంటే జట్టెలా ముందుకు నడుస్తుంది?మీరు ఒక వ్యక్తిని సూపర్ స్టార్ అన్నారు. కానీ అతడు ఒక్క మ్యాచ్ కూడా గెలిపించలేదు' అని షోయబ్ అక్తర్.. నఖ్వీపై నిప్పులు చెరిగాడు. 'మీరు ఇలాంటి స్టార్లను తయారుచేసినప్పుడు, మీరు వారిని ఎంచుకున్నప్పుడు.. ఇలాంటి సమస్యే ఉత్పన్నమవుతుంది. ప్రపంచంలో అతిపెద్ద నేరం ఏంటంటే.. అసమర్థుడిని తీసుకొచ్చి అందలం ఎక్కించడం' అని కుండబద్దలు కొట్టినట్లుగా షోయబ్ అక్తర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. అలాగే సామర్థ్యం లేనివారికి ఉన్నత స్థానాలు కేటాయిస్తే ఇలాంటి అనర్థాలే సంభవిస్తాయి అని అక్తర్ వివరించాడు. 'సామర్థ్యం లేని వ్యక్తిని ఉన్నతస్థానంలో కూర్చోబెడితే అతడు దేశాన్ని నాశనం చేస్తాడు. సొంత వ్యవస్థనే కూలదోస్తాడు. అందుకు ఉదాహరణ కళ్లముందే ఉంది. అతడెవరో ఈ పాటికే అర్థమై ఉంటుంది' అని అక్తర్.. నఖ్వీకి చురకలంటించాడు. ఆదివారం కొలంబో వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. టీ20 వరల్డ్ కప్‌లో భారత్, పాక్‌పై ఆధిక్యాన్ని 7–1 నుంచి 8–1కి పెంచుకుంది. అలాగే పాక్‌పై విజయంతో టీమ్ఇండియా సూపర్ 8లోకి ప్రవేశించింది.

# మ్యాచ్ మధ్యలోనే లాహోర్ పారిపోయిన నఖ్వీ !

ఐసీసీ నిర్వహిస్తున్న ఈవెంట్స్ లో పాకిస్తాన్ పై మరోసారి భారత జట్టు పై చేయి సాధించింది. అసలు పాకిస్తాన్ కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా వరుసగా విజయాలను నమోదు చేస్తోంది భారత జట్టు. టీ20 వరల్డ్ కప్ 2026 లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్ కూడా పాకిస్తాన్ జట్టును ఓడించింది భారత్. పాకిస్తాన్ పై ఏకంగా 61 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ టోర్నమెంట్ లో వరుసగా మూడు విజయాలు నమోదు చేసుకున్న భారత్, సూపర్ 8 లోకి ఎంట్రీ ఇచ్చింది. దీంతో పాక్ జట్టుకు భంగపాటు తప్పలేదు. ఈ లీగ్ దశలో మరో మ్యాచ్ గెలిస్తేనే, సూపర్ 8 ఛాన్స్ పాకిస్తాన్ కు ఉంటుంది. టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో కొలంబో వేదికగా భారత జట్టుతో పాకిస్తాన్ తలపడిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ లో మొదట భారత జట్టు బ్యాటింగ్ చేయగా 175 పరుగులు సాధించింది. అయితే భారత్ విధించిన ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కింద ద పడింది పాకిస్తాన్. ఈ క్రమంలో పవర్ ప్లే ముగియక ముందు నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది పాకిస్తాన్. దీంతో అప్పటికే పాకిస్తాన్ ఓటమి ఖరారైంది. అసలు ఏ మాత్రం ఛాన్స్ కనిపించలేదు. అయితే ఈ విషయాన్ని గమనించిన మొహ్సిన్ నఖ్వీ, వెంటనే కొలంబో స్టేడియం నుంచి వెళ్లిపోయారట. శ్రీలంక నుంచి నేరుగా లాహోర్ వెళ్లినట్లు తెలుస్తోంది. సగం వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్ గెలవడం కష్టమేనని పీసీబీ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ భావించారట.




# పాకిస్తాన్ ఘోర ఓటమి ఇర్ఫాన్ వీడియో వైరల్..

టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో పాకిస్తాన్ ఘోర ఓటమి చవిచూసింది. కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో ఏకంగా 61 పరుగులు తేడాతో దారుణంగా ఓడిపోయింది పాకిస్తాన్. కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓడిపోయిన సందర్భంగా భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తన స్టైల్లో రియాక్ట్ అయ్యారు. నిత్యం పాకిస్తాన్ క్రికెట్ జట్టును విమర్శలు చేసే ఇర్ఫాన్ పఠాన్, డాన్స్ చేస్తూ ఇండియాకు మద్దతు తెలిపాడు. భారత జట్టు చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్తాన్ ను మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ దారుణంగా ట్రోలింగ్ చేశాడు. ఆఫ్ఘన్ జిలేబీ అనే బాలీవుడ్ పాటకు స్టెప్పులు వేస్తూ, పాకిస్తాన్ చిత్తు చిత్తుగా ఓడిందనే సంకేతాన్ని ఇచ్చాడు ఇర్ఫాన్ పఠాన్. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ డియాను షేక్ చేస్తోంది. ఈ వీడియో చూసిన భారత అభిమానులు కూడా తమ స్టైల్ లో స్పందిస్తున్నారు. పాకిస్తాన్ పరువు తీసేలా ఇర్ఫాన్ పఠాన్ అదిరిపోయే ప్లాన్ చేశాడని కామెంట్స్ చేస్తున్నారు. డాన్స్ చేసి పాకిస్తాన్ పరువు తీసాడని అంటున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో భారత జట్టు అద్భుతంగా రాణించింది. ఈ టోర్నమెంట్ లో ఇప్పటికే అమెరికా, నబియా పై విజయం సాధించిన భారత జట్టు, ఆదివారం పాకిస్తాన్ జట్టును కూడా చితక బాదేసింది. కొలంబోలోని ప్రేమ దాస స్టేడియం వేదికగా జరిగిన పాకిస్తాన్ మ్యాచ్ లో అద్భుతంగా రాణించి, విక్టరీ కొట్టింది భారత జట్టు. ఈ మ్యాచ్ లో ఏకంగా 61 పరుగుల తేడాతో విజయం సాధించింది.



# వుదయం సినిమా



# సెయాన్ ఫస్ట్ లుక్ రిలీజ్



వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది. గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సెయాన్" అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 2026లో బిగ్గెస్ట్ ఫ్యామిలీ స్పెక్టకిల్‌గా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ ల్లూక్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కనిపిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. వెనుకన కనిపించే నెమలి రెక్కలు, చుట్టూ ఉన్న నెమళ్లు మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ పాత్రకు మిథికల్ ఆరా అందిస్తున్నాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్‌ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది.

# కాటాలన్ ఫస్ట్ సింగిల్ మజాకో మల్లికా రిలీజ్



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. పుష్ప, జైలర్ వంటి చిత్రాల ద్వారా ఇప్పటికే మలయాళీ ప్రేక్షకులకు సుపరిచితుడైన తెలుగు స్టార్ సునీల్ ఈ ట్రాక్‌లో అదరగొట్టారు. ఐటెం నంబర్‌గా వచ్చిన ఈ పాటలో సునీల్ హైఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్‌గా నిలిచాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన *""మజాకో మల్లికా అనే ట్రాక్‌ను వినాయక్ శశికుమార్ రాశారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర పాడారు. ఇది మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదలైంది.

కాటాలన్ మే 14న భారీ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. ఇంతకు ముందు విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది, అద్భుతమైన యాక్షన్ సన్నివేశా, ఇంతకు ముందు ఎన్నడూ చూడని స్టంట్ సన్నివేశాలు అలరించాయి. ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు, దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, పుష్ప ఫేమ్ రాజ్ తరందాసు, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్‌గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్ప్ట ర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓంగ్‌బాక్ సిరీస్‌కు ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయంగా ప్రఖ్యాత యాక్షన్ డైరెక్టర్ కేచా ఖంఫక్డీ తన బృందంతో కలిసి థాయిలాండ్‌లో యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేశారు. ఓంగ్‌బాక్ చిత్రాల ద్వారా ప్రజాదరణ పొందిన ప్రసిద్ధ ఏనుగు "పాంగ్" కూడా ఈ చిత్రంలో భాగమైయింది.

కాంతారా, మహారాజా వంటి బ్లాక్‌బస్టర్‌లతో పాన్‌ఇండియన్ ఖ్యాతిని పొందిన సంగీత దర్శకుడు బి. అజనీష్‌లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నిర్మాణం పూర్తి కాకముందే, ఈ చిత్రం అనేక ప్రీరిలీజ్ రికార్డులను బద్దలు కొట్టిందని, మలయాళ సినిమాల్లో అతిపెద్ద ఓవర్సీస్ డీల్స్‌లో ఒకటిగా నిలిచింది. Tసిరీస్ మ్యూజిక్ హక్కులను సొంతం చేసుకోగా, షెమరూ డిజిటల్, శాటిలైట్ పంపిణీని నిర్వహిస్తుంది. కాటాలన్ ను పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌గా భారీ స్థాయిలో నిర్మించారు. స్క్రిప్ట్‌ను జాబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జాకబ్ రాశారు, సంభాషణలు ఉన్ని ఆర్. ఈ చిత్రం మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదల కానుంది. ఈ బృందంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జుమానా షరీఫ్, అడిషినల్ సినిమాటోగ్రాఫర్ రెనాదివ్, సినిమాటోగ్రాఫర్ చంద్రు సెల్వరాజ్, ఎడిటర్ షమీర్ ముహమ్మద్, స్టంట్ డైరెక్టర్లు కేచా ఖంఫక్డీ, యాక్షన్ సంతోష్, ప్రొడక్షన్ డిజైనర్ సునీల్ దాస్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ దిపిల్ దేవ్, ప్రొడక్షన్ కంట్రోలర్ దీపక్ పరమేశ్వరన్, ఆడియోగ్రాఫర్ రాజకృష్ణన్ ఎం ఆర్, సౌండ్ డిజైనర్లు కిషన్, సప్త రికార్డ్స్, కాస్ట్యూమ్ డిజైనర్ ధన్య బాలకృష్ణన్, మేకప్ ఆర్టిస్ట్ రోనాక్స్ జేవియర్, లిరిసిస్ట్ సుహైల్ కోయా, స్టిల్ ఫోటోగ్రాఫర్ అమల్ సి సదర్, కొరియోగ్రాఫర్ షరీఫ్, VFX స్టూడియో 3 డోర్స్.

# 2 రోజుల్లో 3.96 కోట్లు దక్కించుకున్న కపుల్ ఫ్రెండ్లీ

సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా రీసెంట్ గా థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి సూపర్ హిట్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో ఈ సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు 2 రోజుల్లో వరల్డ్ వైడ్ 3.96 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు రావడం విశేషం. హార్ట్ టచింగ్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన "కపుల్ ఫ్రెండ్లీ" మూవీ అందరి ప్రశంసలతో బాక్సాఫీస్ వద్ద సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది.

"కపుల్ ఫ్రెండ్లీ" చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించింది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేశారు.

# తు యా మైన్ పై మణిరత్నం ప్రశంసలు



హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు బిజోయ్ నంబియార్ తెరకెక్కించిన సర్వైవల్ థ్రిల్లర్ చిత్రం 'తు యా మైన్' ఇటీవల విడుదలై ప్రేక్షకుల నుండి, విమర్శకుల నుండి విశేష స్పందనను రాబడుతోంది. శనయ కపూర్, ఆదర్శ్ గౌరవ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, తనదైన ఉత్కంఠభరితమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాజాగా దక్షిణాదిలో నిర్వహించిన ఓ ప్రత్యేక స్క్రీనింగ్ లో భారతీయ చలనచిత్ర దిగ్గజం మణిరత్నం ఈ చిత్రాన్ని వీక్షించి, చిత్రబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సినిమా గురించి ఆయన మాట్లాడుతూ.. "బిజోయ్ నంబియార్ ఈ చిత్రంలో ఒక కైనెటిక్ ఎనర్జీని తీసుకువచ్చారు. ఇది థియేటర్లలో, ప్రేక్షకుల మధ్య కూర్చొని పెద్ద తెరపై చూసినప్పుడే ఆ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించగలం," అని ప్రశంసించారు.

ప్రత్యేక ప్రదర్శన అనంతరం ప్రేక్షకులు కూడా సినిమాపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరు దీన్ని "అద్భుతమైన సినిమా"గా అభివర్ణించగా, మరికొందరు ఇందులోని ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, గ్రిప్పింగ్ స్టోరీటెల్లింగ్ కొత్త అనుభూతిని ఇచ్చాయని పేర్కొన్నారు. మణిరత్నం వంటి లెజెండరీ డైరెక్టర్ నుంచి ప్రశంసలు లభించడం సినిమా విజయాన్ని మరింత బలపరిచింది. కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ పతాకంపై ఆనంద్ ఎల్. రాయ్, హిమాన్షు శర్మ మరియు భానుశాలి స్టూడియోస్ లిమిటెడ్ పక్షాన వినోద్ భానుశాలి, కమలేష్ భానుశాలి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. యువతను లక్ష్యంగా చేసుకుని, మునుపెన్నడూ చూడని ఎమోషన్స్ మరియు సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అంశాలతో రూపొందిన 'తు యా మైన్' ప్రస్తుతం మీ దగ్గర్లోని సినిమా థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

# శ్రష్టి వర్మ కొరియోగ్రఫీలో ధర్మస్థల నియోజకవర్గం



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా..' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ వారంలోనే ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేయబోతున్నారు.

ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు లేని విధంగా.. డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఈ చిత్రంలో ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానున్నారు. 'న్యాయం చేయరా దేవుడా..' లిరికల్ సాంగ్‌తో మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మొదలు పెట్టబోతున్నాం. ఈ సాంగ్‌లో శ్రష్టి వర్మ స్టెప్స్ అందరినీ కనువిందు చేయనున్నాయి. ఈ వారంలోనే సాంగ్‌ని రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేలా ఉత్కంఠ భరితమైన సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం జరిగింది. ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అందించిన లిరిక్స్, స్టార్ సింగర్ సునీత ఆలపించిన పాటలు ఈ చిత్రానికి మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నాయి. అన్ని హంగులతో ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేయనున్నాం. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని తెలిపారు.

# హే బలవంత్ తో ఆడియన్స్ ఫుల్ ఎంటర్‌టైన్ అవుతారు



**హీరోయిన్ శివానీ నగరం**

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బలవంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో శివానీ నగరం సోమవారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

**'హే బలవంత్' ఎలాంటి సినిమా?**

నాది సుహాస్‌తో రెండో సినిమా.. నా కెరీర్‌లో మూడోసినిమా.. సుహాస్‌తో ఇంతకు ముందు చేసిన సినిమాలో చాలా ఇంటెన్స్ క్యారెక్టర్. ఇంటెన్స్ స్టోరీ.. ఈ సినిమాలో చాలా లైటర్ వెయిన్.. ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర. చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన పాత్ర నాది. సినిమా మొత్తం ఆడియన్స్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అవుతారు. చివర్లో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ కూడా అందర్నీ అలరిస్తుంది. సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తారు. నాపాత్రలో ఇన్నోసెన్స్‌తో పాటు కామెడీ కూడా ఉంటుంది.

**ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్‌ను పూర్తిచేస్తారా?**

సినిమా చాలా బాగుంటుంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. సుదర్శన్, సుహాస్, నాపాత్రలు మిమ్ములను బాగా నవ్విస్తుంది. ఇక నరేష్, వెన్నెల కిషోర్ క్యారెక్టర్స్ హిలేరియస్‌గా ఉంటాయి. సినిమాలో ఇంటర్వెల్ బ్యాంగ్ మీకు సర్‌ప్రైజ్ ఉంటుంది. బాగా ఎంజాయ్ చేస్తారు.

**ఈ సినిమా ఒప్పుకుంటానికి రీజన్ ఏమిటి?**

నాకు వచ్చిన కథలో దిబెస్ట్ పిక్ చేసుకుంటున్నాను. ఫస్ట్ సినిమాలో కామెడీలో లేదు. సెకండ్ సినిమాలో ఫుల్ కామెడీ, ఈ సినిమాలో కూడా కామెడీ ఉంది. వినగానే కథతో పాటు నా పాత్ర కూడా బాగా నచ్చింది.

**ఈ సినిమాలో బిజినెస్ ఏమిటి? ఆ బిజినెస్‌తో మీకు ఏమైనా సంబంధం ఉంటుందా?**

లేదండి.,. అది సినిమాలో నరేష్ గారి ఫ్యామిలి బిజినెస్ అది నాకు సంబంధం లేదు. అది థియేటర్‌లో చూసి మీరు ఎంజాయ్ చేస్తారు. కడుపుబ్బా నవ్వుకుంటారు

**ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

.ఈ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలో కలర్‌ఫుల్ విజువల్స్, మ్యూజిక్ బాగుంటుంది. వెన్నెల కిషోర్. నరేష్ కామెడీ అలరిస్తుంది. ప్రతి పాత్ర మిమ్ములను నవ్విస్తుంది.

**మీరు సింగర్ అని విన్నాం?**

కూచిపూడి, సంగీతం నేర్చుకున్నాఉ. సింగర్ టర్నింగ్ యాక్టర్‌ని. లిటిల్ హార్ట్స్‌లో చిన్న హమ్మింగ్ ఉంటుంది. ఆరంభం సినిమాలో ఓ పాట పాడాను. సింగింగ్ కూడా ఓపెన్‌గా ఉన్నాను. అవకాశాలు వస్తే పాడతాను.

**సుహాస్‌తో రెండో సినిమాలో చేయడం ఎలా అనిపించింది?**

నాకు చాలా ఫ్రెండ్లీ.. నాకు సపోర్ట్, చాలా మంచి నటుడు. ఈ సినిమాలో మా కాంబినేషన్ అలరిస్తుంది. మా ఇద్దరి మధ్య సన్నివేశాలను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు.

**పర్సనల్‌గా మీకు ఎలాంట సినిమాలు ఇష్టం?**

అన్ని రకాల సినిమాలు చేయాలని రొమాంటిక్ కామెడీ సినిమాలంటే చాలా ఇష్టం. మూడ్ అప్‌సెట్‌లో ఉన్న ఇలాంటి ఎంటర్‌టైన్ సినిమాలు చూస్తే మూడ్ సెట్ అవుతుంది. అన్నీ తరహా సినిమాలు చేస్తాను.

**మీ తదుపరి సినిమాలు?**

నేను నటించిన సినిమాలు ఓటీటీలో రావడం వల్ల అన్ని భాషల నుండి ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు, తెలుగులో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

# కపుల్ ఫ్రెండ్లీకి సిద్ధు జొన్నలగడ్డ ప్రశంసలు



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన "కపుల్ ఫ్రెండ్లీ" మూవీ ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సాధించింది. ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తూ సోషల్ మీడియా పోస్ట్ చేశారు స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమాకు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతున్నారని, ఇది మనసుకు హత్తుకునే ప్రేమ కథా చిత్రమని తన పోస్ట్ లో సిద్ధు పేర్కొన్నారు. హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మానస వారణాసితో పాటు ఇతర టీమ్ మెంబర్స్ అందరికీ తన శుభాకాంక్షలు తెలిపారు. కపుల్ ఫ్రెండ్లీ మూవీని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించింది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ రూపొందించారు. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో డిస్ట్రిబ్యూట్ చేశారు. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా బాక్సాఫీస్ వద్ద సక్సెస్ ఫుల్ జర్నీ చేస్తోంది. 2 రోజుల్లోనే ఈ సినిమా వరల్డ్ వైడ్ 3.96 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం.

# 24 గంటల్లో 20 మిలియన్లు నాగబంధం



దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం "నాగబంధం" పాన్‌ఇండియా స్థాయిలో భారీ సంచలనం సృష్టిస్తోంది. మహాశివరాత్రి సందర్భంగా విడుదలైన ఈ మిస్టికల్ ఎపిక్ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే 20 మిలియన్‌కు పైగా వ్యూస్ సాధించి, దేశవ్యాప్తంగా ట్రెండింగ్ చార్ట్‌స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోవడం ద్వారా పాన్‌ఇండియన్ లో అదరగొట్టింది. ఈ అచీవ్మెంట్ ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టేది డైరెక్టర్ అభిషేక్ నామా విజన్. అంతర్జాతీయ స్థాయి విజువల్ స్పెక్టకిల్‌ను అందించారు. ఆయనతో పాటు హీరో విరాట్ కర్ణా, డెబ్యుటెంట్ నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి కలిసి వరల్డ్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మించారు. టీజర్‌లో ప్రత్యేక హైలెట్ గా నిలిచింది విరాట్ కర్ణా ట్రాన్స్‌ఫర్మేషన్. తన గత ఇమేజ్‌కు పూర్తి భిన్నంగా, శివుని అవతారంలా కనిపించడం, హై ఎనర్జీతో ఆయన చేసిన నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. టెక్నికల్‌గా "నాగబంధం" కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తోంది. హైఎండ్ వివిఫ్ ఎక్స్‌లు సహజంగా అనిపించేలా ఉండటం, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్ , అద్భుతమైన సినిమాటోగ్రఫీ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కథలో ఉన్న భారీ స్కేల్‌ను నిజ జీవిత అనుభూతిగా మార్చేందుకు నిర్మాతలు ఎలాంటి ఖర్చుకూ వెనుకాడలేదని స్పష్టంగా తెలుస్తోంది. టీజర్ హైప్ నుంచి సమ్మర్ రిలీజ్ దిశగా ప్రయాణిస్తున్న ఈ చిత్రం చుట్టూ ఉన్న బజ్ రోజురోజుకీ పెరుగుతోంది. మోడరన్ స్టైల్‌లో పురాణ కథనాన్ని చూపిస్తూ, అభిషేక్ నామా, ఆయన టీమ్ ప్రేక్షకుల అంచనాలను నెక్స్ లెవల్ కి తీసుకెళ్లారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.